న వ భా ర తి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

7 మే 1960

మూల్యం : రూపాయి

న వ భా ర తి కా ర్యా ల యం

టెలిగ్రామ్స్ నవభారతి   టెలిఫోన్ . 482

గాంధీనగరం * విజయవాడ-2

విషయ సూచిక

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 2 | విజయవాడ * మే 1960 | సంచిక 8

ఆనాడే మానవాత్మకు విముక్తి

మనకు మతమనునది యున్నది. మనకు దైవభావమను విశ్వాసమున్నది. మనకు సంప్రదాయమనునది యున్నది. మనకు మన సంస్కారమనునది యున్నది. మనకు మన కళలనునవి యున్నవి. మనకు మన విద్యలనునవి యున్నవి. ఇవి మన సంస్కృతీవికాసమునకు ప్రతి రూపములని భావించుచున్నాము ఈ వీటిపై అభిమానమును పెంపొందించుటకు అనుశ్రుతముగా మన కృషి మనము చేయుచునే యున్నాము. అయినను పరభావదాస్యము మనకు తప్పకనేయున్నది. ఇది మన దౌర్బల్యమో లేక విశాలభావ సంస్కారమునకు ప్రాతిపదికయో చర్చించి తెలుసుకొనవలయును.

ప్రపంచమున అనేక మతములనునవి యున్నవి, ఈ మతములలో ఏది ఉత్తమమైనదో, ఏది మధ్యమమైనదో, ఏది సామాన్యమైనదో వివేకించుకొని నిర్ణయమునకు రావలయును.

మనకు దైవభావమను విశ్వాసమున్నది. ప్రపంచములోని అన్ని దేశములలోను దైవమను భావముపై నమ్మకముఉన్నది. ఈ దైవభావమను నమ్మకమునకు వ్యక్తిగతమైన రూపధారణనిచ్చి భక్తివిశ్వాసములను ప్రజలలో ప్రబలముచేయుటకు కృషిచేయుట మనము గమనించియే యున్నాము. తమ తమ దేశములలో తమ తమ సంప్రదాయముల కనుగుణముగా యీ ప్రచారము సాగించబడుచున్నది. ఈ ప్రచారము ఉత్తమమైనదా? లేక మధ్యమమైనదా? కాక సామాన్యమైనదా?యను శంకలను నివారించుటకు విషయ వివేచనతో విపులీకరించబడి యున్నదో లేదో మనము గమనించవలయును.

ప్రతి దేశమునకు సంప్రదాయమనునది యున్నది. ఈ సంప్రదాయము అనుశ్రుతమైనది కావచ్చును, ఆగంతుకమైనది కావచ్చును. ఈ సంప్రదాయము ఉత్తమ, మధ్యమ, సామాన్యభావములు కలిగి కుటుంబధర్మ నిర్వహణలోను, సాంఘికసంబంధ బాంధవ్యములలోను అనుసరించబడు చుండును. ఈ సంప్రదాయము ఉత్తమమైనదా? మధ్యమమైనదా? సామాన్యమైనదా? యను సందేహము కలుగని విధమున సవిమర్శన చేసి చెప్పవలయును.

ఈ లోకములోని వారందరికీ సంస్కారమనునది యున్నది. ఇది భిన్న భిన్న రూపములు ధరించి భిన్నభిన్న విధముల ప్రవర్తిల్లుచున్నది. ఇందులో ఏది ఉత్తమ మైనది? ఏది మధ్యమమైనది? ఏది సామాన్యమైనది? వివేచించి, విపులీకరించి విజ్ఞాన వికాసము కలిగించి మన నడవడికను నాగరీకము చేయునటుల తెలియ జేయ వలయును

ప్రపంచమున లలితకళలనునవి యున్నవి ఈ కళలు మానవుని ఆత్మోన్నతికి ఎంత వరకు దోహదముచేసినవీ పరిశీలించి ప్రయోజనాప్రయోజనములను నిర్ణయించి చెప్పవల యును. ఈ కళాత్మకమైన భావన ఉత్తమ, మధ్యమ, సామాన్య స్వభావము కలిగియున్నది లేనిది వివరించవలయును

విశ్వమంతట విద్యలనునవి యున్నవి ఈ విద్యలు సామాన్య, మధ్యమ, ఉత్తమ స్వభావ స్వరూపములు కలిగి పౌరుని వివేకవంతుని చేయవలయును ఈ విద్యలు వివేకోదయ మునకు మాత్రమే కాక వ్యవహార నిర్వహణకుకూడ తోడ్పడును. విద్య వివేకమునకు దోహ దము చేయవలయునా? వ్యవహార నిర్వహణకు తోడ్పడవలయునా? అనునది సమస్యగా నున్నది. విద్య విజ్ఞాన సముపార్జనమునకని కొందరు, విద్య లోకవ్యవహారమునకని మరి కొందరు వాద ప్రతివాదములు చేయుచున్నారు విద్య విజ్ఞానప్రదము, వ్యవహారప్రదము అయి నపుడే యీ భౌతిక సంబంధమైన సర్వసమస్యలకు పరిష్కారమార్గ మేర్పడును విజ్ఞానమను నది యంతయు వ్యవహారమునకు మాత్రమే తోడ్పడునని సుస్పష్టముగా గ్రహించవలయును. ఈనాడు యీ విశ్వజనీనమైన విద్యా సముపార్జనయంతయు వ్యవహార నిర్వహణమునకుమాత్రమే దోహదము చేయుచున్నది

జ్ఞానమునకు, విజ్ఞానమునకు, వ్యవహారజ్ఞానమునకు అంతరములనునవి యున్నవి, వ్యవ హారజ్ఞానము సామాన్యమైనది. విజ్ఞానము మధ్యమమైనది. జ్ఞానము ఉత్తమమైనది ఈ తార తమ్యములను గ్రహించి మనమీ ప్రపంచమున వ్యవహార నిర్వహణ చేయవలయును.

మన మన మత విజ్ఞానము, మన మన సంప్రదాయజ్ఞానము, మన మన సంసారజ్ఞానము మన మన కళాసంస్కృతుల జ్ఞానము, మనమన విద్యావిషయముల సంపన్నజ్ఞానము, యీ వీట న్నింటికి కర్తృత్వము వహించి యీ సృష్టి స్థితి లయ కార్యకారణ సంబంధములకు ఆధార భూతమై యే దైవభావము మనలను నడిపించుచున్నదో అది యిది అని నిర్వచించరానిదని మనము భక్తి విశ్వాసములుంచి ఫలితా ఫలితముల నాశించక, విధి నిర్వహణచేయుదుమో ఆనాడే యీ సమస్యలన్నీ పరిష్కరించబడి మానవాత్మకు విముక్తి కలిగి జిజ్ఞాసులై కలకాలము వర్ధిల్ల వచ్చును.

పంచవటి

శ్రీ కే. వేం. నృ. అప్పారావు

అంబు సమజ్జనంబు తఱినబ్జపరాగము మేననల్చుఁ, గూ
లంబున నిల్చువేళలఁ దరంగములన్ బదధావనంబు సే
యుం, బనితీఱి సంజతఱి నొడ్డున నేఁగఁగఁ దోడువచ్చుఁ, దా
నంబయు, దాసియున్, సఖియునౌ నిటు లీ నది యేదికాదిటన్.

ఇది విని రాఘవుండనె ముఖేందుఁడు సుందరమందహాస కౌ
ముది వెదఁజల్లఁ జెల్వఁగని "ముద్దియ! యిందొక వింత యున్నదే!
సదమలయజ్ఞ సీరముఖ జాతవు సీతవు నీవు, ఈమె యో
నది, భవదీయసంగతి యనల్ప శుభావహ మీ జగానకున్.

"హాలమున్ దున్నను జేతఁబూని హాలమున్ భూమీశుఁడే యయ్యు, ను
జ్జ్వల భోగాస్పదుఁడయ్యు సక్తి విడి జీవన్ముక్తతం గాంచి రా
జిలు, ముక్తుండయి లోక సంగ్రహ రతిన్ జేయున్ స్వధర్మంబు దా
నలరాజర్షి, తదీయ సాధనకు యోగ్యంబౌ ఫలంబీవెకా!

"జలదానీకము నేలు వానికిని దుస్సాధం బహల్యాకరం
బలవోకన్ గ్రహియించి కాంచెఁ బ్రసవం బౌరా! శతానందకం
బు, లలాటాక్షుని మించఁగోరి యనఁదాఁ బూనెన్ బదంబందుఁ గ
న్నల బ్రహ్మర్షి, తదీయ సత్త్వమె నద్యాకార మిట్లయ్యెఁ జూ!

"స్వజననపూత భూతల సుచారు చరిత్రల మిమ్ము నిర్వురన్
వృజినముడిందఁ గాంచియు, స్పృశించియు మైపులకించు నిచ్చటన్
నిజముగఁ గాన కంపి గణనీయ మహోపకృతిం బొనర్చె నా
దుజనని, కాని యొక్క మితితో నిడె దీని నటంచుఁ గుందెదన్.

"శరనిధి సంగమంబునకుఁ జక్కఁగ సాగు సరిల్లలామ యి
క్కరణిని బుణ్య పంచవటి కాననసీమఁ జరించునంచుఁ గా
కరుదుగ బ్రహ్మతత్త్వమున నైక్యమునొందఁగఁ బంచకోశమౌ
నరతనువందు జీవ గమనం బిటు సాగునటంచు నెంచెదన్.

"సుంతయు విశ్రమంబు గొను చొప్పు గన బడదైనఁ జింత కా
సంతయు లేక బ్రహ్మగిరి యాదిగఁ బూర్వ సముద్రతీర ప
ర్యంతము సాగి యెల్లరను రంజిలఁజేయును స్వాదు వారిచేఁ
గాంతరో! నేర్పు నీ నది జగజ్జనపాళికిఁ గర్మయోగమున్.

"వాసిగ భూధరాగ్రములు స్వైరగతిన్ వెలువర్చు తోయముల్
రాసిగఁజేసి దప్పిగొను ప్రాణులకెల్ల సమంబుగా నిడున్
వేసవియైన వర్షఋతువే యయినన్ విషమత్వ మొప్పకే
ళాసిలు నీ స్రవంతి జనపాళికి నేర్పదె సామ్యయోగమున్

"మంజీరారవయుక్తఁ బ్రాణహిత సమ్యక్సక్తయా కిన్నదిన్
సంజాతోత్పుల కాంగియై యెటు పరిష్వంగంబు కావించెనో,
గుంజాహారను వృద్ధమూర్తి శబరిన్ గూర్చెన్ హృదిన్ దద్విధిన్
మంజుప్రేమ రసాత్మకాక సుజనుల్ మైకోభ వీక్షింతురే!

"స్థిరదృష్టిన్ దననాసికాగ్రమున నిక్షేపించు నాత్త్యంబకే
శ్వరు మౌళిన్ బ్రభవించి, తీవ్రగతి వేశాంతప్రవాహాకృతిన్
ధరియింపన్ జనుచంతలో నడుమ నాత్మారాము నీక్షించి, త
ద్వర పాదాబ్జములంటి, కాంచె నచటన్ భద్రాచలారోహణమున్.

"ప్రక్రాంతంబగు స్వీయమార్గమున శైల వ్రాతమున్ దాఁటుచున్
జక్రావర్త జలంబు పాపిగిరులన్ సన్మాన్యమున్ జేయ, ని
ర్వక్రస్ఫూర్తిని సర్వసేవ్యము, మహానందిత్వ సంధాయియౌ
విక్రాంతిన్ బయనించు నీపె సకలోర్వీతాపనిర్వాపయై

"అటఁజని కాంచె నిత్తటిని యజ్ఞవినాశన దృష్టవిక్రమున్
పటుతర భీషణాకృతిని బట్టి సనక్తుని వీరభద్రునిన్,
కుటిలత యజ్ఞభోక్తలయి కూడిన దేవతలెల్లఁ దత్క్రుధన్
బటఫట పేలగింజలయి పాఱరె చేతి హవిస్సు వీడుచున్!

"నాలుక లంటఁగోసె సుమనస్సులలోఁ దగునగ్రభోక్తకున్,
కాలనుదన్ని యర్థపతి గాత్రము వే పొరలించె నేలపై,
చాలక వేయిచేతులను జాపిన వేలుపు పండ్లు డుల్చె, ది
క్పాలకులైన వారల యవస్థయు నక్కట! యేమి చెప్పుదున్!

యోగదర్శనము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

సమాధి విశేషములు

ప్రాణాయామ విశేషముచేగాని భావోద్రేకముచేగాని అద్భుతమగు దివ్య దర్శనము మొదలగువానిచే గాని మనస్సు నిశ్చలము కావచ్చును. వీనిలో ప్రాణాయామముచే ఏకాగ్ర మగు వృత్తి ఉదయించును. అది ఇంకొక వృత్తికి చోటొసగదు.

భావోద్రేకముచే ఆనందము పొంగి దివ్యభావ ముదయింపవచ్చును. దివ్యజీవితము నందిది యొక గొప్పఘట్టము. మరియు నిది ఇంకొక విధముగా ఆధ్యాత్మిక స్ఫూర్తిగా వికసింపవచ్చును. 'ఆనందవికాసమే ప్రపంచము' అని అనుకొను ఆనంద సాధకులు ఆనందములో మునిగిపోవుటయే సమాధి యని యందురు.

భక్తిసాధకులలో నొకానొక తెగవారు చేతనతోడి ఆనందము ఉక్కిరి బిక్కిరి చేసి చిత్తమును ముంచివేయగా బాష్పములు జాలువారినంతనే కొలది బాహ్యజ్ఞానముతో ఉదాసీను లగుచుందురు ఇవియు ఇట్టివియు నగు భావసమాధులను వానిని సాధించిన సాధకులను మన మటనట గనుగొను చుందుము.

అద్వైతులు ఆరు విధములగు సమాధులు చెప్పిరి. యోగులు ద్వైతులు. కావున సిద్ధాంతములలో యోగులకును అద్వైతులకును కొంచెము భేద మగపట్టు చుండును. అయినను యోగదర్శనము చెప్పిన సమాధిసాధనను అద్వైతులేకాదు. మరి యెవరును నిరసింపరు. కాని అద్వైతులు తమ అద్వైతమును నిలిపికొనుటకు సాధనయెడ కొంచెము వేరుతోవ తొక్కిరి. ఈ రెంటికిని మేనమామపోలికలు చాల నున్నవి.

వారి మతమున సమాధి సవికల్పము నిర్వికల్పము అని రెండు విధములు. యోగమునకును అద్వైతమునకును భేదము తెలియనివారు సవికల్పమనినను సంప్రజ్ఞాత మనినను సబీజ మనినను ఒక్కటియే యనియును ఇట్లే నిర్వికల్ప మనినను అసంప్రజ్ఞాత (1) మనినను నిర్బీజ మనినను ఒకటియే యనియును అనుకొందురు. కాని వీని యాథార్థ్యము వేరు. పదములందును అర్థమునందును వీనికి చాల పోలిక లున్నవి:

ఈ రెంటిలో సవికల్పసమాధి ఆంతర దృశ్యానువిద్ధ మనియు ఆంతర శబ్దానువిద్ధ మనియు రెండు విధములు.

---

(1) 'ప్రశాంతవృత్తికం చిత్తం పరమానంద దీపకమ్
అసంప్రజ్ఞాతనామాఽయం సమాధి ర్యోగినాం ప్రియః' ముక్తికోపనిషత్ - ౨-౫౪

అంతర దృశ్యానువిద్ధము

వీధిలో పదుగురు పోట్లాడుకొనుచుందురు వారికి ఎట్టెదుట నొక యిల్లున్నది ఆ యింటివాడు కలహించువారిలో చొరబడక యేమియు కల్పించుకొనక కనులార చూచుచుండును అట్టివానిని సాక్షి అని యందుము ఇటులే 'నేను వీడు నాది నీది' అనియు, 'కోరికలు కోపములు తాపములు మొదలగు వృత్తులు మదిలో మల్లడి గొనుచుండును. ఈ వృత్తులకు వేనికిని వశుడు కాక వానిని వేరుగా చూడ గలిగినవాడు సాక్షి అని అనిపించుకొనును. కావున 'కామాదివృత్తులు దృశ్యములు, వీనికి నేను సాక్షిని, దేహము మొదలు బుద్ధివరకును గల యీ మొత్తము నేను కాను' అను తెలివిచే భ్రాంతికతన దోచు దృశ్యమునంతయు తనయంద యడచి తన్నుదా చూచుచుండు నవస్థ అంతర దృశ్యానువిద్ధము. మనసునందు తోచు వృత్తులు అను దృశ్యముతో అంటియున్నది అని దీనికర్థము ఈ సమాధిలో అనగా కొంత ఏకాగ్రమగు మనోఽవస్థలో ఆత్మాకారమగు వృత్తితోపాటు తెలిసికొను వాడును తెలివియు తెలియదగినదియు అను త్రిపుటయు మినుకు మినుకు మను చుండును. మట్టితో జేసిన ఏనుగును చూచుచుండునపుడు ఏనుగుతోపాటు మట్టిని గూడ చూడకతప్పదు. 'మట్టిని జూచినపు డేనుగులేదు, ఏనుగును జూచినపుడు మట్టి లేదు' అనునది వేరుమాట ఆ మనోఽవస్థ వేరు

అంతర శబ్దానువిద్ధము

ఇటులు దృశ్యమును తనయంద యడచి- 'నేను స్వప్రకాశుడను, జ్ఞానస్వరూపుడను, ద్వైతవర్జితుడను, అంతరాత్మగా నిత్యసిద్ధుడను, సదానందుడను, అను ఇట్టి సన్మాత్రమగు ఆత్మను పట్టుకొనగల వృత్తిచే ఆ యాత్మస్వరూపమును బోధించు శబ్దములు నిరూపించు వస్తువును హృదయమున భావనచేయుట అంతర శబ్దానువిద్ధము. మనసులోమనసులో శబ్దములతాకు ఈ సమాధిలో నుండు నని దీనికి అర్థము. సాధకు డీ సమాధిలో నేను సాక్షిని, అంతరాత్మను అని తలచును. కోరికలు మొదలగు వృత్తులకు వేరయిన ఆత్మ యీ సమాధిలో విషయము. ఆత్మజ్ఞాన ప్రవాహ మిం దుండును దీని యందును నేను ద్వైతవర్జితుఁడను. అని 'తెలియువాడును తెలివియు తెలియదగినదియు అను త్రిపుటి యుండును. కాన నిదియు సవికల్పము.

నిర్వికల్ప సమాధి

తన్నుదా నెరిగిన తనుపున నిట్టనిలువుగా మునిగిన ముంపుచే దృశ్యము శబ్దము అను నీ జంటను ఒప్పరికించి నీటబడిన ఉప్పుగల్లు నీరుగనే అయిపోవు చంద ముగా బ్రహ్మాకారము నొందిన వృత్తి బ్రహ్మమాత్రమయి తాను వేరుగా కనబడని అవస్థ నిర్వికల్పము. సంతతమును సవికల్పసమాధిలో నుండుటవలన విషయాసక్తికి

ఫలమగు విక్షేపము తొలగి నిర్వికల్పసమాధికి దారితీయును. నిర్వికల్పసమాధిలో త్రిపుటి బ్రహ్మవృత్తియందు అడగును సవికల్పసమాధిలో మానసికమగు క్రియ ఉండును. నిర్వికల్పసమాధిలో అది అడగును. నిద్రలో తనయెరుక ఉండదు. నిర్వికల్ప సమాధిలో తనయెరుక తోచని అనుభవము ఉండదు. సదసద్విచారణా ఫలమగు వివేకము కలిగినపిదప సాధకుడు బాహ్యప్రపంచము నెడల ఉదాసీను డగును ఈ యవస్థలో సాధకుడు వృత్తిశూన్యు డెట్లగునో అట్లు ఆనందపూర్ణు డగును. ఈ యవస్థను వసిష్ఠుడు ఆకసమందును సముద్రమునందును ఉంచిన కుండనుగా పోల్చెను ఆకసమందుంచిన కుండ లోపలను బయలే వెలుపలను బయలే. సముద్రము నందుంచిన కుండ లోపలను నిండే వెలుపలను నిండే.

బాహ్య దృశ్యానువిద్ధము

లోగడ జెప్పిన సమాధులలో సాధకుడు తన స్వభావము సచ్చిదానంద స్వభావమని యెరుగును. ఇక బాహ్యప్రపంచమునందలి విషయముల నాధారముగా గొనియు సమాధి నభ్యసింపవచ్చును, ఇట్టి సమాధిచే ప్రపంచ స్వభావమును బ్రహ్మ స్వభావమును ఎరుగ నగును.

తెల్లదనము చల్లదనము ద్రవత్వము అను నీ మూడును నీటి గుణములు. నిడుదతనము కెరటము అను నీ రెంటిలో మొదటిది రూపము రెండవది నామము. వీని నన్నిటిని కలగ పులగముచేసి లోకులు కెరటమందురు. అట్లే ఉనికియు ఎరుకయు ప్రేమయు బ్రహ్మస్వరూపము ఇట్టి స్వరూపమునందు నామరూపముల నధ్యస్తముచేసి దానిని లోకులు ప్రపంచమని వాడుదురు. ఇది తెలిసి సాధకుడు ప్రపంచమునందు కానిపించు వస్తువులన్నింటియు నామరూపములను బ్రహ్మము నందే విలాపన మొనరించి కెరట మని పేరే కాని నీరే యని తెలిసికొనునట్లు 'నేను ఈ నామరూపములకు అధిష్ఠానమను' అని తెలిసికొనును. వెలుపలివస్తువు లీ సమాధిలో విషయము కావున ఇది బాహ్యదృశ్యానువిద్ధము.

బాహ్య శబ్దానువిద్ధము

సాధకుడు నడచుచును నిలుచుచును పడియుండుచును ఎపుడును దృశ్యమును నామరూపాత్మకము నగు ఈ ప్రపంచము తనకు అధిష్ఠానమును అఖండైకరసమును సచ్చిదానందలక్షణము నగు వస్తువే యను సంతతచింతనము బాహ్య శబ్దానువిద్ధము. ఆంతర శబ్దానువేధ కల సమాధిలో శబ్దానుగతమయిన సంబంధము తనతో. ప్రకృత సమాధిలో శబ్దానుగతమగు సంబంధము ప్రపంచముతో. ఈ సమాధియందును తెలియువా డొకడును తెలివి యొకటియు తెలియదగిన దొకటియు నుండెగాన నిది సవికల్ప సమాధి భేదమే ఈ సమాధి బాహ్యదృశ్యానువిద్ధసమాధి కంటె దొడ్డదియు బాహ్య నిర్వికల్పసమాధి కంటె కీస తక్కువ యనియు నందురు.

బాహ్యానిర్వికల్ప సమాధి

బ్రహ్మానంద రసావేశముకతన బాహ్యప్రపంచము ఉన్నటులే యెరుగక బ్రహ్మస్వరూపముతో ఏకత్వ మెనసి సాధకుని చిత్తవృత్తి గాలి లేని చోట పెట్టిన దీపమువలె నుండును ఇది బాహ్యా నిర్వికల్పము నిర్వికల్పసమాధిలో వలె ఇందును మాయచే ప్రతీత మయినదెల్ల కెరటము నీరే యని తెలిసినటులు బ్రహ్మమే అని తెలియును. మరియు దృశ్యముతోపాటు బ్రహ్మమునందును గల అఖండత్వము ఏకరసత్వము మొదలుగా గల విశేషములు కానరావు. ఇటులగుటజేసి చలనముతో పాటు చిత్తమును అడగును. (2)

బ్రహ్మజ్ఞానమువలన ఆనందము కలుగును. బ్రహ్మము రసమనియు ఆనందమనియుగదా శ్రుతి చెప్పును. అట్టి బ్రహ్మమే తాను. ఆంతర సమాధులలో దృశ్యమునకు సాక్షియగు 'తాను' బ్రహ్మాభిన్నుడగును. ఇటులు కానినాడు అధిష్ఠానములేని ఆ సమాధి నిర్వృత్తికమయినను శూన్యమునందే పర్యవసన్న మగును ఇక ఇటులు బాహ్యసమాధులలో వ్యాపకతాస్వభావముకలిమి ప్రపంచమునం దెల్లెడ నిండియుండిన అఖండరసైకబ్రహ్మము తనతో ఏక మగుచున్నది. బ్రహ్మజ్ఞాన మానందముతో కలిసియున్న చందముగనే ఆత్మజ్ఞానముగూడ ఆనందముతో కలిసియే యున్నది మరియు దేహాభిమానము పోవుటతోపాటు పరమాత్మ యెరుక కలిగి మనస్సు ఎచ్చటెచ్చటి కేగినను అచ్చటచ్చట సమాధులే యని అద్వైతు లందురు. అనగా పైజెప్పిన సమాధులను జ్ఞానపూర్వకముగా చిరకాలము అభ్యసించినయెడల సాధకుడు ఆంతర విషయములును బాహ్యావిషయములును సమస్తమును బ్రహ్మమని తెలిసికొనును పామరుడుగూడ అనిత్యము లనియు అసత్యము లనియు నెరుగు నామ రూపములను నిత్యమును సత్యము నగు బ్రహ్మమని సాధకు డరయును. అతనికి క్రిందను మీదను ముందును వెనుకను డాపలను వెలుపలను బ్రహ్మమే. మొదట మొదట ప్రయత్నముచే నెరిగికొనినది పిదప పిదప అప్రయత్నకృతముగను స్వాభావికముగను అయిపోవును.

యోగదర్శనము చెప్పు సమాధు లివి కావు. వానికిని వీనికిని గల పోలికల నెరుగుటకే యిచట నివి వివరింపబడినవి ఇక ప్రకృతమునకు వత్తము.

---

(2) సరస్వతీ రహస్యోపనిషత్తునందు ఆరు విధములయిన యీ సమాధులు చెప్పబడియున్నవి దృగ్దృశ్య వివేకమునందును సర్వవేదాంతసార సంగ్రహమునందును ఇవి చెప్పబడినవి వీనిలో దృగ్దృశ్య వివేకమునందలి శ్లోకములును సరస్వతీ రహస్యోపనిషత్తునందలి శ్లోకములును ఒకటియే. దృగ్దృశ్యవివేకమునే సరస్వతీ రహస్యోపనిషత్తు ఉట్టంకించుకొనె నని విమర్శకుల అభిప్రాయము సర్వవేదాంతసార సంగ్రహము స్వతంత్రముగనే వీనిని చెప్పి యోగులు చెప్పు సమాధులను యమనియమాదులను ఇంకొకరీతిగా అద్వైత ప్రక్రియ యం దంతర్భావ మొనరించెను.

చిత్త భూమికలు

క్షిప్తమనియు మూఢమనియు విక్షిప్తమనియు ఏకాగ్రమనియు నిరుద్ధమనియు చిత్తభూమిక లయిదు. అతి చంచలమును ఏ విషయమునందేనియు కొంచెము సేపు అంటిపెట్టుకొని యుండజాలని చిత్తము క్షిప్తము. ఈ భూమికలో నున్న చిత్తము జ్ఞానగర్భ మగు సమాధికి పనికిరాదు.

ఏదో ఒక విషయము ఆకర్షించు ననుకొందము. ఆ యాకర్షణమునకు లోగబారి ఆ విషయముతో సమాహితమగు చిత్తము మూఢము దవ్వులనున్న బంధువు నెడ చిత్తము ముగ్ధమగును మోహావిష్టమగుటచే ఇట్టి చిత్తముగూడ సమాధికి పనికిరాదు

ఒకచిత్త మొకపుడు నిలుకడగా నుండును ఇంకొకపుడు నిలుకడగా నుండదు. ఇట్టి చిత్తమునకు శ్రవణమునందును మననమునందును అధికారము కలదు. దీనికి సమాధ్యధికార మున్నను వేళావేళలున్నవి కావున నిశ్చలత పొసగనేరదు దీనజేసి ఈచిత్తమునందు నిండుతెరుక నెలకొనజేయుట అంత సులభము కాదు ఒకవేళ ఈ చిత్తము సమాహితమై సూక్ష్మజ్ఞానము కలిగి అనగా తన్మాత్ర ప్రత్యక్షతచే సుఖదుఃఖమోహములకు లోగకతప్పదు ఏలనగా ఈ చిత్తమునకు విక్షేప మున్నది కావున ఈభూమికలోని చిత్తమున సమాధి ఒదవినను అది నిలుకడగా నుండదు సాధకులలో పలువుర చిత్త మీభూమికలోనిదే.

ఒకదానినే పట్టుకొని యుండునది ఏకాగ్రచిత్తము (3) చిత్తము ఈశ్వరుని అవలంబనము కావించుకొనిన దని యనుకొందము ఆ యవలంబనమును వదలక అటులే ఉండగల చిత్తము ఏకాగ్రచిత్తము అలవాటు చొప్పున ఇట్టి నిలుకడ స్వభావమై రే యనక పవలనక యెక్కువసేపు ఏకాగ్రము కాగలిగి కలయందును అట్టి కలయే కనగలిగినను అట్టి చిత్తమును ఏకాగ్రభూమిక మని యననగును ఈ భూమికలో నున్న చిత్తము సాధనచేసి సంప్రజ్ఞాత సమాధి పొందగలదు ఈ సంప్రజ్ఞాతసమాధియే ప్రకృతమగు యోగము మరియు కైవల్యమునకు సాధకము. ఈ భూమికలోనే సంప్రజ్ఞాతము సిద్ధించును గాని క్షిప్త మూఢ విక్షిప్త భూమికలలో సిద్ధింపదు. మూఢభూమికలలో సైంధవునకు సిద్ధి కలిగినటు లూహ చేయవచ్చును గాని దానిని చెడ్డ ఫలమిచ్చిన దానినిగాను ఊహింపవచ్చును. పురాణములలో పలువురు తపస్వుల తపస్సు అచ్చరలచేగాని మన్మథునిచేగాని యింద్రుడు భంగపరచిన కథ లున్నవి వారి చిత్తములు క్షిప్త మూఢ విక్షిప్త భూమికలలోనివి.

ఇట నిది గమనించునది- సంప్రజ్ఞాతయోగము కేవలము సమాధికాదు సమాధిప్రజ్ఞ చిత్తాయత్తమగునేని అది సంప్రజ్ఞాతయోగము

'ఏకాగ్రభూమిలో నొదవిన సమాధి సత్ స్వరూపార్థమును వెల్లడించు' నని భాష్యము. కావున విక్షిప్తభూమికలలో నున్న సాధకులు తమ చిత్తము నెపుడును ఏకాగ్ర మొనరించుకొనవలెను

---

(3) 'ఏకమ్ అగ్రమ్ అవలంబనం యస్య' ఏకాగ్రమ్ । 'త్వ మగ్రభూమి ర్నిరపాయ సంశ్రయా' ఈ మొదలగు మాఘాదిప్రయోగముల నారయునది.

రేయింబవళులలో ఎక్కువకాలము వృత్తులు అరికట్టబడియుండు చిత్తము నిరుద్ధ చిత్తము. నిరోధ మనగా ప్రత్యయహీనతయే. ఈ చిత్తమునం దేవృత్తియు మొలకెత్తదు. సమాధి గట్టిపడిన యెడల ఈ యవస్థ సుస్థిత మగును. ఇట్టిచిత్తము నిరుద్ధభూమికము. సకల వృత్తి నిరోధము యోగచరమ భూమిక. ఈ భూమికలో చిత్తము లీనమగును ఏకాగ్ర భూమికలో చిత్తము సర్వార్థము కాదు. అనగా ఇంద్రియము లేవిషయముతో సంబంధపడిన ఆ విషయమునందు సంబంధము పెట్టుకొనదు. ఇటులు పెట్టుకొనక తా నవలంబించిన పట్టు గొమ్మనే పట్టుకొనియుండును. ఈ రీతిగా ఏకాగ్రభూమికలోని చిత్తమున సర్వవిషయ విలయపూర్వకమగు ఒకే ఒక వృత్తికి ఉదయము. నిరుద్ధభూమికలో వృత్తికి అనుదయము. ఈ భూమికలో చిత్తమున ఒదవిన సమాధిని ఏకాగ్రభూమికలో చిత్తమున ఒదవిన సమాధిని యోగము అని అందురు.

విశ్వనాథ మధ్యాక్కఱలు

నందమూరు శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౭

పోరి నా జపంబంతయును బటాటోపమునకుఁ జేయకువె
యరయ నంతస్తాపమునకుఁ గాక నా యతిమధ్యమున
శిరసునఁ బింఛమ్ములోస యొక యీక చిన్నారి కన్ను
విరియవే నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

వినుటయు నర్థమౌటయును మరల జ్ఞప్తిని దవుల్కొనుట
మననంబు మనసు నిల్పుటయు గుండెలో మాగుట వదలి
మనలేక యుండుట యదియు యాటగా మన్నింపు నీదు
వినుకలి నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

పోయెడునది దాని దారిఁబడి నది పోవుచు నుండ
మాయురే కూర్చుండి దానినొక్క నమస్కారమనుచుఁ
జేయను వలెఁగాక నే నొకింతయుఁ జేయను జాలఁ
శ్రేయమై నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

నా కోపమునను దపించి పోవుచున్నావేమొ నా ప్ర
భూ! కామమున కిల కఱచుకొని పోవుచుంటివో! రసధు
నీ కేళి నొకటి మండించు నొకటి యొండించు వల్ల
పీ కృష్ణ! నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

అంతయు రెడ్డివచ్చె మొదలాడు మన్నట్లుగా నుండె
పింతయై నాకథ నీయెడఁదజాలి పీసంబు లేక
యింతగా నా ధ్యాన మెపుడు నా ధ్యానమే కోర్కులు విడి
పింతువా! నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

వంద విధాలుగాఁ జూచినంగాని వ్యర్థతా వధిగ
సందీపితంబగు నీ జగంబెల్ల సౌందర్యమంచుఁ
దందానతాన పాడెదరు మోహా సందానితాత్మాంశు
బృందంబు నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

ఒక పెద్ద పొంగుగా వచ్చి నా గుండె నొక్క మట్టమ్ము
నకుఁ దెచ్చి యాపెద వచట మరల నేనాటికో యింక
నొక పొంగు తెచ్చుట పొంగులారిన యున్నతాచ్ఛ పద
వికిఁ జేర్పు నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

పొంగుగా నీ వచ్చినపుడు జీవితమునఁ జారితార్థ్య
సంగతి కనినట్టు లుండుఁ బొంగరు సమయంబునందుఁ
గొంగ జపంబన్న యట్టులుండుఁ గైకొక ముంగలయుఁ
బింగల నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

ఆచారము లతిక్రమించుటకును బ్రహ్మ జ్ఞానబుద్ధి
యాచారింప ధనాదికమ్ము వ్యవహార మధికమౌ శ్రద్ధ
నా చెట్టతనము మన్నింపుమని భక్తి నటన బృందాగ
వీచార! నందమూర్నిలయ సంతాన వేణు గోపాల

లౌకికషుమ్ముల యందు నా ప్రతీక్షాబలంబు సర్వమును
నీ కోప మన్నట్లుగాఁగ నుండెడు నీవ స్ఫురించి
నీకుఁ గానట్టి యీ కోర్కులేల మన్నింతునో యన్న
వేకిధ్యై నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

అలుపమ్ములైన నాదు సుఖదుఃఖమ్ము లా సమయములు
నొలయు భాగ్యాభాగ్యములును రోగాదు లొక కొంత నీవు
కలిసి యీ చిత్రమైనట్టి మేనుగాఁ గట్టినట్లుగను
వెలసెడి నందమూర్నిలయ సంతాన వేణు గోపాల

నీ వుంటి వను నూహలేక బ్రతుకగా నేనేల రాళ్లు
లేవొ వృక్షంబులు లేవొ జంతువుల్ లేవొ యీ నేను
నీ వుంటివని విశేషించి బ్రదుకుచుంటిని సుధాబోధ
వీవధా నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

బ్రదికియుండియు నేను దలఁచుచుంటిని బ్రదికి లే ననుచు
బ్రదికియు బ్రదుకకకూడ నొక్కచే ఫలితమంచెంచి
నిదురలో సైతమ్ము సర్వవేళల నీ తత్త్వమునకు
వెదకుచు నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

ఎప్పటికప్పుడు చూచుచుండిన నెచ్చటికచటఁ
గప్పిన యందంబు గాఁగఁ గనిపించుఁ గంటికి సృష్టి
చెప్పగా నంతయుఁ యూహ సేసిన నిది వట్టి
పిప్పిరా నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

సృష్టి యిదంతయు లక్ష్మిదేవి చేసిన విలాసంబు
పుష్టిగాఁ జూపించి బిట్టు మోహంబు పుట్టించుచుండు
నష్టాదశ పురాణములును శ్రీస్తోత్ర మధరీకృతత్రి
విష్టప! నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

సామాన్యముగ నేఁ బ్రయాణముం జేయు సమయంబునందు
నా ముఖంబునఁ గవితా సరస్వతి నాట్యమాడెడిని
స్వామి! నా తుదియాత్ర నిన్ను బాడుచు సాగ నీవే! గ
వీ మార్గ! నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

ఈ సృష్టిలోఁగల నియతి సర్వదా యిది యథార్థమని
భాసింపఁ జేసెడుఁ బెద్ద మోసంబు పచరింతువీవు
ఈ సృష్టికంటె మరేదో యున్నదంచెంచ నీ వాయె
వీసంబు నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల.

ఉన్నట్లు కనిపింపఁజేయు నొక శక్తి యున్నది దాని
కన్నుల జవ్వాదిపునుగు కస్తూరికాటుక రేక
సన్నసన్న పగుళ్ల వెలుగులో నిన్ను స్వామి కన్నాను
విన్నాను నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

నను నీవు వంద పురాలు వేయుము నాదారి నాది
నినుఁ బూర్తిగా నమ్మియుందు నన్నది నే నమ్మఁజాల
మును మిన్నుఁ బూయించు శశమునకును గొమ్ములు మొలిపించు
విని నా వె నందమూర్నిలయ సంతాన వేణు గోపాల.

శ్రీ భరతముని ప్రణీత
నాట్యశాస్త్రమ్

ఆంధ్రభారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్., పిహెచ్. డి.

పంచమోఽధ్యాయః

పూర్వరంగ విధానము

గీతకేషు ప్రయుక్తేషు దేవాస్తుష్యంతి నిత్యశః ౪౭
వర్థమానే ప్రయుక్తేతు రుద్ర స్తుష్యతి సానుగః
తథా చోత్థాపనే యుక్తే బ్రహ్మా తుష్టో భవేదిహ ౪౮
తుష్యంతి లోకపాలాశ్చ ప్రయుక్తే పరివర్తనే
నాందీ ప్రయోగేఽథకృతే ప్రీతో భవతి చంద్రమాః ౪౯
యుక్తాయా మవకృష్టాయాం ప్రీతా నాగా భవంతిహి
తథా శుష్కావ కృష్టాయాం ప్రీతః పితృగణో భవేత్ ౫౦
రఙ్గద్వారే ప్రయుక్తేతు విష్ణుః ప్రీతో భవేదిహ
జర్జరస్య ప్రయోగేతు తుష్టా విఘ్నవినాయకాః ౫౧
తథా చార్యాం ప్రయుక్తాయా ముమా తుష్టా భవేదిహ
మహాచార్యాం ప్రయుక్తాయాం తుష్టో భూతగణో భవేత్ ౫౨

గీతములు ప్రయోగించబడగా నిత్యము దేవతలు సంతోషించెదరు. వర్ధమాన ప్రయోగమున అనుచరులతో కలసినరుద్రుడు, ఉత్థాపనమున బ్రహ్మ, పరివర్తనమున లోకపాలురు, పుష్పాంజలితోనున్న నాందీప్రయోగమున చంద్రుడు, అవకృష్టమున నాగులు, శుష్కావకృష్టమున పితృదేవతలు, రంగద్వార ప్రయోగమున విష్ణువు, జర్జరప్రయోగమున విఘ్నవినాయకులగు విరూపాక్ష ప్రభృతులు, చారీప్రయోగమున ఉమాదేవి, మహాచారీప్రయోగమున భూతగణములు సంతోషింపగలవు.

ఆశ్రావణాది చార్యంత మేత ద్దైవత పూజనమ్
పూర్వరఙ్గే మయా ఖ్యాతం తథా చాఙ్గవికల్పనమ్. ౫౩

దేవస్తుష్యతి యో యేన యస్య యన్మనసః ప్రియమ్
తత్తథాపూర్వరఙ్గేతు మయా ప్రోక్తం ద్విజోత్తమాః ౫౪

సర్వదైవతపూజార్హం సర్వదైవత పూజనమ్
ధర్మ్యం యశస్య మాయుష్యం పూర్వరఙ్గ ప్రవర్తనమ్. ౫౫

దైత్య దానవ తుష్ట్యర్థం సర్వేషాంచ దివౌకసామ్
నిర్గీతాని సగీతాని పూర్వరఙ్గ కృతానితు ౫౬

నిర్గీతానాం సగీతానాం వర్థమానస్యచైవహి
ధ్రువా విధానే వక్ష్యామి లక్షణం కర్మచైవహి. ౫౭

ఆశ్రావణావిధి మొదలుకొని మహాచారివరకు గల అంగములన్నియు పూర్వ రంగములోనివి. ఏప్రయోగముచే పూర్వరంగమున నే దేవత సంతోషించునో. ఏప్రయోగ మేదేవత కభిమతమో అదియంతయు చెప్పబడినది. సమస్తదేవతలచేత ప్రశంసనీయమగు సర్వదైవతపూజనము ధర్మసహితము, యశస్యము, ఆయుష్కరము కాగలదు. దైత్యదానవులకు నిర్గీతము, దేవతలకందరకు గీతకాదులు పూర్వరంగమున సంతోషదాయకము లగుచున్నవి ధ్రువావిధానమును చెప్పు సందర్భమున నిర్గీత, గీతక, వర్ధమానముల లక్షణప్రయోజనములు చెప్పబడగలవు.

పూర్వరంగమును మనోరంజకముగా చేయువానిలో నతిముఖ్యమైనది ధ్రువాగానము దీని కవసరమగు గాంధర్వమును తెలిసికొనుటకు లక్షణప్రయోజనములు ధ్రువావిధాన సందర్భమున చెప్పబడగలవని భావము

ప్రయుజ్య గీతకవిధిం వర్ధమాన మథాపిచ
గీతకాంతే తతశ్చాపి కార్యా హ్యుత్థాపనీధ్రువా ౫౮

ఆదౌ ద్వేచ చతుర్థంచా ప్యష్ట మైకాదశేతథా
గుర్వక్షరాణి జానీయా త్పాదే హ్యేకాదశా క్షరే ౫౯

చతుష్పదా భవేత్సాతు చతురశ్రా తథైవచ
చతుర్భి స్సన్నిపాతైశ్చ త్రిలయా త్రియతి స్తథా ౬౦

పరివర్తాశ్చ చత్వారః పాణయస్త్రయఏవచ
జాత్యాచైవహి విశ్లోకా తాంచ తాలేన యోజయేత్ ౬౧

గీతక వర్ధమానములను ప్రయోగించి, గీతకమైన తర్వాత ఉత్థాపనీ ధ్రువా గానము నాలాపించవలెను ఉత్థాపనీధ్రువలో రెండు, నాలుగు. ఎనిమిది, పదకొండు అక్షరములు గురువులు, శేషించినవి లఘువులుగా నుండును. ఒక్కొక్క పాదము నకు పదకొండు అక్షరములుండును ఇట్టి పాదములు నాలుగు. ఇచట చంచత్పుట తాళము ప్రయుక్తమగును. ప్రతిపాదంతమున సన్నిపాత ముండుటచే నాలుగు సన్నిపాత లుండగలవు ద్రుతాదులగు లయలు మూడు, స్రోతో గతాదులగు యతులు మూడును కలవు. గాన క్రియాభ్యాసమందలి ఆవృత్తులు నాలుగుండును. సమపాణి, అవరపాణి, ఉపరిపాణి అని మూడుండును. ఈ విధమైన ఉత్థాపనీధ్రువ విశ్లోకమనబడు వృత్తజాతిలోనిది దీనిని తాళముతో యోజించవలెను.

శమ్యాతు ద్వికలా కార్యా తాలో ద్వికలఏవచ
పున శ్చైకకలా శమ్యా సన్నిపాతః కలాత్రయమ్. ౬౨
ఏవ మష్టకలః కార్యః సన్నిపాతో విచక్షణైః
చత్వారః సన్నిపాతాశ్చ పరివర్తః స ఉచ్యతే ౬౩
పూర్వం స్థితలయః కార్యః పరివర్తో విచక్షణైః
తృతీయే సన్నిపాతేతు తస్య భాండగ్రహో భవేత్. ౬౪
ఏకస్మిన్ పరివర్తేతు గతే ప్రాప్తే ద్వితీయకే
కార్యం మధ్యలయే తజ్జ్ఞైః సూత్రధార ప్రవేశనమ్. ౬౫

ఉత్థాపనీ ధ్రువను తాళముతో యోజించవలెను తాళమిచట శమ్యా అను విశేషనామము కలది ఇది ద్వికల. కలాశబ్దము అక్షరమార్గమును నిర్దేశించునది. తాళమును ద్వికలగాచెప్పి, శబ్దపాతగతమైన హస్తమును నిర్వర్తింపచేయవలెను. తర్వాత ఏకకలతో శమ్యా ననుసంధించగా మూడుకలలతో సన్నిపాతము రాగ లదు. కాగా నిష్క్రామశమ్యలను కుడిచేతితోను, నిష్క్రామతాళములను ఎడమ చేతితోను, ఆ తర్వాత కుడిచేతితో శమ్యాను ప్రయోగించగా రెండింటితోను ప్రవేశ నిష్క్రామ సన్నిపాతలు రాగలవు

అష్టకలాత్మకముగా సన్నిపాతను ప్రయోగించ, నాలుగు సన్నిపాతలుకలిసి పరివర్తమగును. పరివర్తమనగా గానక్రియా భ్యాసమందలి ఆవృత్తి విచక్షణులు మొట్టమొదట విలంబముగల లయతోకూడిన పరివర్తము నాలాపించవలెను తంత్రీ గాన సమన్వితముగా పాదత్రయమును ప్రయోగించి, నాల్గవపాదము పూర్తియగు వరకు పుష్కరవాద్యమును ప్రయోగించవలెను. ఒక పరివర్తమైపోయి రెండవది జరుగునపుడు గానము మధ్యలయలో జరుగును అప్పుడు సూత్రధారుడు ప్రవేశింప వలెను సూత్రధారునితో బాటు అతని సహచరులగు పారిపార్శ్వకులుకూడ వత్తు రని భావము.

> పుష్పాఞ్జలిం సమాదాయ రక్షా మ్గలసంస్కృతాః
> శుద్ధవస్త్రాః సుమనస స్తథా దృుత దృష్టయాః ౬౬
>
> స్థానంతు వైష్ణవం కృత్వా సౌష్ఠవాంగ పురస్కృతమ్
> దీక్షితాః శుచయశ్చైవ ప్రవిశేయుః సమం త్రయః ౬౭
>
> భృఙ్గార జర్జరధరౌ భవేతాం పారిపార్శ్వకౌ
> మధ్యేతు సూత్రభృత్తాభ్యాం వృత్తః పంచపదీం వజేత్ ౬౮

రక్షామంగళ శ్లోకాదులచే సంస్కృతులై తెల్లనివస్త్రములను ధరించి, శోభన మనస్కులై, అద్భుత దృష్టులతో శుచిగలవారై, దీక్షితులై సూత్రధారుడు, ఇరు వురు పారి పార్శ్వకులు ప్రవేశించవలెను. పారి పార్శ్వకులలో నొకరు శౌచార్థను భృంగారము, మరొకడు విఘ్నశాంతికై ధ్వజమును తీసికొనగా సూత్రధారుడు పుష్పాంజలియై వచ్చును. వీరు సౌష్ఠవాంగ పురస్కృతమగు వైష్ణవస్థానమును చేయ వలెను. రెండు పాదములకు మధ్య ఇరువదిరెండున్నర అంగుళముల దూరముండగా ఒకపాదము సమముగానుండి, రెండవది ప్రక్కగా త్రికోణాకారమునునుండ, జంఘను కుంచించబడగా కలుగు సౌష్ఠవాంగముతో నుండునది వైష్ణవస్థానకమని ముందు పదవ అధ్యాయమున చెప్పబడగలదు.

పారి పార్శ్వకులిరువైపుల నుండగా వారితోబాటు సూత్రధారుడు ఐదడు గులు వేయవలెను ఈ కృత్యమునకు ప్రయోజనము క్రింది శ్లోకములో గలదు.

> పదాని పఞ్చ గచ్ఛేయుః బ్రహ్మణో యోజనేచ్ఛయా
> పదానాం చాపివిక్షేపం వ్యాఖ్యాస్యామ్యను పూర్వశః ౬౯

త్రితాలాంతర విష్కంభ ముత్క్షిప్తే చ్చరణం శనైః
పార్శ్వోత్థా నోత్థితం చైవ తన్మధ్యే పాతయేత్పునః. ౭౦
ఏవం పంచపదేం గత్వా సూత్రధారః సహేతరః
సూచీ వామపదే దద్యా ద్విక్షేపం దక్షిణే న చ. ౭౧

నాట్యమండపమున మధ్యగా పద్మోపవిష్టుడైన బ్రహ్మ నావాహన చేసిన ప్రదేశమున కేగదలచి సూత్రధారుడు పారి పార్శ్వకులతో ఐదడుగులు వేయవలెను. ఎడమ పాదముతో సూచీప్రయోగమును, కుడిపాదముతో విక్షేపమును వేయవలెను. కుంచితమైన పాదమును ఎత్తి జానువువరకు పైకి ప్రసారించి, మొదట పాదము అగ్రభాగమును వెనుకవైపున క్రింద వేయుటయే సూచీ యనబడును. హస్తముయొక్క వ్యావర్తనకాలము పాదమునకు బహిర్నిష్క్రమణ లక్షణముగా చూపుట విక్షేపమనబడును.

తర్వాత మెల్లగా పాదముతో విష్కంభమును వేయవలెను మూడు తాలములు లేక ఇరువదియేడు అంగుళముల అంతరము పాదములమధ్య ఉండిన విష్కంభ మందురు. అట్టి పాదమును ప్రక్కనుంచి పైకియెత్తి ముందునకు వేయుచు గమనము నభినయించవలెను ఈ విధముగా నీ ముగ్గురు వైష్ణవస్థానకము వేసి, సూచీ విక్షేపములతో జరుగవలెను

పుష్పాఞ్జ ల్యపవర్గశ్చ కార్యో బ్రహ్మోఽథ మండలే
రఙ్గపీఠస్య మధ్యేతు స్వయం బ్రహ్మా ప్రతిష్ఠితః. ౭౨
తతః సలలితై ర్హస్తై రభివంద్య పితామహమ్
అభివాదాని కార్యాణి త్రీణి హస్తేన భూతలే. ౭౩
కాల ప్రకర్షహేతోశ్చ పాదానాం ప్రవిభాగతః

రంగపీఠ మధ్యమున బ్రహ్మయే స్వయముగా ప్రతిష్ఠింపబడియుండుటచే నీ బ్రాహ్మమండలమున అంజలిలోనున్న పూవుల నుంచవలెను. తర్వాత లలిత హస్తములతో బ్రహ్మకు నమస్కరించవలెను భూతలమున మూడు నమస్కారములను చేయవలెను. కాలపరిమాణాంతరము నాశ్రయించి నృత్త హస్తకరణముల ప్రయోగముతో నమస్కారము విధింపబడినది.

సూత్రధార ప్రవేశాద్యో వందనాభినయాంతకః ౭౪

సూత్రధారుడు ప్రవేశించుటచే వందనాభినయములు వచ్చుచున్నవి. సూత్రధారుడు ప్రవేశించి, ఐదడుగులు వేసి, పూలనర్పించి, మూడు నమస్కారములను చేయవలెను. ఇది ముప్పదిరెండు కళలలో జరుగును. పంచపదీగమనమైన తర్వాత ఎన్నికళలు మిగిలినవో, అంతకాలము వ్యావర్తిత పరివర్తితాదికరణములతో ఉద్వృత్తనలినీ పద్మకోశాది నృత్తహస్తముల నవలంబించి లలితాత్మకముగా మూడు నమస్కారములను చేయవలెనని భావము.

ద్వితీయః పరివర్తస్తు కార్యో మధ్యలయాశ్రితః
తతఃపరం తృతీయేతు మండలస్య ప్రదక్షిణమ్ ౬౫

భవే దాచమనంచైవ జర్జరగ్రహణం తథా
ఉత్థాయ మండలాత్తూర్ణం దక్షిణం పద ముద్ధరేత్ ౬౬

వేధంతేనైవ కుర్వీత విక్షేపం వామకేన చ
పునశ్చ దక్షిణం పాదం పార్శ్వసంస్థం సముద్ధరేత్ ౬౭
తతశ్చ వామవేధస్తు విక్షేపో దక్షిణస్యచ

రెండవ ఆవృత్తి మధ్యలయలో జరుగును ద్రుతలయములో మూడవ ఆవృత్తియందు జరుగవలసిన కర్మకలాపమునిక చెప్పుచున్నాడు. నవపద్మ దళాకారమున రంగమధ్యమునగల మండలమునకు ప్రదక్షిణముచేసి,ఆచమనమొనరించి, ధ్వజమును తీసికొనవలెను. జానువులను శిరస్సును వంచి భూశ్లేషపర్యంతము అభివాదన చేసి కుడిపాదము సూచీవిద్ధముగా ఎత్తవలెను. ఎడమపాదముతో విక్షేపము చేయవలెను. అనగా రెండవకాలి మడమ వెనుక పాదము నుంచవలెను మరల ప్రక్కనున్న కుడపాదముతో పార్శ్వక్రాంతి చారీవిధానము నాచరించవలెను ఆపై మరల కుడిపాదమును సూచీవిద్ధముగను, కుడిపాదమును విక్షేపముగను చేయవలెను.

ఇత్యనేన విధానేన సమ్యక్కృత్వా ప్రదక్షిణమ్ ౬౮
భృఙ్గారభృత మాహూయ శేచంచాపి సమాచరేత్

యథాన్యాయంతు కర్తవ్యా తేన హ్యాచమనక్రియా ౬౯
ఆత్మప్రోక్షణమేవాద్భిః కర్తవ్యంతు యథాక్రమమ్,

ఈ ప్రకారముగా ప్రదక్షిణమును చక్కగా గావించి, ప్రదక్షిణభ్రమణమున తూష్ణీంభావములో నుండి భృంగారమను తీసికొనియున్న పారి పార్శ్వకుని పిలచి శౌచకర్మను చేయించవలెను విధిప్రకారము ఆచమనము చేసిన తర్వాత ఉదకములతో ఆత్మప్రోక్షణను ఒనర్పవలెను. ఇది శౌచమనబడు రెండవ కృత్యము

ప్రయత్నకృత శౌచేన సూత్రధారేణ యత్నతః ౭౦
సన్నిపాత సమంగ్రాహ్యో జర్జరో విఘ్నజర్జరః
ప్రదక్షిణాద్యో విజ్ఞేయో జర్జరగ్రహణాంతకః ౭౧
తృతీయః పరివర్తస్తు విజ్ఞేయోవై ద్రుతేలయే

ఇక తృతీయకర్మ చెప్పబడుచున్నది. ప్రదక్షిణ సమయమున నాల్గవ ఆవృత్తికి ముందు విఘ్నములను నశింపజేయు ధ్వజమును ప్రయత్నపూర్వకముగా శుచియైన సూత్రధారుడు గ్రహించవలెను. ఈ మూడవ ఆవృత్తి ద్రుతలయలో జరుగును.

గృహీత్వా జర్జరం తృష్టౌ కలాజప్యం ప్రయోజయేత్ ౭౨
వామవేధం తతఃకుర్యా ద్విక్షేపం దక్షిణస్యచ
తతః పంచపదీంచైవ గచ్ఛేత్తు కుతపోన్ముఖః ౭౩
వామవేధస్తు తత్రాపి విక్షేపో దక్షిణస్యతు
జర్జరగ్రహణా ద్యోఽయం కుతపాభి ముఖాంతకః. ౭౪
చతుర్థః పరివర్తస్తు కార్యో ద్రుతలయేపునః.

జర్జరపూజకు నాల్గు శ్లోకములు మూడవ అధ్యాయమున చెప్పబడినవి. ఈ శ్లోకములతో స్తుతింపబడు ధ్వజమును మొదటి ఎనిమిది కళలలో గ్రహించి, ఎడమ పాదమును సూచీవిద్ధముగను. కుడిపాదమును విక్షేపముగను చేయవలెను. వాద్య విశేషముల కున్ముఖుడై ఐదడుగులు వేయవలెను. అప్పుడచ్చట కూడ ఎడమపాదమును సూచీవిద్ధముగను, కుడిపాదముతో విక్షేపమును ప్రయోగించవలెను. ధ్వజముతో వాద్యములవద్దకు వచ్చుటకు ఇరువది నాలుగుకళల కాలము కావలెను. ఈ నాల్గవ ఆవృత్తికూడ ద్రుతలయముననే జరుగును

కరపాద నిపాతాస్తు భవంత్యత్రతు షోడశ ౭౩
త్ర్యశ్రే ద్వాదశపాతాస్తుభవంతి కరపాదయోః

పైన చెప్పబడిన ప్రయోగమంతయు ముప్పదిరెండు కలలలో జరుగును. రెండుకలలకొక పతనముచొప్పున కరపాదనిపాతములు పదునారు రాగలవు. త్ర్యశ్రమునగా త్రికోణాకృతితో నుండు భ్రమరికాచారి. ఈ చారీవిధానమును ప్రయోగించుచో హస్తపాదములకు పన్నెండు నిపాతములు రాగలవు.

వందనాన్యథ కార్యాణి త్రీణి హస్తేన భూతలె ౭౪
ఆత్మప్రోక్షణ మప్యత్ర త్ర్యశ్రేణైవ విధేయతే

భూతమున వెనుకటివలె హస్తములతో మూడు నమస్కారములు గావించి, ఉదకములతో ఆత్మప్రోక్షణను భ్రమరికాచారితో గావించవలెను.

ఏవ ముత్థాపనం కార్యం తతశ్చ పరివర్తనమ్, ౭౫

ఈ విధముగా ఉత్థాపనమైన తర్వాత పరివర్తనమును గావించవలెను. నాట్య ముత్థాపితము కాగా తదనంతరప్రక్రియను చెప్పబోవుచున్నాడు.

చతురశ్రం లయె మధ్యే సన్నిపాతై రథాష్టభిః
యస్యా లఘూని సర్వాణి కేవలం నైధనం[illegible]రు ౭౭
భవేదతి జగత్యాంతు సా ధ్రువా పరివర్తని

చతురశ్ర తాలముతోనున్న ధ్రువాయోగముచే పరివర్తనము చతురశ్రమగుచున్నది. నాల్గుపాదములు గల ధ్రువాగానమున సన్నిపాతాష్టకము రాగలదు. ఇది మధ్యలయలో ప్రయోగించబడును. అతి జగతీఛందమున, అంత్యాక్షరము గురువు కాగా శేషించిన అక్షరములు లఘువులుకాగా, పాడబడునది పరివర్తనీ ధ్రువ. అతి జగతీ ఛందమున పాదమునకు పదమూడు అక్షరము లుండును.

వార్తికేనతు మార్గేణ వాద్యేనానుగతేనచ ౭౯

లలితైః పాదవిన్యాసై ర్వంద్యా ద్దేవాయథాదిశమ్,
ద్వికలం పాదపతనం పాదచార్యాం గతం భవేత్ ౮౦

వామపాదేన వేధస్తు కర్తవ్యో నృత్తయోక్తృభిః
ద్వితాలాంతర విష్కంభో విక్షేపో దక్షిణస్యచ ౮౧

చతుర్మాత్రాత్మకమగు మార్గమున వాద్యములాలాపింపబడుచుండగా ఆయా దిక్కులలో గల దేవతలను లలితములైన పాద విన్యాసములతో నమస్కరింపవలెను భూ చారినిగాని ఆకాశ చారిని గాని ప్రయోగించినచో రెండు కళల కాలములో పాదపతనము జరుగవలెను అనగా ఒకపాదము పైకిఎత్తబడగా, రెండవది క్రింద పడును. ఎడమపాదమును సూచీవిద్ధముగా ప్రయోగించి, పదునెన్మిది అంగుళముల అవధిగల కుడిపాదమును విక్షేపించవలెను

తతః పఞ్చపదీం గచ్ఛేదతిక్రాంతైః పదైరథ
తతోఽభివాదనం కుర్యా ద్దైవతానాం యథాదిశమ్ ౯౨

వందేత ప్రథమం పూర్వాందిశం శక్రాధిదైవతామ్
ద్వితీయాం దక్షిణామాశాం వందేత యమదైవతామ్ ౯౩

వందేత పశ్చిమామాశాం తతో వరుణదైవతామ్
చతుర్థీ ముత్తరామాశాం వందేత ధనదాశ్రయామ్ ౯౪

దిశాంతు వందనం కృత్వా వామవేధం ప్రయోజయేత్
దక్షిణేనచ కర్తవ్యం విక్షేపం పరివర్తనమ్ ౯౫

అతిక్రాంతచారీ గమనమున ఐదడుగులనువేసి ఆయాదిక్కులలో గల దేవతలకు వరుసగా నమస్కారములను చేయవలెను మొదట ఇంద్రదేవతాకమగు తూర్పు దిక్కును నమస్కరించ వలెను. తర్వాత యమదైవత్వమగు దక్షిణము, వరుణ దైవత్వమగు పడమరన, కుభేరదేవతాకమగు ఉత్తరమున నమస్కారములను, జరిపి ఎడమ పాదమును సూచీ విద్ధముగను, కుడపాదమును విక్షేప పూర్వకమగు పరివర్తనముగను చేయవలెను ఉత్తరాభి ముఖుడుగా నిలచి పరివర్తన చేసి తూర్పు దిక్కునకు తిరుగునని భావము.

ప్రాఙ్ముఖస్తు తతః కుర్యాత్ పురుష స్త్రీ నపుంసకైః
త్రిపద్యా సూత్రభృ ద్రుద్ర బ్రహ్మో పేంద్రాభివాదనమ్ ౯౬

దక్షిణంతు పదం [illegible] వామం స్త్రీణాం ప్రకీర్తితమ్
పునర్దక్షిణమేవస్యా [illegible]ఖ్యాత్క్షిప్తం నపుంసకమ్. ౯౭

తూర్పు దిక్కున కభిముఖుడై సూత్రధారుడు రుద్ర, బ్రహ్మ విష్ణువులకు పుంస్త్రీ నపుంసక భేదములతో కూడిన త్రిపదీ రూపమైన అభివాదనమును చేయవలెను పురుషులకు కుడిపాదము, స్త్రీలకు ఎడమ పాదము, బాగుగా పైకి ఎత్తబడని కుడిపాదము నపుంసకులకని తెలియనగును

వందేత పౌరుషేణేశం స్త్రీపదేన జనార్దనమ్

పరివర్తనీ ధ్రువాగానమున కుడిపాదముతో శివునకు, ఎడమపాదముతో విష్ణువునకునమస్కారములు చేయబడవలెను

నపుంసకపదేనాపి తథైవాంబుజ సంభవమ్. ౯౮

నాత్యుత్క్షిప్త పదముతో బ్రహ్మకు నమస్కరింపవలెను.

పరివర్తన మేవంస్యా త్తస్యాంతే ప్రవిశేత్తతః
చతుర్థకారః పుష్పాణి ప్రగృహ్య విధి పూర్వకమ్ ౯౯
యథావ త్తేన కర్తవ్యం పూజనం జర్జరస్యతు
కుతపస్యచ సర్వస్య సూత్రధారస్యచైవవహి. ౧౦౦
తస్య భాండ సమః కార్య స్తజ్ఞై ర్గతిపరిక్రమః.

న తత్ర గానం కర్తవ్యం తత్రస్తోభక్రియా భవేత్ ౧౦౧
చతుర్థకారః పూజాంతు న కృత్వాంతర్హితో భవేత్

ఈ రీతిగా పరివర్తన విధి జరిగిన తర్వాత సూత్రధార పారిపార్శ్వకులు గాక మరొకవ్యక్తి, అనగా నాల్గవవ్యక్తి, విధిపూర్వకముగా పూవులను తీసికొనిరావలెను, మూడవ అధ్యాయమున, పుష్కరాధ్యాయమున నిరూపింపబడిన దేవతాక్రమము ననుసరించి వెనుక సూత్రధారుడు చేసినట్లే ఇతడుగూడ ధ్వజమునకు, వాద్యముల కన్నిటికి, సూత్రధారునకు పూజ చేయవలెను ఇతని గతి పరిక్రమమున పుష్కర వాద్యము అలాపింపబడవలెను. అర్థవంతమగు గీతము నాలాపించరాదు. అర్థరహిత ములగు శుష్కాక్షరములతో నాలాపము జరుగవలెను. ఈ పూజావిధానమైన తర్వాత నత డంతర్హితుడు కావలెను

తతో గేయావకృష్టాతు చతురశ్రా స్థితా ధ్రువా ౧౦౨
గురుప్రాయాతు సా కార్యా తథాచైవావపాణికా
స్థాయి వర్ణాశ్రయోపేతా కలాష్టక వినిర్మితా ౧౦౩

మొదటి తొమ్మిది గుర్వక్షరములతో నున్నది. అవపాణికమైనది, స్థాయి వర్ణములగు సమస్వరములతో కూడినది, ద్వికల చంచత్పుటాది కలాష్టకముతో నిర్మించబడినది, విలంబితలయ గలది, నాలుగు పాదములు కలదియునగు ధ్రువను గేయాకృష్ట యందురు

సూత్రధారః పఠేత్తత్ర మధ్యమం స్వరమాశ్రితః
నాందీం పదై ర్ద్వాదశభి రష్టభి ర్వా ప్యలంకృతామ్ ౧౦౪

"నమోఽస్తు సర్వదేవేభ్యో ద్విజాతిభ్యః శుభంతథా
జితం సోమేనవై రాజ్ఞా శివం గోబ్రాహ్మణాయచ ౧౦౫

బ్రహ్మోత్తరం తథైవాస్తు హతా బ్రహ్మద్విషస్తథా
ప్రశాస్త్విమాం మహారాజః పృథివీంచ ససాగరామ్. ౧౦౬

రాష్ట్రం ప్రవర్ధతాంచైవ రఙ్గస్యాశా సమృధ్యతు
ప్రేక్షకర్తు ర్మహాన్ ధర్మో భవతు బ్రహ్మభాషితః ౧౦౭

కావ్యకర్తు ర్యశశ్చాస్తు ధర్మశ్చాపి ప్రవర్ధతామ్
ఇజ్యయా చానయా నిత్యం ప్రీయంతాం దేవతా" ఇతి ౧౦౮

అవకృష్టా ధ్రువాగానము చేయుచో మధ్యమ స్వరము నాశ్రయించి, ఎనిమిది లేక పది లేక పన్నెండు పదములతో నలంకరింపబడిన నాందీ శ్లోకమును ఈ క్రిందిభావము వచ్చునట్లుగా సూత్రధారుడు పాడవలెను- "సకల దేవతలకు నమస్కారము. ద్విజులకు శుభము కలుగుగాక ! చంద్రునివంటి రాజుచే శత్రువులు

జయించబడినారు గావున గోబ్రాహ్మణులకు శుభమగుగాక! బ్రాహ్మణ వృద్ధియగుగాక! బ్రాహ్మణద్వేషులు నశింతురుగాక! సముద్రముచే పరివృతమైన ఈ భూమిని మహారాజు శాసించుగాక! దేశము వృద్ధి పొందుగాక! నాట్యరంగము యొక్క అభీష్టము నెరవేరుగాక! బ్రహ్మగా భావింపబడు నాట్యాచార్యునకు మహాధర్మము కలుగుగాక! కవికి కీర్తి కలుగుగాక! ధర్మము వృద్ధి పొందుగాక! యాగతుల్యమైన ఈ నాట్యప్రయోగముతో దేవత లెల్లపుడు సంతుష్టి నందెదరుగాక!

నాందీ పదాంతరేష్వేషు హ్యేవమార్యేతి నిత్యశః
వందేతాం సమ్యగుక్తాభి ర్వాగ్మినౌ పారిపార్శ్వకౌ ౧౦౯

నాందీ శ్లోకములో పదముల మధ్య 'ఇట్లగుగాక' అని చెప్పుచు వాక్పాటవముగల పారి పార్శ్వకులు చక్కని మాటలతో నమస్కరించవలెను

ఏవం నాందీ విధాతవ్యా యథావ ల్లక్షణాన్వితా
తత శుష్కావకృష్టా స్యా జ్జర్జశ్లోకదర్శికా ౧౧౦

నవగుర్వక్షరాణ్యాదౌ షడ్లఘూని గురుత్రయమ్
శుష్కావకృష్టాతు భవే త్కలాహ్యష్టౌ ప్రమాణతః ౧౧౧

యథా- 'దిగ్లే దిగ్లే దిగ్లే దిగ్లే జంబుక పలితకతే తేచామ్'

ఈ రీతిగా లక్షణాన్వితమైన నాందీ ప్రయోగము పూర్తికాగా ధ్వజస్తుతికి దారితీయు శుష్కావకృష్టా ప్రయోగము జరుగవలెను ఇందు తొమ్మిది గుర్వక్షరములు, తర్వాత ఆరు లఘువులు, ఆపై మూడు గురువులు నుండును 'దిగ్లే దిగ్లే దిగ్లే దిగ్లే జంబుక పలితకతే తేచామ్' అనునది శుష్కావకృష్ట కుదాహరణము ఇచటగల అక్షరములన్నియు అర్ధరహితములే. ఇది అష్టకళాత్మకమైన ప్రమాణము గలది.

కృత్వా శుష్కావకృష్టాంతు యథావ ద్ద్విజసత్తమాః ౧౧౨
తత్ర శ్లోకం పఠేదేకం గంభీరస్వరసంయుతమ్
దేవస్తోత్రం పురస్కృత్య యస్య పూజాప్రవర్తతే ౧౧౩
రాజ్ఞోవా యత్ర భక్తిఃస్యా దథవా బ్రాహ్మణస్తవమ్
గదిత్వా జర్జరశ్లోకం రఙ్గద్వారేచ యత్కృతమ్ ౧౧౪
పఠేదన్యం పునఃశ్లోకం జర్జరస్య వినాశనమ్

విధి పూర్వకముగా శుష్కావకృష్టను ప్రయోగించి గంభీర స్వరముతో దేవతాపూజ జరుగుచున్నది గనుక దేవతా స్తోత్ర విషయకమగు శ్లోకము నొకదానిని పఠించవలెను. ఈ శ్లోకముద్వారా రంగద్వారమను నంగము ప్రయుక్తమగును. రాజునకు భక్తిగల దేవతా స్తోత్రమును గాని, బ్రాహ్మణ స్తవమునుగాని పఠించవచ్చును జర్జరమనబడు ధ్వజమునుగూర్చిన శ్లోకమును రంగద్వారాంగమున పఠించి, మరల ధ్వజము నభివ్యక్తముచేయు మరొక శ్లోకము నుచ్చరించవలెను.

పురాణవర్ణిత విష్ణువెవరు?

శ్వేత కృష్ణ వర్ణములు

పండిత, శ్రీ గోపదేవ్

పురాణములలో కొన్నియెడల విష్ణువు శ్వేత వర్ణుడని వర్ణింపబడుట చూడనగును. అట్లే కృష్ణ శ్యామవర్ణములుకూడ విష్ణువునకున్నట్లు తెలియనగును

"శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నో
పశాంతయే"

తెల్లని వస్త్రమును ధరించువాడును, చంద్రుని వర్ణముగలవాడును, చతుర్భుజుడును, ప్రసన్న వదనుడునునగు విష్ణువును సర్వవిఘ్న శాంతి కొరకు ధ్యానింపవలెను"

ఈ శ్లోకము పద్మపురాణాంతర్గత సత్యనారాయణ వ్రత పద్ధతిలో జూడబడుచున్నది ఇందు విష్ణువు శశివర్ణుడు శ్వేతవర్ణుడుగా వర్ణింపబడుటను స్పష్టము విష్ణువు సూర్యునిస్థానమున కల్పింపబడిన దేవతయని పూర్వపు లేఖలలో పాఠకులు చదివియే యుందురు అందువలన సూర్యస్థానీయుడగు విష్ణువు శ్వేతవర్ణుడగుటలో నాశ్చర్యపడవలసిన యవసరముండదు కాని, విష్ణువు కృష్ణవర్ణుడుగా వర్ణింపబడుట అధికముగా చూచుచుందుము నేడు మన కుడ్యములు నలంకరించు విష్ణువు చిత్రపటములన్ని కృష్ణవర్ణయుక్తములై పీతాంబరధారణాంచితములై యుండును. ఇందులకు కారణమేమి? విష్ణువు తెల్లనివాడా? లేక నల్లనివాడా?

విష్ణువు కృష్ణవర్ణుడని వర్ణించుటకును కారణము నతడు సూర్యస్థానమున కల్పింపబడుటయే యనక తప్పదు కాని, కృష్ణపదము నిట వర్ణపరముగా గ్రహించుట పొరపాటు సూర్యుడు వేదములందు కృష్ణపదముచే పలు తావులలో వర్ణింపబడియున్నాడు. కృష్ణుడన నల్లనివాడనికాదు. ఆకర్షించువాడని యర్థము ఆకర్షణశక్తి యుక్తమగు వస్తువు కృష్ణశబ్ద వాచ్యమగును. లోకమున ప్రతిపరమాణువునందు నాకర్షణశక్తి యున్నది అ పరమాణువుల కలయికచే నేర్పడిన పృథివ్యాది పదార్థములందును ఆకర్షణమున్నది కాని. సూర్యునియందధికముగా నున్నది. అందువలన నతడు కృష్ణుడనబడినాడు వేదమంత్రములలో చూడుడు.

"కృష్ణం నియానం హరయః
అపోవసానాదివ ముత్పతన్తి
త ఆవవృత్రన్ సదనా దృతస్యాఽ
దిద్ఘృతేన పృథివీ వ్యుద్యతే" ఋ1.164 47.

'హరయః - జలమును హరించు, అపోవసానాః - జలముతో మేఘములను నిర్మించు, హరయః- కిరణములు, నియానాం- పృథివ్యాది గ్రహములను నియమించు, కృష్ణం - సూర్యుని ఉద్దేశించి, దివమ్ ఉత్పతన్తి - ద్యులోకమున కెగురుచున్నవి. ఆ కిరణములు, ఋతస్యసదనాత్ - సూర్యమండలమునుండి, ఆవవృత్రన్- మరలివచ్చుచు, ఆదిద్ఘృతేన- గ్రహింపబడిన జలముతో, పృథివీ-భూమి, వ్యుద్యతే - తడుపబడుచున్నది

ఈ వర్ణనము అయనములనో, లేక సంధ్యాకాలములనో యుద్దేశించి చేయబడినట్లున్నది. సాయంకాలమున కిరణములు భూమిలో నొక భాగమునుండి మరియొక భాగమున కరుగుటయు మరల ప్రాతఃకాలమున సూర్యుని చేరునప్పటికి భూమి మంచుతో తడిసియుండుటయు నెల్ల రెరిగిన విషయమేకదా?

"ఆ కృష్ణేన రజసావర్తమానో, నివేశయ
న్నమృతం మర్త్యంచ
హిరణ్యయేన సవితా రథేనదేవో యాతి
భువనానిపశ్యన్"

ఋ 1.35.21

ఆకృష్ణేనరజసా - ఆకర్షణయుక్త పృధివ్యాదిలోకములతో, (లోకాః రజాంస్యుచ్యంతే. నిరుక్తము 4.19), వర్తమానః తిరుగుచు, దేవః - దివ్యగుణములుగల. సవితా. సూర్యుడు, అమృతం — మరణరహితమగు గురువు మున్నగు గ్రహములను. మర్త్యంచ- మరణశీలమగు భూమిని, నివేశయన్ - ఉచిత స్థానములందుంచుచు, భువనాని - లోకములను, పశ్యన్ - దర్శనశక్తిని ప్రసాదించుచు, హిరణ్యయేన రధేన - ఆకర్షణశక్తి యుక్తమగు రధముతో ,ఆయాతి - వచ్చుచున్నాడు.

ఈమంత్రమునందు పృధివ్యాదిలోకములు కూడ కృష్ణశబ్దముచే చెప్పబడి,యవి యాకర్షణ శక్తియుక్తములై యున్నట్లు తెలుపబడినవి ఇట్లు వేదములందు ఆకర్షణశక్తి యుక్తములగు పదార్థములను బోధించుటకై ప్రయోగింపబడిన కృష్ణ శబ్దార్థమును సరిగ గ్రహింపక తమచే కల్పింపబడిన సూర్యస్థానిక విష్ణుదేవునకు కృష్ణవర్ణము నాపాదించియున్నారు ఇక పామరజనులు విష్ణువు నల్లని వాడనుటలో నాశ్చర్యమేమున్నది।

వేదమున సూర్యుని నుద్దేశించి చెప్పబడిన శుక్లకృష్ణ రూపములనే కల్పిత విష్ణువునకును కల్పించిరనుటకు మరియొక ప్రమాణము నిట జూపుచున్నాడ

"తన్మిత్రస్య వరుణస్యాభిచక్షే సూర్యోరూపం
కురుతేద్యోరుపస్థే
అనంతమన్య ద్రుశదస్యపాజః కృష్ణమన్యద్ధ
రితః సంభరన్తి" యజు 23 33

పురాణకాలీనుడగు మహీదరు డీ మంత్రమునకు వ్రాసిన భాష్యమును దిలకింపుడు

"సూర్యోద్యోః ద్యులోకస్య ఉపస్థే - ఉత్సంగే, మిత్రస్య వరుణస్యచ తద్రూపం కృణుతే కురుతే, యేనరూపేణ జనానభిచక్షే- అభిచష్టే,పశ్యతి-మిత్రరూపేణ సుకృతినోఽను గృహ్ణాతీత్యర్థః అస్యసూర్యస్య అన్యదేకం పాజో రూప మన్యత్. కాలతోదేశతశ్చాపరిచ్ఛేద్యమ్ రుశత్‌శుక్లం దీప్యమానం విజ్ఞానఘనానందం బ్రహ్మైవ. అన్యత్‌కృష్ణం ద్వైతం లక్షణమ్ రూపం. హరితః దిశః ఇంద్రియవృత్తయోవా సంభరంతి దారయంతి ఇంద్రియాగ్రాహ్యం ద్వైతిరూపమేకం ఏకం శుద్ధం చైతన్యమద్వైతమితిద్వే. రూపం సూర్యస్య సగుణ నిర్గుణం బ్రహ్మ సూర్యఏకఏవేత్యర్థః"

'సూర్యః - సూర్యుడు. ద్యోంఉపస్థే ద్యులోకోత్సంగమున, మిత్రస్య వరుణస్యచ - మిత్రావరుణులయొక్క, తద్రూపం - ఆరూపమును, కృణుతే - కురుతే — ధరించుచున్నాడు యేన రూపేణ - ఏరూపము(ల)వలన, జనాన్-జనులను, అభిచక్షే - చూచుచున్నాడో, అనగా 'మిత్రరూపముతో సుకృతుల ననుగ్రహించుచున్నాడు వరుణరూపముతో దుష్టులను నిగ్రహించుచున్నాడు, అని భావము అస్య - ఈ సూర్యునకు, అన్యత్ - మరియొక, పాజః - రూపము, అనంతం-దేశకాలనులచే సమితము కానిదై, రుశత్ - దేదీప్యమానమై వెలుగు శుక్లరూపముకలదు, (ఇంతేకాక) అన్యత్ - మరియొకరూపము- రెండవరూపమును కలదు అది, కృష్ణం ద్వైతలక్షణమగు కృష్ణరూపము హరితః - దిక్కులు, లేక ఇంద్రియములు. సంభరంతి-ఆ రెండవ కృష్ణరూపమును ధరించియున్నవి అనగా సూర్యునకు రెండు రూపములున్నవనియు, నందొకటి ఇంద్రియగ్రాహ్యమగు ద్వైతరూపమనియు, రెండవది శుద్ధచైతన్యరూపమనియు నెరుంగవలెను సగుణ నిర్గుణరూపమగు బ్రహ్మము సూర్యుడేయని మహీధరుని భావము

మహీధరుడు పురాణకాలమున నుండుటచే నతడు సూర్యునే పరమాత్ముని స్థానమున భావించినట్లున్నది ఇందులకు పాఠకులు వింత పడవలసిన పనిలేదు.

వాస్తవమున నీ మంత్రభావమేమన సూర్యునకు రెండు రూపములున్నవి ఆ రూపములు రెండును శుక్ల. కృష్ణశబ్దములచే చెప్పబడును. సూర్యుడు శుక్లరూపముతో లోకములను భాసింపజేయుచున్నాడు కృష్ణరూపముతో ఆకర్షణశక్తితో తన పరిధియందుగల పృధి

వ్యాదిగ్రహములను లోకములను - ఆకర్షించి ధరించుచున్నాడు. ధీమంతుల కీ మంత్రముచ నీ యర్థము సుస్పష్టమేయని వేరుగ వ్రాయ నక్కఱలేదని యెంచెద ఇంతేకాక, వేదమం త్రములందెంతటి విజ్ఞాన మిమిడియున్నదియు విద్వాంసులకు గోచరమగును ఈయర్థముల యంతరార్థమును గ్రహించియో గ్రహింప కయో విష్ణుకల్పకులు విష్ణువును శుక్లకృష్ణ వర్ణము లుగల వానినిగ పురాణములందు వర్ణిం చియు దురు! లోకలోకాంతరముల నాకర్షించు సూర్యుని కృష్ణశక్తి - ఆకర్షణశక్తి - విష్ణువు నందు నలుపురంగుగా మారిపోయినది అర్థభే దములను పాఠకులు గమనింతురుగాక! కాని పౌరాణికులు విష్ణువు నల్లనివాడనియు - తెల్లని వాడనియు, రెండు రంగులు నతని యందు న్నట్లు - ఎట్లు సమర్థింతురో గోచరింపదు.

విష్ణువిట్లు కృష్ణవర్ణుడగుటవలన విష్ణువు అవతారములను కృష్ణవర్ణముతో కూడియున్న ట్లు వర్ణించుటయు చిత్రించుటయు జరిగినది వామనుడు, పరశురాముడు, రాముడు, కృష్ణుడు మున్నగు నవతారములన్నియు కృష్ణవర్ణయుత ములై యున్నట్లు పురాణములందు జదువు దుము చదువరులారా! రఘుకుల తిలకుడగు రాముడు, యదుకులోత్తంసుడగు కృష్ణచం ద్రుడు, పరశురామ వ్యాసప్రభృతులు నార్యవం శములలో నుద్భవించి కృష్ణవర్ణ విభూషితులై యుండుట సంభవమా? ఆర్యవంశములలో నన్యవర్ణములతో సంబంధములు కలిగిన తరు వాతను నీయవతారములబోలు కృష్ణవర్ణులెక్క డను నుద్భవించుచున్నట్లు కనరారేల? మన్వాది స్మృతులలోగూడ నార్యులు గౌరవర్ణులని వర్ణించి నలుపురంగు శూద్రులకై రిజష్టరు చేయబడియుండుట విబుధులకు తెలియని విష యమా! దశరధుడు వసుదేవుడు మున్నగు సుందర గౌరాంగుల తనువులనుండి కృష్ణ వర్ణులు రామకృష్ణు లెట్లు జనించిరి? ఇయ్యది ధీమంతులకు విపరీతముగా కనిపింపదా? కాని, నేటి యవతారవాదు లీ కృష్ణవర్ణమే తమ వాద మునకు ముఖ్యహేతువుగా ప్రదర్శింపబూను దురు కాని యిది విచారసహము కానేరదు. వాస్తవమున ముందుముందే ప్రధానదేవతలు కల్పించినను, తదుపరి రామచంద్రాదుల నుత్త మగుణ భూషితులగు రాజులను గూడ దేవత లుగ జేసి వారికి మూర్తులను గల్పించి పూజిం పసాగిరి అట్లే యవతారవాదము లోకయున పాదుకొనినది. నేడును గాంధి మున్నగు వ్యక్తుల విగ్రహములను నిర్మించి యాలయము లందుంచి పూజించుట అటనట మనము ప్రత్య క్షముగ గాంచుచున్నాము గదా! ఇట్లే రామచం ద్రాదులను అవతారపురుషులంజేసి పూజింప నారంభించిరి. అందువలననే వారి వర్ణముకూడ కృష్ణమైనది. కాగా విష్ణువు కేవలము కల్పింప బడిన దేవుడేకాని మరి యేమియుకాదు.

జ్ఞానము - భ్రాంతి

బెర్ట్రండ్ రసెల్

అనువాదం జి. ఎస్. ఎన్.

౧౩

వెనుకటి యధ్యాయమున యథార్థా యథార్థముల నే యర్థములో వ్యవహరించితిమో తెలిసికొంటిమి. ఈ యధ్యాయమున నంతకంటె ప్రధానమగు వేఱొక సమస్యను గూర్చి చర్చింపనున్నాము స్థూలముగా దానినిట్లు చెప్పవచ్చును ఇది యథార్థము, ఇది యథార్థము కాదు అని తెలిసికొనుటకు మార్గమేమి? మనకు గల విశ్వాసములలో కొన్ని నిస్సందేహముగా భ్రాన్తిమూలకములు దీనినిబట్టి ఫలానా నమ్మకము భ్రమ కాదు అని నిశ్చితముగా నెట్లు తెలిసికొనగలమను జిజ్ఞాస కలుగుచున్నది దీనికి సరియైన సమాధానము చెప్పగలుగుటకు ముందు, తెలిసికొనుట యనగా మొదటగా నిర్ణయము చేసికొనవలయును ఈ సమస్య మన మనుకొనినంత సులభము కాదు

తొలుత, యథార్థమైన విశ్వాసమునే జ్ఞానముగా వ్యవరించుట కిద్దు. మనము విశ్వసించునది యథార్థమైనపుడు, మనము విశ్వసించినదానిని గూర్చిన జ్ఞానము యథార్థమైనదే యని యనుకొనుచున్నాము కాని ఆ పదమును సామాన్యముగ వ్యవహరించు విధానమును బట్టి యవగతముచేసికొన యత్నించుచో, పై యభిప్రాయము సమంజసము కాదనిపించును ఒక చిన్న యుదాహరణమును తీసికొందము ఇటీవల ప్రధాని పదవి నలంకరించిన మహావ్యక్తి పేరులోని చివరిభాగము 'బి అను నక్షరముతో ప్రారంభమైనదని యొకడు విశ్వసించుచో, ఇటీవలి ప్రధాని పేరు సర్ హెన్రీ కాంబెల్ బానర్‌మన్ అగుటచే, అతని విశ్వాసము యథార్థమైనదనియే మనమెంచ వచ్చును కాని యదియే బెల్ఫోరు అయినచో, అప్పుడు గూడ నాతనిపేరు 'బి' అను నక్షరముతో ప్రారంభమైనట్లేగదా. ఈ విశ్వాసము యథార్థమైనను దీనిని జ్ఞానమని వ్యవహరింప వీలులేదు

ఒక వార్తాపత్రిక, ఒక యుద్ధ పర్యవసానమిట్లున్నదని, దానికి సంబంధించిన టెలిగ్రామ్ ఏమియు రాకుండగనే తెలివితేటలతో నూహించి ప్రకటించినదనుకొందము తరువాత నా వార్తాపత్రిక ప్రకటించిన వార్త యథార్థమైనదనియే తెలియవచ్చెననుకొందము అప్పుడావార్త లోకానుభవము కొంత తక్కువగల యనేక పత్రికా పాఠకులలో నొక విధమగు విశ్వాసము కలిగించుటకు కారణము గావచ్చును. ప్రస్తుతము పాఠకులు నమ్మినదానిలో యాథార్థ్యముండ వచ్చును కాని యంతమాత్రముననే యావార్తను గూర్చిన జ్ఞానము పాఠకులకున్నదని మనము చెప్పనక్కఱలేదు కావున నొక యయథార్థమగు విశ్వాసమును బట్టి సిద్ధాంతీకరించినపుడు, ఆ సిద్ధాంతీకరింపబడిన విశ్వాసము యథార్థమైనను, జ్ఞానముగా చెలామణి యగుటకు వీలులేదు,

అట్లే మన నిగమనమునకు (Deduction) హేతుభూతములైన యాధారవాక్యములు (Premisses) యథార్థములైనను, దోషజుష్టములైన హేతు విధానముచే సిద్ధాంతీకరించినపుడుగూడ, ఆ విశ్వాసమును జ్ఞానమనుటకు వీలులేదు. ఉదాహరణకు నీ క్రింది వాక్యములను పరిశీలింతము గ్రీసు దేశస్థులు మానవులు సోక్రటీసు మానవుడు కావున సోక్రటీసు గ్రీసుదేశస్థుడు ఈ విధముగా నేను సిద్ధాంతీకరించినచో, ఆధారవాక్యములును నిగమనమును యథార్థమైనను, ఆధారవాక్యమును బట్టి నిగమనము సాధింపబడక పోవుటచే, సోక్రటీసు గ్రీసుదేశస్థుడన్న జ్ఞానము నాకు గల్గినట్లు లెక్కగాదు అట్లైన' యథార్థములగు నాధారవాక్యములను బట్టి సిద్ధాంతమైనది తప్ప మరేదియు జ్ఞానముగా చెలామణియగుటకు వీలులేదనియే మన యభిప్రాయమా? కాదు అట్టి నిర్వచనమున నవ్యాప్తియును, నతివ్యాప్తియును గూడ గోచరమగును తొలుత నతివ్యాప్తియను దోషము దానిలో కాననగును ఏలన మనకు గల యాధారవాక్యములు యథార్థమైనంత మాత్రమున మనకంతయు సిద్ధమైనట్లుగాదు అవి మనకు జ్ఞాతములై యుండవలయును బెల్ఫోర్, ఇటీవలి ప్రధాని యని విశ్వసించువ్యక్తి ఆ ప్రధాని పేరు 'బి' తో ప్రారంభమైనదన్న యథార్థమగు హేతువాక్యమును బట్టి యథార్థమగు నిగమనమునే సిద్ధాంతీకరింప వచ్చును కాని యీ యథార్థ విషయముల నాతడెరిగినట్లు చెప్ప వీలులేదు కావున జ్ఞాతములగు నాధారవాక్యములను బట్టి యథార్థముగా తేలిన యంశమునే జ్ఞానమని చెప్పవలయును కాని ఈ నిర్వచనములో నొక చక్రవాదము గలదు జ్ఞాతములగు నాధారవాక్యము లననేమో మనకు ముందే తెలిసియున్నట్లు పై నిర్వచనము చెప్పక చెప్పుచున్నది కావున అలౌకిక ప్రత్యక్షజ్ఞానమునకు పై నిర్వచన మన్వయించును దీనిని మనము ఇట్లు చెప్పవచ్చును అలౌకిక ప్రత్య

క్షము వలన జ్ఞాతములగు నాధారవాక్యములను బట్టి యథార్థమైనదిగ తేలినదే వైకారిక జ్ఞానము

అలౌకిక ప్రత్యక్షమువలన గలుగు జ్ఞానమునకు సంబంధించిన సమస్యలనటుంచి, పైన వైకారిక జ్ఞానము విషయమై సూచించిన నిర్వచనమును పరామర్శింతము ఆ నిర్వచనము నంగీకరించుటకు మున్ను అధిగమింపవలసిన మొదటి యభ్యంతరమది జ్ఞానమును పరిమితమొనర్చుచున్నదనుట యథార్థముగ నొక యలౌకిక ప్రత్యక్షజ్ఞానము కారణముగా యథార్థవిశ్వాసమొకటి వ్యక్తులలో నేర్పడుట సంభవించు చుండును కాని యా విశ్వాసమును నాయలౌకిక ప్రత్యక్షజ్ఞానమును బట్టి యనుమాన ప్రమాణముచే సాధింపవీలుకలదు కాని పై యుదాహరణమున నట్లు హేతువిధానముచే సిద్ధాంతము చేయుట యన్నది జరుగలేదు

ఉదాహరణకు చదువుటవలన నేర్పడిన విశ్వాసమును దీసికొందము వార్తాపత్రికలు రాజు మరణించినట్లు ప్రకటించుచో, రాజు మరణించెనని విశ్వసించుటలో ననౌచిత్యమేమియు నుండదు ఏలన యథార్థము కానిచో ప్రకటింపబడు వార్తవంటిదిగాదు గదా యిది రాజు మరణించిన వార్తను పత్రిక ప్రకటించిన దనుటలో సందియము కలుగనక్కరలేదు ఇచ్చట మన విశ్వాసమునకు నాధారమగు నలౌకిక ప్రత్యక్షజ్ఞానము, వార్తను ప్రకటించు ప్రింటును చూచుటచే నుపలబ్ధములైన యింద్రియార్థముల యునికిని గూర్చిన జ్ఞానము సులభముగా చదువచేతగాని వ్యక్తి విషయములో తప్ప ఈ జ్ఞానము చైతన్యముగా పరిణమింపదు బాలునకు అక్షరముల రూపమును జ్ఞానము కొంత యుండవచ్చును క్రమముగా నెంతయో పరిశ్రమ యొనరించిన పిమ్మట, వాని యథార్థావగతి క్రమముగా నొందగలడు కాని చదువ నలవాటుపడిన యెవ్వడైనను ఆ యక్షరముల యర్థమేమో సులభముగా పోల్చుకొనగలడు కాని అచ్చైన యక్షరములను చూచుటయను నింద్రియార్థ జన్యమగు జ్ఞానమును జాగ్రత్తగా పరిశీలించిన పిమ్మటనే ఎఱుకపడును కావున అక్షరములనుబట్టి వాని యర్థమిట్లుండునని యనుమాన ప్రమాణముచే నూహింప సాధ్యమైనను, పాఠకుడు అట్లు చేయగల్గినను, వాస్తవమునకు అది యట్లు జరుగుటలేదు కావున తార్కికానుమితి యని వ్యవహరించుటకు వీలైన యెట్టి వ్యాపారమును ఆతడు చేయుటలేదు అయినను వార్తాపత్రిక రాజు మరణవార్తను ప్రకటించుచున్నదను విషయము పాఠకునకు తెలియదనుట యసంభవము.

అందుచే, యథార్థమగు తార్కిక సంబంధమున్నచో, కేవలము సాహచర్యబలముచే గూడ, - అలౌకిక ప్రత్యక్షమువలన గలిగిన వైకారిక జ్ఞానమును గూడ మనమంగీకరింపవలెను తార్కికానుమితికాక ఒక విశ్వాసమునుబట్టి వేఱొక విశ్వాసము నూహించుటకు సాధనభూతములగు మార్గములున్నవి ప్రింటును బట్టి యర్థమును నిర్ణయించుటకు నడుమగల యాలోచనావిధానమును మూడు విధముల వ్యాఖ్యానింపనగును వీనిని మనస్సంబంధియగు ననుమతిగా వ్యవహరింపవచ్చును వైకారికమగు జ్ఞానమును సిద్ధింపజేయుటకు సాధనభూతముగా నీ మనస్సంబంధియగు ననుమితిని (Psychological inference) అంగీకరింపవచ్చును కాని మనస్సంబంధియగు ననుమితికి ననుగుణముగా వర్తించు తార్కికమగు ననుమితిగూడ నందు గోచరింపవలయును ఇట్లు చెప్పుటవలన, వైకారికజ్ఞాన నిర్వచనములో కొంతస్పష్టత తగ్గినది ఏలన గోచరించుటలో కొంతయస్పష్టత లేకపోలేదు అట్లు గోచరించుటకు ఎంత అనుసంధానమావశ్యకమో అది మనకు తెలుపదు కాని వాస్తవమునకు, జ్ఞానము ఒక స్పష్టమైన నిర్వచనమునకు బద్ధమైయుండదు ఏలన అది సంభవాభిప్రాయములో (Probable opinion) కలసిపోవును ఇది ఈ యధ్యాయముచివఱ మనకు నవగతమగును దీనికి సుస్పష్టమగు నిర్వచనము దొరకదు ఏలన అట్టి నిర్వచన మేమైన లభించినను, అది తప్పుత్రోవల బట్టించును అసలుచిక్కు వైకారికజ్ఞానము విషయమునగాదు బయలుదేరునది, మరియు లౌకిక ప్రత్యక్షజ్ఞాన విషయమున. మనము వైకారికజ్ఞానమును చర్చించునంతవరకు, మనకు నలౌకిక ప్రత్యక్షజ్ఞానమే ఆధారభూతమై యొప్పును అలౌకిక ప్రత్యక్షమునకు సంబంధించిన విశ్వాసములలో కొన్ని యథార్థమైనవిగను మరికొన్ని యయథార్థమైనవిగను విచక్షణచేయుటకు ననువగు ప్రమాణమేమియును కన్పట్టదు. ఈ విషయమున నిర్దుష్టముగా నిదమిత్థమని నిర్ణయము చేయ సాధ్యముగాదు. సత్యములను గూర్చిన మన జ్ఞానమంతయు కొంతవఱకు సందేహదూషితమై యుండును ఈవిషయమును లెక్కగొనని యే సిద్ధాంతమైనను స్పష్టముగా దోషజుష్టమై యుండును ఆ సమస్యకు సంబంధించిన చిక్కులను పరిష్కరించుటకు ఏదోయొక విధానము నవలంబింపవలయును సత్యమునుగూర్చిన మన సిద్ధాంతము కొన్ని సత్యములను స్వతస్సిద్ధమైనవిగ విచక్షణపూర్వకముగ తెలిసికొనుటకు తగిన యవకాశములను గూర్చును. ఒక విశ్వాసము యథార్థమైనపుడు తదనుగుణమగు వాస్తవ విషయమొకటి యుండుననియు అందు ఆ విశ్వాసమునకు సంబంధించిన వేర్వేరు

విషయము లొక సంశ్లిష్టముగు నవయవిగా నేర్పడునని యును, మన మీవఱకే చెప్పియుంటిమి ఆవిశ్వాసము ఆ వాస్తవవిషయమునకు సంబంధించిన జ్ఞానముతో కూడియున్నట్లు చెప్పబడినది కాని మనము ఈ యధ్యాయములో మనము పరామర్శించుచున్న (కొంత వఱకు నస్పష్టమైన) షరతులను తీర్చవలెను కేవలము విశ్వాసములో గూడుకొనిన విషయముననేగాక ప్రత్యక్షమువలన నేర్పడినజ్ఞానము వేఱొకటిగలదు. ఉదాహరణకు సూర్యాస్తమయకాలమును గూర్చి నీకు తెలిసినచో, ఆకాలమున సూర్యుడస్తమించుచున్నట్లు నీకు తెలియగలదు అదే సత్యజ్ఞానముద్వారా లభించిన వస్తుస్థితికి సంబంధించిన జ్ఞానము, కాని వాతావరణము విస్పష్టముగా నున్నచో, పడమటిదిక్కునకు దిరిగి యస్తమించు సూర్యుని చూడగలవు అప్పుడు వస్తు జ్ఞానముద్వారా అదే విషయము నీకవగతమగును

కాబట్టి ఏసంకీర్ణ విషయమునకు సంబంధించియైనను, తెలిసికొను మార్గములు రెండు విధములుగా గలవు

(1) నిర్ణయమువలన (అందలి వేర్వేరు అంగములు, వానికిగల సంబంధమును నిర్ణయింపవలసిన రీతిగనే) - నిర్ణయింపబడును

(2) ప్రత్యక్షమనబడెడి సంకీర్ణమగు విషయమును, గూర్చిన యనుభవ ముండుటవలన (ఇచ్చట ప్రత్యక్షము) కేవల మింద్రియగోచర వస్తువులకే పరిమితమై యుండును

పై రెండింటిలో నొక సంకీర్ణవిషయమును గ్రహించుటకు సాధనభూతమగు రెండవపద్ధతి - అనుభవపద్ధతి - వాస్తవ విషయమొకటి యున్నపుడు సాధ్యమగును కాని మొదటిపద్ధతిలో నిర్ణయమంతయు భ్రాంతిమూలకము రెండవ విధానమే మనకు సమ్యగ మగు నవయవిని సమకూర్చును అందలి భాగములు- కలసి యొక యవయవిగా నేర్పడునట్లు సంయోజనపఱచు సంబంధములో నున్నప్పుడు అది సాధ్యమగును అట్లుగాక మొదటిపద్ధతి మనకు అంగములను, సంబంధమును, వేర్వేఱుగా సమకూర్చును అంగములను వాని సంబంధమును విడివిడిగా వాస్తవము కావచ్చును కాని పరస్పర సంబంధము లేకపోవచ్చును అయినను నిర్ణయము జరుగవచ్చును

పదునొకండవ యధ్యాయమున, స్వతః ప్రామాణ్యము రెండు రకములుగా నుండుననియును, అందులో నొకటి సంపూర్ణముగా సత్యనిర్ణాయకమనియు వేఱొకటి యాంశికముగా సత్యనిర్ణాయక మనియు మనకు జ్ఞప్తిలో నుండియుండును ఈ రెండింటిని ఇప్పుడు మనము వివేచనము చేయవచ్చును

సత్యమునకు దూరముకాని విషయమునుగూర్చిన్ని యనుభవము మనకు గలిగినప్పుడు సత్యముస్వతః ప్రమాణమని మనము చెప్పవచ్చును డెస్డెమోనా కాషియో యెడల ననురక్తయై యున్నదని ఒథెల్లో విశ్వసించునపుడు, అతని విశ్వాసము యథార్థమైనచో దానికి ననుగుణమగు వాస్తవవిషయము కాషియో యెడల డెస్డెమోనా అనురాగమై యుండును డెస్డెమోనాకుతప్ప మరి యెవ్వరికైనను అనుభవములో లేని విషయమది కావున మనము పర్యాలోచించి స్వతః ప్రామాణ్యము దృష్ట్యా డెస్డెమోనా కాషియో యెడల ననురక్తయై యున్నదన్న సత్యమును (అది సత్యమైనచో) - డెస్డెమోనాకే తెలియు విషయము

మనస్సునకు సంబంధించిన విషయములన్నింటికిని ఇంద్రియార్థములకు సంబంధించిన విషయములన్నిటికిని ఇట్టి వైయక్తిక జ్ఞేయతా లక్షణమే గలదు కావున ప్రస్తుత మన ముపయోగించు నర్థములో నవి స్వతః ప్రమాణమై యుండిన దొక్కవ్యక్తికే ఏలన మానసిక విషయములను గూర్చిగాని ఇంద్రియార్థములను గూర్చిగాని అనుభవము గడించుకొనున దొక్కవ్యక్తియే జరిగిన ఏ ప్రత్యేక సంఘటనమునకు సంబంధించిన విషయమైనను ఒక్క వ్యక్తికంటె నెక్కువ మందికి స్వతః ప్రమాణమై యుండదు. అట్లుగాక సామాన్యములను సంబంధించిన విషయములకే వైయక్తికజ్ఞేయ లక్షణములేదు, అనేకులకు ఒకే సామాన్యములను గూర్చిన జ్ఞానముండును కావున అనేక సామాన్యముల నడుమగల సంబంధము అనేక వేర్వేఱు వ్యక్తుల యనుభవముద్వారా వ్యక్తమగును ఒకానొక సంబంధములోనున్న కొన్ని పదములతో గూడుకొనిన సంకీర్ణవిషయము ననుభవముద్వారా మనకువిదితమగు నన్ని సందర్భములలోను, ఆ పదము లావిధముగా సంబద్ధములై యున్నవను సత్యమునకు విశేషమగు స్వతః ప్రామాణ్యముగలదు ఇట్టి సందర్భములో, ఆపదములట్లు సంబద్ధములై యున్నవను నిర్ణయము యథార్థమై తీరవలయును కావున ఇట్టి స్వతః ప్రామాణ్యమే సత్య నిర్ణాయకమగును

కాని ఇట్టి స్వతఃప్రామాణ్యము కేవలము సత్యమును నిర్ణయింపగలిగిన దైనప్పటికిని, ఏ నిర్ణయము పట్ల నైనను నది సంపూర్ణమగు నిశ్చితత్వమును సమకూర్పలేదు ప్రకాశించుచున్న సూర్యుని రూపమున నున్న ఒక సంకీర్ణ విషయమును మనము గోచరింపజేసికొన్నామని యనుకొందము అప్పుడు సూర్యుడు ప్రకాశించుచున్నాడన్న నిర్ణయమునకు రాగలుగుదుము. ప్రత్యక్షజ్ఞానము కలిగినపిమ్మట నొకనిర్ణయము చేయుటకుముందు, సంకీర్ణమగు విషయమును విభజించి

తెలిసికొనవలసిన యావశ్యకత గలదు. సూర్యుని, ప్రకాశనమును ఆ విషయమునను సంగములుగా మనము వేఱుచేయవలసి యుండును ఈ విధానమున మనము కొంత పొరబడుటకు నవకాశము గలదు వస్తుస్థితికి సంపూర్ణమగు స్వతః ప్రామాణ్యమున్న పట్ల, ఆ వస్తుస్థితికి ననుగుణమైనట్లుగా భావింపబడిన నిర్ణయము సంపూర్ణముగా సందేహింపరానిదిగ నుండుననుటకు వీలులేదు ఏలన అది వస్తుస్థితికి ననుగుణముగా లేకపోవచ్చును వెనుకటి యధ్యాయమున వివరింపబడిన విధముగా నది వస్తుస్థితికి ననుగుణముగా నున్నచో, నప్పుడా నిర్ణయము యథార్థమై తీరును-

రెండవ రకమునకు జెందిన స్వతః ప్రామాణ్యము నిర్ణయమునకు సంబంధించినది ఒక సంకీర్ణమగు నవయవిగా వస్తుస్థితిని సూటిగా ప్రత్యక్షగోచరము చేసికొనుటవలన నేర్పడినదిగాదు ఈ రెండవరకపు స్వతః ప్రామాణ్యమున ననేక తరతమ భేదములు గలవు. ఉదాహరణకు కఠినమైన బాటవెంబటి పోవుచున్న గుఱ్ఱము ఉదాహరణము దీసికొందము మొదట దాని డెక్కలచప్పుడు వినుచున్నామనుటలో సందియమేమియును లేదు క్రమముగా మనము శ్రద్ధతొ నాలకించినచో అది ఊహయనియు లేక మన గుండెయే అట్లు కొట్టుకొనుచున్నదని యనుకొను సమయముగూడ వచ్చును తుదకనట్టి చప్పుడొకప్పుడుండెనా యను విషయమై సందేహముగూడ గల్గును పిమ్మట మనకేమియు వినబడుటలేదనియే యనుకొందుము తుదకు, మనకేమియు వినబడుటలేదని తెలిసికొనగలము ఈ విధానములో, స్వతః ప్రామాణ్యమున వరుసగా తరతమ భేదము గోచరించును ఆదిలో నది యధిక ప్రామాణ్యము కలిగి క్రమక్రమముగా దానికి తగ్గుదల కల్గును

కాని ఈ తరతమ భేదము ఇంద్రియార్థములను ననుభవమునకు దెచ్చుకొనుటలలో గోచరమగునది కాదు కాని వానిమీద నాధారపడియున్న నిర్ణయములలో నా తరతమ భేదము గన్పట్టును

నీలము, ఆకుపచ్చన అను రెండు వర్ణచ్ఛాయలను పోల్చి చూచుచున్నామనుకొందము. అవి రెండును వేర్వేరు వర్ణచ్ఛాయ లను విషయమున మనకు సందియము కలుగదు కాని ఆకుపచ్చని రంగును క్రమక్రమముగా నీలపురంగుగా మార్చినచో - అనగా ఆదిలో నీలమును ఆకుపచ్చని కలసినట్లుగను, తరువాత ఆకుపచ్చన - నీలముగను, పిమ్మట నీలముగనున్నైనచో, మనమట్టిభేదము ననలు చూచితిమా లేదా యను సందేహము కలుగును. తుదకు భేదము బొత్తుగా తెలియలేని స్థితి యేర్పడను అట్లే ఒక సంగీతవాద్యమును ప్రయోగించునపుడుగూడ నిట్టి క్రమబద్ధమగు తరతమ భావమే మనశ్రుతికి గోచరమగును. కాబట్టి ఇట్టి స్వతః ప్రామాణ్యమే తరతమ భేదములతో గూడుకొనియున్నది కావున అల్పస్వతః ప్రామాణ్యమున్న వానికన్న అధికమగు స్వతః ప్రామాణ్యమున్నవే విశ్వసింపదగినవి

వైకారికజ్ఞానమున, మన తుది ఆధారవాక్యములకు కొంతస్వతః ప్రామాణ్యముండును అట్లే వానిని బట్టి తేల్చిన నిగమనములతోడి వానికిగల సంబంధముగూడ నట్లే స్వతః ప్రమాణమై యుండవలెను ఉదాహరణకు క్షేత్రగణితమునందలి యొక హేతుపద్ధతిని దీసికొందము మనము వేనినిబట్టి హేతువు నుదహరించుట ప్రారంభించితిమో, అస్వతస్సిద్ధ సత్యములు ప్రమాణమైనంతనే సరిపోదు హేతువిధానములో మనము వేయు ప్రతిఅడుగున, ఆధారవాక్యమునకును నిగమనమునకును గల సంబంధము స్వతః ప్రమాణమై యుండవలెను క్లిష్టమగు హేతుపద్ధతిలో, నట్టి సంబంధమునకు నల్పమైన స్వతః ప్రామాణ్యముండును కాన అట్టి క్లేశమున్నచోట్ల, హేతు విధానములో దోషములుండుట యసంభవముగాదు.

ఇంతవరకు చెప్పిన దానినిబట్టి, వైకారిక జ్ఞానమునకు సంబంధించి చెప్పునపుడు - అలౌకిక ప్రత్యక్ష జ్ఞానము దానికిగల స్వతఃప్రామాణ్యపు పాలునుబట్టి విశ్వసింపదగినదని మనమంగీకరించుచో గమనార్హములగు నింద్రియార్థములు, తర్కగణిత శాస్త్రములకు సంబంధించిన సులభగ్రాహ్యములగు సత్యముల నుండి (వీనిని నిస్సందేహముగా మనమంగీకరింపవచ్చును), తమ ప్రతియోగులకంటె నధికముగా సంభవమైనట్లు కన్పించు నిర్ణయములవరకు, నీవిశ్వాస్యతలో తారతమ్యములుండును మనము దృఢముగా విశ్వసించునది, యథార్థమైనచో, అలౌకిక ప్రత్యక్షమైనచో లేక దానిని బట్టి యనుమాన ప్రమాణముచే సాధింపబడినది యైనచో దానికి జ్ఞానత్వస్థితి యేర్పడును మనము విశ్వసించునది యథార్థము కానిచో భ్రాంతియగును మనము నమ్మునది జ్ఞానముగాని భ్రాన్తిగాని కానిచో - మనము కొంత సంకోచముతో విశ్వసించునదిగూడ అధికమగు స్వతః ప్రామాణ్యము గలిగిన దానినుండి యుత్పన్నమైనచో- సంభావాభిప్రాయమని వ్యవహరింపబడును కావున జ్ఞానముగా చెలామణి యగుదానిలో నెక్కువభాగము సంభవాభిప్రాయముగా పరిణమించును

సంభవాభిప్రాయమునకు సంబంధించి చెప్పవలెనన్న - సత్యమును నిర్వచించునపుడు మనము వదలివైచియు, సత్యమును నిర్ణయించుటకు సాధనభూతమైనదిగ చెప్పబడెడి సందర్భశుద్ధి దాని నవగతముచేసి

కొనుటలో నెక్కువ తోడ్పడగలదు విడివిడిగా సంభవాభిప్రాయముల కూటమిలో పరస్పర సంబంధమున్నచో విడివిడిగా నున్న యభిప్రాయములకంటె ఆ కూటమికే అధికప్రామాణ్యముండుట కద్దు శాస్త్రీయములగు నూహలధికముగా సంభవమౌట ఇట్టి విధానముల వలననే. ఈ సంభవాభిప్రాయములకు విడివిడిగా నంత ప్రామాణ్యముండదు. కాని కూటమిలో దానికి ప్రామాణ్యము గలదు సామాన్యతాత్వికోహలకుగూడ నదే యన్వయించును ఒక సందర్భములో నట్టి యూహలు సందేహాస్పదములై యొప్పును కాని అవి సంభవాభిప్రాయముల కూటమిలో ప్రవేశపెట్టు వ్యవస్థను గూర్చియు, సందర్భశుద్ధిని గూర్చియు మనము విచారించునపుడు వానికధికమగు నిశ్చితత్వ మేర్పడును ప్రత్యేకముగా నిది, స్వప్నమునకును, జాగ్రదవస్థకును నడుమగల భేదమునుగూర్చి వివేచనము నేయుటవంటి విషయములకు గూడ నన్వయించును పగళ్ళవలెనే, స్వప్నములకుగూడ ప్రతిరాత్రియును సందర్భశుద్ధి యున్నచో, మనము స్వప్నములను విశ్వసింపవలయునో, జాగ్రదవస్థను విశ్వసింపవలెనో తెలిసికొనగల్గెడి వారము కాము కాని యథాతథముగా జెప్పవలెనన్న, సందర్భశుద్ధియను ప్రమాణము స్వప్నములను ఖండించి జాగ్రిదవస్థను సమర్థించును కాని ఈ ప్రమాణము, అది సఫలమైనచోట, దానికి గల సంభవత నధికమొనరించినను ఆ సందర్భశుద్ధిగల వ్యవస్థలో నెక్కడనో ఒక్కచోట నిశ్చితత్వమున్ననేగాని - పరిపూర్ణమగు నిశ్చితత్వమును సమకూర్పదు కావున - సంభవాభిప్రాయము, కేవలము వ్యవస్థగా నేర్పడినంత మాత్రమున నసందిగ్ధమగు జ్ఞానముగా తనకుతానై పరిణమింపదు.

బిరుదప్రదానము

శ్రీ అయితం కాళీవరప్రసాదరాయకవి

తెలివిలేనివారు తెలిసియుఁ దెలియని యెడ్డెవారు పెక్కురీ జగాన
గాని తెలిసికూడఁ గవినయ్యు నేను దంభంబుఁ బూనినాఁడ బ్రతుకు కొఱకు.

ఏరీ! రాజులు ప్రాజ్ఞతేజలుగనన్ హేరాళమందాకినీ
సారాభంగ తరంగ తుంగ కవితా సర్వంకష ప్రజ్ఞలౌ
వారిప్పుష్క కవిత్వవృత్తులను నివ్వారంచు వీరంచు నౌ
ప్వారంబల్కఁగఁ జాలు నేర్పరులు పెంపన్నాలు ధన్యాత్మకుల్

రాతిని రత్నమున్ తెలియరారు, సుధారస మున్విషంబునేన్
చేతముతో నెఱుంగఁగల చేవలజూడము, కస్తురిన్మషిన్
చేతికి నీయగా నెఱుగు చిన్నెలుగానము, వీరు రాజులై
ఘాతిరిగాక ఘూతినుడు ప్రోడలె సత్కవిరాజ పాళికిన్.

రాజులు భావకందర నిరంతరచారి మలోఁదమంబులో
తేజము దప్పి దుర్విషయదీపిత సర్పకభోగరత్న నీ
రాజనకాంతి, భ్రాంతివడి ప్రజ్ఞలఁగోల్పడి దష్టమూర్తులై
రాజును పాఱఁజాలవిటఁ గావఁగవీంద్ర నరేంద్ర మంత్రముల్.

స్వార్ధరాజ గేహము వ్యభిచారగృహము వెలపడంతుక రాజ్యాంగవిభుఁడు వాఁడు
నటనఁజతురత భోగంబు ఘటనపఱుపఁ గవన ధనమిడి చెడెడుఁగా కవివిటుండు.

మద్యపానమునకు మత్తకాశినులకు మాఱులేని మలిన మార్గములకు
మొఱుగు కుక్కలకును ముదమాఱనిడుఖల్లు నడుగఁబొగడు కవి మహాఖలుండు.

దానకర్ణ విఖ్యాతి యాధర్మజాది రాజవరులకే లభియింపరాని బిరుదు
బిచ్చమిచ్చెడు వాఁడెల్లఁ బెచ్చుపెరుగు కాకవీంద్రవాక్కుల జిత కర్ణుడయ్యె.

రాజకీయవేత్తకు గల రాతిగుండె మృదుల నవనీతమనినారు మృషలుకవులు
స్వార్థమతితోడ దాసోఽహమనెడి వీరు మానవత్వంబు లేనట్టి మందమతులు.

భౌతిక జీవనంబునకు స్వర్ణమపశ్యము గాదనంగ నా
ధాతకుఁ గాదుగాని యొక దర్పమదాంధ కరార్పకంబు వి
ద్యోత కళావిదగ్ధమతి నొప్పియు దుష్కవియై యనర్థ వా
క్పాతకియై యొకానొకఁడు క్రమమరాళమనంగ రోసెదన్.

పంక సంకీర్ణ మైనట్టి పద్మమనఁగ సూక్ష్మకంటక వచ్చారు సుమమనంగ
భుజగవేష్టిత చందన భూజమనఁగ వ్యసనన్నృపుడార్యుఁడయ్యు దుష్ప్రాపకుండు

దర్పధనికుని దారిలోఁ దారసిలఁగ వేఱు భాగ్యవంతుఁడు పుష్పవృష్టిఁగురియు
సుకవిలేమిలో దర్శించి సోలియడుగఁ గనులు గనరావు వినరాదు కర్ణయుగళి.

లలితమతులంట' సుకృతాభిలాషులంట భారతీయులు' వారల వంశమందు
శునులు ఖరములు సూకరాల్ జననమందె జెప్పికొనరాదు భరియింపఁ జేతగాదు.

కవిని, గవిలోకనిందకే గడఁగినాఁడ దానఁ దప్పుపట్టకు కాళిదాస నీవు
చెలఁగు సుకవీంద్ర శిష్యప్రశిష్యపాద ధారుణీరజోధన్య మూర్ధంబునాది.

కవి పదాంభోజ రేణునికాయ మెవ్వ రెవరు తల దాల్తు రావారి నెల్లమించు
భక్తిఁగలిగియు దంభంబ బద్ధశక్తి సహమునోర్వని నామాట యార్యవాక్కు.

ధనుల నిందించినానని దలఁపవలదు స్వార్థరహితులు లోకకల్యాణరతులు
పనులు వేదాంతమును జాటు వినుతమతులు గలరు వారికి నా నమస్కారకోటి.

కానరాని కనులఁ గలికంబునుం గూర్చి పొరలఁగోసి దృష్టిఁబొందజేయు
నట్టి వైద్యుసుకవి నక్కటా నిందించు విబుధులున్న యెడల వెఱ్ఱివారు.

విశ్వమాతకు ధని నాగ విబుధుఁడనఁగ నేత్రములు రెండు దృష్టి గాన్పింపనపుడు
కవిభిషక్కు వాక్చికిత్సకై గడంగు నంతె' యశులు లేక చేయఁగలదేమి.

వికట సిద్ధాంత విపరీత కుకవికవిత తీరుగలవారు కనుబ్రామినారు కవుల
నలినబాంధవు మేఘ మెన్నాళ్ళుగప్పు ననకు, కవిహంస కిపుడు దుర్దినముగాదె.

పరమసత్యావలంబికి భయములేదు భావనిర్మాయికిని దలవంపులేదు
న్యాయమార్గాను శీలికి వ్యధలులేవు అనకు! నా కనుభూతి యయ్యెను మహాత్మ.

దంభము గావలెన్ప్రబల దర్పము చూపవలెన్నికృష్ట సం
రంభముబూనఁ గావలెను రాజుల దేవులటంచు నన్వలెన్
శుంభదమేయ వేషమున శోభిలఁగావలె మేడిపండుగా
గుంభిని సంచరింపవలెఁ గూటికి నేటి దినంబులందునన్

రచనకు గారణంబెఱుఁగరాదు, పరిస్థితు లెంచబోరు, త
ద్రచన గలట్టి సద్రసము, ద్రావరుకష్టమెఱుంగలేరు దు

ర్వచనము లాడుచుండెదరు పల్కుట కర్తృపదాన్వయార్థమే
రచనఁగలట్టి దట్టుల, కరంబు ఖలుల్గద! దుర్విమర్శకుల్.

సిరినిదలంచి, వంశమును చిత్తమునందలపోసి బాంధవ
స్ఫురణను సంస్మరించి తమ ప్రానికమం గల లీలనెంచి సుం
దరతమమంచుఁగా కవితఁ దత్పరబుద్ధి మృషావచస్కులై
పరిపరి రీతులంబలుకు పండితమన్యుల నోరుగాల్పనే.

అసృతవచస్కు లీఖలులు కక్కట నాల్కలు రెండు స్వార్థులై
చనుట లహంకృతింగొనుట, సాజపుదోసములై యెలర్పఁగా
మనెదరటయ్యు ధీరులు ప్రమాదమునం బడఁబోరు, జిహ్వకల్
ధనపద సఖ్యబాంధవ విధానత బద్ధముగా వొకప్పుడున్

యోగివరుండు సత్కవి యయోగ్యుల వాక్కులఁ బొంగిక్రుంగ ను
ద్యోగములోన నుండఁడు మహోత్తమ తాదృశబుద్ధి యెవ్వఁడో
యేగహనాంతరంబుననొ! నేతఱి నోలవలేశ మేనియున్
బాగని మెచ్చెనేని, యరుసంబున నభ్రపదంబు నంటెడిన్

ఇటులిటు లిట్లు చేయుమని యెడ్డెతనానను బల్కు భోగిరా
ట్పటిమకులాంగఁగాఁ గవన పల్లవపాణిని గూర్చు నీచుఁడున్
విటునకుఁ దన్విఁదార్చి విను వీఁడెటు చెప్పిన నట్లటంచు న
చ్చోటు విడుపేడి యున్సములు చోద్యమదేల? నపుంస చేష్టకున్

కల్పాంత స్థిరకీర్తికాయులును, చక్కందిద్ది కావ్యంబులన్
నల్పంగల్గిన యట్టి స్రష్టలును దృగ్జాడ్యంబునన్ చంచలా
కల్పంబీ సిరినమ్మి మూఢ నృపలోక ద్వారసంచారులై
యల్పోక్తుల్గద? దగ్ధకీర్తులుగదా త్యక్తాభిమానుల్ గదా

బ్రహ్మసృష్టి యెంత పాడటెననువాఁడు చెలఁగి గడ్డిపోచఁ జేయలేఁడు
నటకు నవ్వువాఁడు నటియించుటల కేమి కూర్పగలఁడె పైఁట జార్పునేని.

స్వార్థ విషవహ్ని పంచనాబాడబంబు
భోగ తృష్ణా మహాకీలి పుడమినెల్ల
బొండమినిండారి యన్నింటనడరెఁగాన
శుష్కతృణమిందు ధర్మంబుసూ! మహాత్మ!

ప్రజలు వంచింపఁ జూతురీ ప్రకృతి, నిదియు జగతి వంచించు నిద్ది నైసర్గికంబు;
కానఁ బ్రబల మోసంబునఁగలదు జయము దానదలఁతుఁ గైతవబిరుదంబు నొకటి

అరుణ

శ్రీ అమరేంద్ర

గతసంచిక తరువాయి

మొదటి సారిగా అరుణకి సందేహం బయలుదేరింది 'తను ఏవిధంగానైనా దుర్గకి బాధ కలిగిస్తున్నానా' అని ఆలోచించ సాగింది. తనమీద దుర్గకి విరోధభావం కలగటానికి కారణమేమీ అరుణకి కనబడలేదు తను రావటంవల్ల ఆ యింట్లో కలవరం పెరుగుతున్నదేమోననే సంశయం అరుణని బాధించసాగింది తన రాకవల్ల ఇతరులకి ఏమాత్రం కష్టం కలిగినా తానిక అక్కడి నుంచి వెళ్ళిపోవలసిందే ఆ ఇంటికి తాను ఏ అధికారంతో వచ్చింది, దుర్గ ఆహ్వానం తప్ప వేరే అధికారమేముంది? అటువంటి దుర్గకే తాను కష్టం కలిగిస్తుంటే ఇక ఆ ఇంట్లో క్షణమైనా ఉండటం దేనికి?

"పిన్నీ కొనిపెట్టవూ" అని పిల్లలు వచ్చి అరుణని చుట్టివేశారు ఇంతలో రామారావు గది బైటికివచ్చి దేనికి పిల్లలు గొడవచేస్తున్నారని అడిగాడు. అరుణ వాళ్ళకి కావలసినవేమిటో చెప్పింది రామారావు జేబులోంచి డబ్బుతీసి ఇచ్చాడు ఇద్దరూ గంతులేస్తూ పరిగెత్తుకు వెళ్ళిపోయారు అరుణకూడా అక్కడినుంచి వెళ్ళిపోబోయింది రామారావు 'అరుణా ఎక్కడికి? ఏమైనా పని వుందా?' అనిఅడిగాడు ఏమీలేదనిచెప్పి అరుణ అక్కడే నిలబడింది 'మీ అక్క ఏంచేస్తోంది?' "కోపం వచ్చినట్లుంది. గదిలో పడుకుంది" అని అరుణ మళ్ళీ వెళ్ళబోయింది. "ఆగు అరుణా నీతో మాట్లాడుతుంటే మనసుకి ఎంతో శాంతి, ఎంతో హాయి-" అని రామారావు అరుణ ముఖంకేసి జాలి గొలిపేట్లు చూశాడు. అరుణ ముఖం జేవురించింది. తెలియకుండా పెదవి వణికింది. తెలియకుండా అడిగింది- "బావా నాలో ఏంశక్తి వుంది? అదంతా మీ ఊహా?" "ఏమో నాకు తెలియదు అరుణా నువ్వు వచ్చిన తరవాత మా ఇంటికి కొత్తకళ వచ్చినట్లుంది ముసుపెన్నడూ లేనికాంతి ఏదో వచ్చినట్లుంది."

తాను ఉండటంవల్ల ఒకరికైనా సుఖం కలుగుతున్నదా? ఆ సంగతి ఆమె నమ్మలేకపోయింది తను ఆ ఇంట్లో ఉండటం ఏ ఒక్కరికైనా సంతోషం కలిగిస్తున్నదని ఆమె తెలుసుకోలేకపోయింది రామారావు అన్న మాటలు నమ్మింది కాని పైకిమాత్రం "బావా ఇంకోమాటు నన్ను ఇల్లా పొగిడితే నేను అక్కతో చెప్పి ఇంట్లోంచి వెళ్ళిపోతాను" అని బెదిరించింది.

ఇంతలో రుసరుసలాడుకుంటూ దుర్గ ఆ దోవన వచ్చింది "దుర్గా! ఇదిగో ఒకమాట వినిపో" అని రామారావు కేకపెట్టాడు దుర్గ "తొందరేముంది మీసల్లాపాలు పూర్తి అయినాక చెబుదురుగాని ఆమాట మీ సరసాలకి నేనేం అడ్డుపడను" అని బదులుచెప్పి వెళ్ళిపోయింది అరుణ గుండెలో శూలంతో పొడిచినట్లయింది రామారావు ముఖంమీద కొరడాతో చురుక్కున చరిచినట్లయింది

4

"పిన్నీ! ఇవాళ మాకు బళ్ళో కొత్తపాట చెప్పారు పాడనా?" అని లలిత అరుణ పక్కలోచేరి పాట అందుకోబోతోంది. "ఇప్పుడు పాటవద్దు పిన్నీ నిన్న నువ్వు కథ చెబుతుంటే మధ్యలో నిద్రపోయాను ఆ తరవాత దమయంతి అడవిలో ఏంచేసిందో చెప్పూ?" అంటూ కృష్ణుడు ఇంకోపక్కన చేరి అరుణని చెప్పేదాకా వదలలేదు.

ఇంతలో దుర్గవచ్చి "ఒసేయ్ లలితా! పక్కవేశాను వచ్చి పడుకుంటావా లేదా? ఒరేయ్ కృష్ణా! రా వచ్చిపడుకో" అని కేకపెట్టింది "పిన్నిదగ్గర పడుకుంటాం అమ్మా" అని ఇద్దరూ ఒక్కసారిగా అన్నారు. "ఏమిటీ నేనేం మీకు విషంపెట్టానా? నా

పోవలంటే గిట్టకుండాపోతుందేం మీకు? పిన్నితోనే వుంది ప్రపంచమంతా. వచ్చి పడుకుంటారా లేదా?" అని ఒక్క గదమా యింపుతో పిల్లలిద్దరినీ రెక్కలు పుచ్చుకుని లాక్కుపోయింది. వాళ్లు కళ్ళనీళ్లు కుక్కుకుంటూ అరుణకేసి తిరిగి తిరిగి చూస్తూ తల్లి వెంట నడిచారు

ఈ దృశ్యం ఎంతసేపటికీ అరుణకి మరుపు రావటంలేదు కళ్ళు గుచ్చుకున్నా నిద్ర రావటం లేదు. గుండెల్లో ఏదో ఆవేదన భగ్గుమంటోంది. దుర్గ ఇదివరకు సూటిపోటి మాటలతో ఎన్నోసార్లు అన్నది. అరుణ పిల్లలని చెడగొడుతున్నది. వాళ్ళని అనవసరంగా గారాబపెట్టి చదువురాకుండా చేస్తున్నదని, వాళ్లని అయినదానికీ కానిదానికీ వెనకేసుకు వస్తున్నదని. ఇప్పుడు స్పష్టంగానే అన్నది. అరుణ తన పిల్లలకీ తనకీ మధ్య ఒక అవరోధాన్ని కల్పిస్తున్నదని తన పిల్లలని తనకి కాకుండా చేస్తున్నదని "అక్కా పిల్లలు నా దగ్గర పడుకుంటే తప్పా?" అని అరుణ అడగాలనుకున్నది. కాని నోటమాట రాలేదు. ఆ క్షణమే అరుణకి తోచింది, తాను ఆ ఇంటికి రావటమే గొప్ప తప్పిదమని. తన వంటి అభాగిని బతుకు అందరికీ భారమే. తను ఆ ఇంటికి రావటంవల్లనే ఇంత కలత. తనవల్లనే దుర్గ మనసులో ఇంత అశాంతి, ఇంత క్రోధమూ, ఇంత క్లేశమూ, ఇంత కార్పణ్యమూ తనే ఈఇంట్లో ఒకతుపాను. తానే ఈ ఇల్లాలిహృదయంలో భూకంపం వెంటనే ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోవాలని పించింది. కాని మనసు ఎదురు తిరిగింది. తనను అంత ఆపదలో ఇంటికి తీసుకువచ్చిన దుర్గకి చెప్పకుండావెళ్ళటం ఎల్లా? దుర్గకి తన కృతజ్ఞత తెల్పుకోవటం ఎల్లా? తనని ఎంతో గౌరవించి, తను ఉండటంవల్ల మును పెన్నడూ పొందని ఎరుగని మానసికమైన సౌఖ్యాన్ని సంతోషాన్ని పొందుతున్న రామారావుకి చెప్పకుండా వెళ్ళిపోవటం ఎల్లా? తన మనసులో గూడు కట్టుకున్న లలితకీ కృష్ణకీ చెప్పకుండా దొంగతనంగా చీకట్లో వెళ్ళిపోవటానికి మనసొప్పుతుంది?

రోజూమాదిరిగానే నిద్రపోయే టప్పుడు అరుణ భర్తని తలుచుకున్నది పగలంతా ఇంటిపనీ వంటపనీ చేసి అలసినా అరుణకి ఎంతకీ నిద్రరాలేదు. కలతనిద్రలో భర్త కన పడ్డట్లు అరుణకి ఆలాపన వచ్చింది. అతని రూపంలో ఏదో తీవ్రమైనబాధ కనబడింది అరుణ కారణమడిగింది "నిన్ను నిరాధారంగా వదిలి వచ్చినందుకు నాకు శాంతి చిక్కటంలేదు. నువ్వు ఎంత అలమటిస్తున్నావోనని అనుక్షణమూ నామనసు వేగిపోతోంది" అని భర్త అన్నట్లనిపించింది. "మా అక్క నాకు ఆశ్రయమిచ్చింది నేను సుఖంగా వున్నాను. నాకోసం మీరు దుఃఖపడకండి" అని అరుణ అన్నది.

అరుణకి తెలియకుండానే "మా అక్క నాకు ఆశ్రయ మిచ్చింది. నేను సుఖంగా వున్నాను, నాకోసం మీరు దుఃఖపడకండి" అని బిగ్గరగా కలవరించింది. అప్పటిదాకా ఏదో చదువుకుని అప్పుడే పడుకోటానికి వెళ్తున్న రామారావుకి ఈమాటలు వినబడినయ్. క్షణంసేపు అరుణకేసిచూశాడు అరుణ పక్కమీద అటూ ఇటూ కదులుతోంది అరుణని లేపి కలవరింత సంగతి చెప్పాలని పించింది. కాని దుర్గ ఇంకా మేల్కొనే వున్నట్లుంది. దీనికేమి రాద్ధాంతం చేస్తుందోనని రామారావు మెదలకుండా గదిలోకి వెళ్లాడు. అరుణ నిజంగా సుఖంగా వుందా? ఈ ఇంట్లో అరుణకి సుఖం ఎక్కడిది? తన మనసుని ఇంత కష్టపెడుతున్నా అక్క మీద ఎంత కృతజ్ఞత! ఆకలవరింతే దుర్గచెవిని పడితే ఆమె మనసు కరిగిపోయేదికాదా? గదిలో అడుగు పెట్టేసరికి దుర్గ అరచింది. "ఇప్పటికి ముగిసిందికాబోలు బ్రహ్మరాత? తెల్లవార్లూ రాసుకోకపోయారూ? ఏం చదువో దానికి అంతూపొంతూ లేదు" అరుణ కలవరింతనిగురించి దుర్గకి చెప్పాలనే సంకల్పం ఎగిరిపోయి రామారావుకి చికాకు

వచ్చింది. "నీ సాధింపులకి పగటిపొద్దు చాలటం లేదన్నమాట! నోరుమూసుకుని పడుకోలేకపోతే నేను ఇక ఈ గదిలో అడుగు పెట్టను." అన్నాడు కోపాన్ని దిగమింగుకుని దుర్గ వెక్కి వెక్కి కుమిలి కుమిలి ఏడుస్తూ రాత్రంతా మేల్కొనేవుంది కాస్సేపటికే రామారావు గురకకొట్టి నిద్రపోయాడు. ఆ రాత్రంతా దుర్గ మనసులో ఎన్నో భావాల సంఘర్షణ తన చిన్ననాటి స్నేహితురాలయిన అరుణ. తను ఆపదలో కాపాడి అండనిచ్చిన అరుణ తన కాపురానికే చిచ్చుపెడుతుందా? ఇదంతా తను అనవసరంగా పడుతున్న అసుమానమే కాకూడదా? తనతో మనసు కలవకపోయినా ఇంతవరకూ చెడుదారి తొక్కి యెరుగని తనభర్త ఇప్పుడు ఎందుకు చలిస్తాడు? ఇదంతా తన వెర్రిఊహ కాకూడదా? ఇదంతా తన కల్పన కాకూడదా? ఉహుం. కాదు కాదు. ఇదంతా వట్టి అపోహ కాదు ఎన్నటికీ కాదు. తన సుఖానికి తానే అవరోధాన్ని కల్గించుకున్నది. అరుణని తన ఇంటికి ఆహ్వానించటమే ఆమె సుఖానికి, ఆమె ఆనందానికి అరుణ తన ఇంట్లో అడుగు పెట్టినక్షణమే ఆమె కుటుంబ జీవనంలోని శాంతీ సౌఖ్యమూ దూరంగా పారిపోలేదా? అంతకుముందు మాత్రం తన జీవితంలో ఆనందమున్నదా? లేకపోవచ్చును, కాని అంతకుముందు దుర్గ సంసారంలో లేని అశాంతీ ఆందోళనా అరుణ అడుగు పెట్టటంతోనే వచ్చి ముసురుకున్నయ్. అవును ప్రాణసఖి అని ఇంటికి పిలిచిన అరుణ ఇప్పుడు పరమ శత్రువైపోయింది ఆ ఇంట్లో అరుణ ఉన్నంతకాలమూ తనకిక శాంతిలేదు అరుణ తన ఇంట్లో ఉన్నంతకాలమూ తనకీ పిల్లలకీ, తనకీ భర్తకీ మధ్య ఏదో దాటలేని అఖాతం దినదినమూ పెరుగుతూ వుంటుంది. ఏమయినాసరే అరుణమీద ఇక కరుణ చూపరాదు ఏమయినాసరే అరుణని కాని అరుణకిక శరణ్యమేముంది? ఆ ఏకాకికి ఈ లోకంలో దిక్కెవరు? ఆవిషయమంతా తనికిక పనిలేదు లేదు. ఏమైనా సరే

తెల్లవారగనే అరుణవచ్చి "నాకు శలవిప్పించు నేను వెళ్ళిపోతాను నీ మేలు ఎన్నటికీ మరిచిపోలేను" అన్నది. "వెళ్ళద్దు పిన్నీ వెళ్ళద్దు వెళ్తే మేంకూడా వస్తాం" అని పిల్లలిద్దరూ అరుణని చుట్టివేసుకుని విడవలేదు కాఫీ తాగుతూన్న రామారావు అరుణకేసి చూశాడు. వెళ్తావా? ఎక్కడికి? వద్దు. వద్దు అన్న విన్నపం ఆ చూపులో అరుణ గ్రహించింది ఎంతోసేపు మాట్లాడకుండా వూరుకుంది కాని ఆపుకోలేకపోయింది. అప్రయత్నంగా దుర్గ అనేసింది "ఎక్కడికి వెళ్తావే చెల్లీ? మమ్మల్ని వదిలి వెళ్ళటానికి వీల్లేదు కష్టమో నిష్ఠురమో ఇక్కడే వుండవే అరుణా" అంది. ఈ మాటలు అంటున్న క్షణంలో దుర్గ కళ్లు తడవటం అరుణ గమనించకపోలేదు ఆక్షణంసేపూ దుర్గ మనసులోని సంఘర్షణ సమసిపోయింది కాబోలు. ఆక్షణంలో ఆమె మనసులో అరుణమీద అపారమైన కరుణ వెల్లివిరిసింది కాబోలు. అటువంటి క్షణాలలోనే మనిషిలో దాగిన ఆర్ద్రహృదయం తర్కంతోనూ ఘర్షణతోనూ నిండినబుద్ధిని జయించగలుగుతుంది. అప్రయత్నంగా దుర్గనోటినుంచి వెలువడిన ఈ మాటలు విని రామారావు చకితుడైపోయాడు మానవ ప్రకృతిలోని అర్థంకాని విచిత్రమైన మాధుర్యాన్ని కనుగొని చకితుడైనాడు. కరుణ, కర్కశ మానవహృదయంలో దాగిన మధుర మకరందం కాదా?

5

మనసులో బుసలుకొట్టే క్రూరసర్పం కొంచెంసేపు పడగ ముడుచుకోవచ్చును. అగపడని పుట్టలలో దాగవచ్చును. కాని అది అంతటితో అంతరించదు. ఎప్పుడో అది మళ్ళీ పడగవిప్పి బుసలు కొడుతూ విషం కక్కితీరుతుంది. ఎప్పుడో అది మళ్ళీ విజృంభించి కాటు వేయటంకోసం కాసుకుని వుంటుంది.

దుర్గ ఆనాడు వద్దని వారించింది. కాని ఆ తరవాత అరుణ మనసుని తన మాటలతో ఎంతగాయపరచిందో చెప్పతరంకాదు. ఆ ఇల్లు అరుణప్రాణానికి అంపశయ్యగా తోచ సాగింది ఈ యాతననుంచి ఎప్పుడు తప్పు కుని బైట పడతానా అని అరుణ ఆత్మ తప తపలాడింది ఆనాడు తనని వెళ్లవద్దని బతి మాలిన దుర్గ అనుక్షణమూ అరుణ మనసులో వెళ్ళిపోవాలనే ఊహను బలపడేట్లు ప్రవర్తిం చసాగింది.

దుర్గ నాలుకకు వెరచి ఎవరూ ఇంటికి వచ్చేవారుకారు తనూ ఒకరింటికి పోయేది కాదు మొదట్లో రామారావు స్నేహితులు కొందరు వచ్చేవారు కాని వారిముందు కూడా దుర్గ నాలుక విరామంలేకుండా విజృంభించేది ఒక్కొకప్పుడు ఆమె దాడి రామారావుని దాటి అతని స్నేహితులమీదికి వెళ్లేది. వారందరూ అతన్ని చెడగొడుతున్నా రని ఆమె భయం. ఈ అభిప్రాయం వెల్లడిం చినాక ఒక్క స్నేహితుడుకూడా గుమ్మం తొక్కలేదు. తన పిల్లల్ని కూడా ఇల్లు కదల నిచ్చేదికాదు. పొరుగుపిల్లలతో కలిసి ఆడుకో నిచ్చేదికాదు

అరుణ స్వభావం దీనికి పూర్తిగా వ్యతి రేకం, ఆమె అందరితోనూ కలుపుగోలుగా వుండేది అందరిళ్ళకీ వెళ్తూవుండేది. కాని ఇది దుర్గకి చాలా కంటకంగా వుండేది. తనని గురించి అరుణ అందరితోనూ ఏదో చెబు తున్నదనీ, తననిగురించి దుష్ప్రచారం చేస్తు న్నదనీ దుర్గకి అనుమానం. మనసులోని అభి ప్రాయాన్ని దాచుకోకపోవటం దుర్గకున్న గొప్పగుణం. అది తెలుసుకున్న తరవాత అరుణ ఇల్లు కదలటం మానివేసింది.

అస్తమానం ఇంట్లోనే. అనుక్షణమూ సల సలకాగే చమురులో వేగిపోతున్నట్లు, అన్ని వైపులనుంచీ శరపరంపరలు దూసుకువచ్చి మనసుని తీవ్రంగా గాయపరుస్తున్నట్లు. . క్షణమొక యుగంగా వుంది అరుణకి. ఇక ఈ యమయాతనలో తానెందుకుండాలి? తన కీ ప్రపంచంలో శాంతి దొరికే తావులేదా? ఎవరితోనూ చెప్పకుండా అర్ధరాత్రివేళ లేచి వెళ్ళిపోదామనుకుంది. వాకిలిదాకా వెళ్ళింది. ఇంకా చదువుకుంటూనే వున్నాడు రామా రావు. దీపపు వెలుతురులో అరుణ దొంగ లాగా దొరికిపోయింది.

"అరుణా ఎక్కడికి? ఆగు" అని గబగబా వాకిట్లోకి వెళ్లాడు. "ఇకెప్పుడూ దొంగతనం చెయ్యనని ఒట్టువెయ్యి అరుణా" అని అడి గాడు రామారావు. "బావా నీకు పుణ్య ముంటుంది. నన్ను వెళ్లిపోనీ. నేను వెళ్తేగాని అక్కకి శాంతి వుండదు. నేను వెళ్ళిపోతేగాని అక్క మనసు కుదుటపడదు"

"పొరబడుతున్నావు అరుణా! నువ్వు వెళ్ళిపోయినంత మాత్రాన మీఅక్కకి శాంతి దొరుకుతుందనుకున్నావా?"

"ఏం? దొరకదూ?"

"ఊఁహుఁ. దొరకదు. నేనున్నంతకాలమూ దానికి శాంతి దొరకదు నేనూ అదే ఆలో చిస్తున్నాను ఎక్కడికి పారిపోనా? అని కాని పిల్లల్నిచూసి వెనకడుగు వేస్తున్నాను. పద ఇంట్లోకి పద, చెప్పకుండా వెళ్ళనని ఒట్టు పెట్టుకోవూ? అరుణా! నువ్వుకూడా వెళ్లిపోతే ఇక ఈ ఇంటికీ యమలోకానికీ తేడా యేముంది?"

అరుణ తల వంచుకుని అతనివెంట ఇంట్లోకి తిరిగివచ్చింది తన మనసు ఎంత క్షోభపడినా సరే లలితకోసమూ, కృష్ణకోసమూ, బావ గారి కోసమూ కొంతకాలంపాటు ఆ ఇంట్లో ఉండాలని మనసు గట్టిపరుచుకుంది. తనుఎంత కష్టపడినాసరే, తను కొందరికి సుఖాన్నివ్వ గలుగుతున్నాననే తలంపు అరుణని ఎంతో ఓదార్చింది ఈ తలంపే ఆమె బాధని మరి పించింది

6

ఎన్నిచోట్ల వెదికినా లలితకి సంబంధం దొరకటంలేదు. దుర్గ మనసులో ఎంతో దిగులు పడుతోంది ఈ విషయంలో రామారావుకి చీమ కుట్టినంతైనా బాధలేదు బాని ఘడియ వస్తే అదే జరుగుతుంది, అంటాడు. సంబంధం వెదకటానికి తాను గడప కదలి వెళ్ళడు. దుర్గ ఒక్కతే తంటాలుపడితే మాత్రం ఏం లాభం? చివరికి ఒక పెళ్ళివారు మాత్రం వచ్చి పిల్లని చూసుకుంటామన్నారు. దుర్గ లలితని ముస్తాబు చేసింది అరుణ ఫలహారాలు తయారుచేసింది. ఇంట్లో ఇంత సందడి జరుగుతున్నా రామారావుమాత్రం భగవద్గీతకి శంకరాచార్యులవారి భాష్యంచదువుకుంటూ గదిలో కూచున్నాడు పెళ్లికొడుకు పిల్లని చూశాడు పెళ్లిపెద్దలు ఇంటికివెళ్లి ఉత్తరం వ్రాస్తామన్నారు.

ఎన్నాళ్లకీ వాళ్ళదగ్గరనుంచి ఉత్తరం లేదు. పోతూపోతూ వాళ్లు ఊళ్లో ఎవరితోనో అని వెళ్లినమాటలు ఆనోటా ఆనోటాపడి దుర్గదాకా వచ్చినయ్. ఆమె గయ్యాళిదట ఆమెకీ భర్తకీ సఖ్యతలేదట అందువల్ల లలితని చేసుకోవటం వాళ్ళకి ఇష్టంలేదట

ఇది విన్న దగ్గరనుంచీ దుర్గ భగ్గున మండిపోతోంది. అంతా తనవల్లనే తనే అందరికీ లోకువ పెళ్ళిచూపులు జరిగే సమాయాన కూడా, ఆయన గది వదిలి రాకపోవటం బాగుంది. అంతా తనవల్లనే. అన్నిటికీ తనే కారణం తన పిల్ల సుఖానికి్కూడా తనే అడ్డుపడుతోందిట తను భర్తతో సఖ్యతగా వుండనన్నదా? తన సాయశక్తులా ప్రయత్నించలేదా? ఆయన స్వభావం మారకపోతే తానేం చేయాలి? ఆయన ధోరణి మారకపోయిన తరవాత తను ఎంతమారితేమాత్రం ఏం లాభం? తనూ ఆయనా బతికుండగా లలితకి పెళ్లి కాదేమో? తానేంచేయాలి? తనదేం తప్పుంది? తనకేది తోవ? కూతురి సుఖానికీ, శాంతికీ, తాను అడ్డు తగులుతూ బతకటం యెందుకు? తను బతికుండటం ఎవరికి సుఖంగావుంది? తనకా లేదు, భర్తకీలేదు, పిల్లలకీ లేదు. ఇకతను బతకటం దేనికి? తను బతికి ప్రయోజనమేముంది? దుర్గ పెద్ద సుడిగుండంలో పడి గిరగిర తిరిగిపోతోంది. ఆ ఊహలు పాతాళానికి గుంజుకుపోతున్నయ్. వాటి పట్టునుంచి దుర్గ తప్పించుకోలేక పోతోంది. అరుణని పిలిచి తన వేదనని చెప్పుకోవాలనిపించింది. కాని తాను పరమశత్రువుగా పరిగణిస్తున్న అరుణముందు మనసు విప్పుకోటానికి సిగ్గువేసింది అరుణని పిలవాలని రెండు మూడు సార్లు ప్రయత్నించింది కాని గొంతు పెగిలి రాలేదు

రాత్రి ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. తెల్లవారేసరికి ఊరంతా వచ్చి దుర్గగదిని చుట్టేశారు. ఎవరికి తోచినమాట వారంటున్నారు అరుణ వంటలో ఏదో మందు కలిపిందని అందరూ తీర్మానించారు. దుర్గకి ఇంకా స్పృహ పోలేదు ఎవరికితోచిన విరుగుడు వారు పోసి విషాన్ని కక్కిస్తున్నారు. రాతిబొమ్మలాగా నిలబడిన రామారావు దగ్గర చేరి లలితా కృష్ణుడూ గొల్లున గోల పెడుతున్నారు అన్నీ వింటూ అగ్నిజ్వాలల్లో దగ్ధమైపోతూ అరుణ మౌనంగా నిలబడింది ఒక్కొక్క క్షణమూ ఒక్కొక్క బ్రహ్మకల్పంలాగా వుంది. ఆమె మనసు ఎంత అవమానంతో ఎంత క్షోభతో, ఎంత వేదనతో ముగ్గిపోతున్నదో, ఎవరికి తెలుసు? అరుణ ఆత్మమరణం కోసం ఎంత పరితపిస్తున్నదో ఎవరు చెప్పగలరు?

దుర్గకి బాగా తెలివివచ్చింది విషమంతా కక్కివేసింది పిల్లలిద్దరూ తల్లిమీద పడి ఏడుస్తున్నారు భర్త తలదగ్గర మౌనంగా నిలబడ్డాడు. అరుణ అక్కగారి పాదాలని చుట్టుకుని జీవంలేని శవంలాగా పడివుంది. ఇదంతా దుర్గకి ఏదో కల వచ్చినట్లుంది "అరుణా ఏమిటే ఇదంతా? వీరందరూ ఎందుకు వచ్చారే?" అంది దుర్గ అరుణ మాటలకి లోపలి

నుంచి పొంగుకొస్తున్న దుఃఖం అడ్డుపడింది ఏమీ మాట్లాడలేక పోయింది రామారావు పిడుగు దెబ్బ తిన్నవాడిలాగా మూగగా నిల బడిపోయాడు. వచ్చిన జనం ఒక్కొక్కరూ చల్లగా జారుకున్నారు అందరూ అరుణకేసి క్రూరంగా చూశారు ఆ చూపులలో వున్న అవహేళ అరుణని గజగజ వణికించింది ఆ చూపులలోవున్న కాఠిన్యమూ, అనుమానమూ అరుణని దహించివేసినయ్ అక్కడ నిలబడలేకపోయింది. అక్కడనుంచి కదలటానికి అడుగు ముందుకి పడదు. అప్పుడు అరుణ అనుభవించిన యాతన నరకంలో పాపికికూడా తెలియదేమో

కట్టుబట్టతో అరుణ బయలుదేరింది లలితా, కృష్ణా కాళ్ళకి చుట్టుకుని వదలకపోయినా ఆగలేదు రామారావు ఆగమన్నా వినలేదు. దుర్గ వచ్చి వేడుకున్నా వెనక్కి తిరగలేదు.

"నన్ను వెళ్ళిపోనివ్వండి. నాకోసం విచారపడకండి"

"ఎక్కడికి వెళ్తావే అరుణా?"

"ఏమో ఎక్కడికో"

"నా మాట వినవా అరుణా"

"నన్ను వెళ్ళిపోనివ్వవే అక్కా నన్ను ఆపబోకు, నావంటి అభాగ్యులకి ఇళ్ళలో చోటులేదు. నన్ను వెళ్ళిపోనీ"

"ఎల్లా బతుకుతావే అరుణా? రా, మా తల్లిగదూ. నా తప్పులన్నీ మన్నించు. రా"

"రాను అక్కా రాను. నీమేలు ఎన్నటికీ మరిచిపోను. నన్ను వెళ్లిపోనీ"

"మళ్ళీ ఎప్పుడొస్తావు పిన్నీ?"అని కృష్ణుడు ఏడుస్తూ అడిగాడు "ఏమో నాయనా, తెలియదు" అంటూ అరుణ గబగబ అడుగులు వేసింది కనుచూపుమేర దాటిపోయేవరకూ అందరూ అరుణకేసి కన్నీళ్ళతో చూస్తూ నిలబడ్డారు.

అరుణ వెనక్కి తిరిగి చూడలేదు ఎక్కడికి వెళ్లాలో తెలియదు, ఆమెకి గమ్యం లేదు. బాటలో ఎందుకు సాగాలో, ఎక్కడిదాకా నడవాలో అంతకంటె తెలియదు ఆమె పెదవులమీద మాత్రం ఒక్కటే ప్రార్థన "ప్రభూ! ఈఅభాగిని బతుకుకి తుది యేది?"

అరుణజీవితంలో మరొక రంగంమీద తెర వాలింది ఆమె భావిలో ఏపాత్రను ధరించబోతున్నదో జగన్నాటక సూత్రధారికే తెలుసు! ఆమె జీవనవీణ మరొక మధురగీతం వినిపిస్తుందో, అగాధమైన మౌనంలో గాఢనిద్ర పోతుందో, అరుణకీ తెలియదు ఎవరికీ తెలియదు ఆమెది దూరం తెలియనిబాట. గమ్యం తెలియని పయనం!

శాతవాహన సప్తశతి

శ్రీ వాసిరెడ్డి వెంకటసుబ్బయ్య

౨

కాఱు చిచ్చుఁబొగలఁ గటివాఱు వింధ్య శృం
గములు గాని గ్రీష్మ కాలమందుఁ
గావు ప్రోషితపతికా! యివి తొలకరి
కారు మబ్బు లింక నూఱడిలుము.

ఎంత ప్రేమ నిలుప నీవు భరింతువో
యంత నా కొసంగు మంతె చాలు
సకల జనులు వలపు సన్నగిల్లిన నాఁటి
యాపదను భరింప నోపలేరు.

వాఁడు కంటి ఱెప్ప వాల్పక నా యంగ
కముల దేని దేనిఁ గాంచు దాని
దాని దాచుకొందుఁ గాని సిగ్గున, వాఁడు
చూడవలయు ననియె చూతు నేను.

ఎంత రోష మెడఁద నేర్చినఁ బ్రియు చెడ్డ
పనుల నెంత బిగ్గఁ బట్టుకొన్నఁ
జూడు జాఱు చుండె సురసురఁ బిడికిటి
లోని యిసుక పోలె దాని కినుక.

గగన రంగ లక్ష్మి కంఠ మధ్యము నుండి
పద్మరాగములును బచ్చలుఁ గల
కంఠె పోలె నదిగొ మింటి నుండియు డిగ్గు
చుండె రామచిలుక దండు చూడు.

ఊక నిప్పు పల్లెటూరిలోఁ గాష్ఠాగ్ని
కాన యందుఁ బథికుఁ గాచు చుండు
ననుచు వైరమూని యతనిఁ బట్టణవాసి
నేడిపించు చున్న దీద గాడ్పు.

ఆలు మోహనాంగి యయ్యు నీకై సగ
మైన హాలికుఁ జూచి యతని గృహిణి
మనసులోన నెంత మచ్చర మున్న నం
గీకరించె దూత కృత్యమునకు.

ఊరి దేవళమున నాఱిపోయిన నిప్పు
రాఁజఁ జేయ గడ్డిరాశిఁ జీల్చి
కదుపుచుండె ఖల్లుకమువోలెఁ జలినాఁటి
యుదయ మందుఁ బథికుఁ డదిగో! చూడు!

కలభ కులము వోలెఁ దొలకరి మబ్బులు
బలసి యున్న వింధ్య పర్వతమ్ముఁ
గోయదొరలు కొండ కొమ్ము లందున నిండు
లూది నిలిచి చూచుచున్న వారు.

చుట్ట లెల్ల మడిసి శోకించు మనసుతో
సుడివడయును వలచి చూచె బంది
చోరుఁడగు యువం బ్రవీరుం డనుచు గుణ
గ్రహణమం దసూయ కలదె చెపుమ.

రూప యౌవనముల యేపుచేఁ గొన్నాళ్ల
నుండి యిపుడు చెక్కు లొలువఁ బడిన
వింటి తోలు మిషను స్వీయ సౌభాగ్యంబు
వీథు లందుఁ జల్లు వ్యాధ వధువు.

చెంచుకాంత యింటి పంచనుండి ధనుస్సు
చెక్కులొలువఁ దొఱగు చిదురు పంక్తి
చూడు మెగురుచుండె సురగాలిచే మింట
దాని సుభగతా పతాకవోలె.

గంధకరుల గండ ఘర్షణవమధు క
శ్మలము లగు తమాల శాఖ లరసి
ధవుని మృతి గ్రహించెఁ దనయంతఁ దానె పు
ట్టింటి నుండి వచ్చు నెఱుకు సాని.

నీవు దాని వలతు నిన్ను నే వలతును
దాని కీవు గిట్ట వేను నీకు
నచ్చ నిల్లె ప్రేమ నానా వికార నా
పలుకు నది నిజంబు బాలకుండ!

చెలులు ధూర్త లతని వలపు లే మాత్రము
నెడయికను సహింప వేను సిగ్గు
పాటు దాన నాదు పదములఁ కీ లక్క
వన్నె పూతలేల వలదు పోవె

ఎడమకన్న! యదిరె దిపుడాతఁ డిట కేఁగు
దెంచె నేనిఁ దృష్టి తీఱ నతనిఁ
జూతుఁ జాలసేపు నీ తోడనే కుడి
కన్ను మూసి యిదియె కాన్క నీకు.

క్రొత్త క్రొత్తలైన కుసుమంబుల రసమ్ముఁ
గ్రోల మధుకరుండు కోరు ననెడి
దోసఁగు రసములేని కుసుమంబు లదె కాని
దోషి యగు నొకో మధువ్రతుండు?

అలవియైన దాఁకఁ బలవించె నెమ్మేను
జేతనైన వఱకుఁ జిక్కి పోయె
నూపిరాడు నంతసేపు నెల్లెట్లో ని
ట్టూర్పు లీ వరాకి యూర్చెఁ గదర.

మొదటి పూవు గుత్తి కుమరిడి ప్రస్థాన
కలశమందు నేను నిలిపినట్టి
తేఁతమూవి చివరె యాతని పయనంబుఁ
బరిహరించు దుఃఖపడకు! బిడ్డ!.

పట్టి పట్టినట్లు పఱచి నా యంతరం
గము సమూలముగఁ బెకల్చి వైచె
రక్తిలేని నీ తిరస్కారపున్ నయ
నార్థ దృష్టు లోరి హతవిభుండ!.

భాను మండలమునఁ బ్రతిబింబితం బగు
మచ్చలేని చందమామ వోలెఁ
గమల ముఖము వేని కౌస్తుభమ్మునఁ దోఁచు
చుండు నతని మ్రొక్కుకొందు మీరు.

ప్రాణపతి గతించి బావురుమని తోఁచు
నిల్లు చూడఁ బొడము నెడరు నడఁపఁ
బామరుండు పనియుఁ బాటు లేకున్నను
పొలము విడిచి యింటి మొగమె యిడఁడు.

ఏచి వీచు గాలి కింటి కప్పెగిరి క్రం
తలను గురియు వానఁ దడియు ననుచు
గోడ మీఁది గడువు గుఱుతుఁ గే లొడ్డి ర
క్షించు చున్న దదిగొ గేస్తురాలు.

గంధకరుల కుంభగతములౌ ముత్యాల
సరులు దాల్చు సవతి జనము మధ్యఁ
బొగరు దొలుక నెమ్మిపురి మౌళి సొమ్ముగాఁ
జేసి తిరుగుఁ జెంచుఁ జిపురుఁబోఁడి.

ఏను గానుదూతి నీవుఁ గావు ప్రియుండ
విచట మనకుఁ గల పనేమి గాని
నింద నీకు వచ్చు నే దాని చావుచే
ననుచు నేను ధర్మ మాడు చుంటి.

నీ మొగాన దాని నెమ్మోము నుండి నా
కాలి మీఁద నీ మొగంబు నుండి
చేర్చెఁ దిలక మిన్ని చేతులఁ జెయి మార్చి
గరిడి సాము లెల్ల నెఱపి నట్లు.

వేయిమంది స్త్రీలు విడిచిన నీ యెదఁ
సుభగుఁడా! వసింపఁ జోటు గనక
వనిత నిత్య మొందు పనిమాని మే నెంత
సన్ననైన మఱియు సన్నవఱచు.

కాతన్త్రవ్యాకరణం

[లఘువృత్తి సహితం]

శతావధానులు, శ్రీ శ్రీనివాస సోదరులు

౨

ప్రథమాధ్యాయము - చతుర్థ పాదము

౧ వర్గప్రథమాః పదాన్తాః స్వరఘోషవత్సు తృతీయాన్.

స్వరాలూ ఘోషవత్తులూ పరమైనప్పుడు పదాన్తమందున్న వర్గప్రథమ వర్ణాలు వర్గతృతీయవర్ణాలుగా మారుతాయి అంటే ఆయా వర్గప్రథమ వర్ణాలైదింటికీ వరుసగా ఆయా వర్గతృతీయ వర్ణాలు వస్తాయన్న మాట వాక్ + ఏషా + వాగేషా వాక్ + వరః- వాగ్వరః సిచ్ + ఆదయః- సిజాదయః ఇచ్ + వత్- ఇజ్వత్. షట్ + అత్ర- షడత్ర షట్ + గచ్ఛన్తి. షగ్గచ్ఛన్తి తత్ + ఏతత్- తదేతత్. ఏతత్ + భాషణమ్- ఏతద్భాషణమ్ అప్ + అంశః- అబంశః అప్ + జః- అబ్జః

ఇక్కడ ఒక విషయం గ్రహించాలి అంతస్థలూ అనునాసికాలూ కాక మిగిలిన వ్యంజనాలతో అంతమయ్యే సంస్కృత శబ్దాలన్నింటికీ పదాన్తంలో 'క, ట, త, ప' లలో ఏదో ఒకటి మాత్రమే నిలుస్తుంది ఇందుకు వికల్పంగా 'గ, డ, ద, బ' లు కూడా రావచ్చు వ్యాకరణ పరిభాషకు సంబంధించిన సిచ్, ఇచ్ (ఇతర వ్యాకరణాల్లో అచ్, ఏచ్) మొదలయిన కొన్ని పదాలకు తప్ప పదాన్తంలో చకార జకారాలుండవు 'చ, జ' లు అంతమందుండే శబ్దాలకున్నా పదాన్తంలో కకార గకారాలే నిలుస్తాయి జలముచ్' శబ్దం 'జలముక్' జలముగ్' అవుతుంది భిషజ్ 'బిషక్, భిషగ్ అవుతుంది

౨ పంచమే పంచమాం స్తృతీయాన్ నవా

వర్గ పంచమాలు పరమైనప్పుడు వర్గ ప్రథమాలు పంచమాలుగా గాని తృతీయాలుగాగాని మారుతాయి, ఏవర్గ ప్రథమాక్షరానికి ఆ వర్గ పంచమాక్షరం వస్తుందని గ్రహించాలి వాక్ + మనసీ- వాఙ్మనసీ, వాగ్మనసీ షట్ + ముఖాని- షణ్ముఖాని షడ్ముఖాని, తత్ + నాస్తి- తన్నాస్తి, తద్నాస్తి త్రిష్టుప్ + మినోతి- త్రిష్టుమ్మినోతి; త్రిష్టుబ్మినోతి

౩ వర్గప్రథమేభ్యః శకారః స్వరయవరపరశ్ఛకారమాపద్యతే నవా

వర్గ ప్రథమాలకు పరమందు శకారముండి అది స్వరాలతోగానీ, య- వ- ర వర్ణాలతోగానీ కలిసివుంటే ఆ శకారం ఛకారంగా మారటమూ మారకపోవటమూ జరుగుతుంది వాక్ + శరః- వాక్ఛరః, వాక్శరః షట్ + శ్యాలకాః- షట్ఛ్యాలకాః, షట్శ్యాలకాః. తత్ + శిరః- తచ్ఛిరః (ఇక్కడ శకారం ఛకారంగా మారినందున ఛకారానికి ముందున్న తకారం ముందు చెప్పబోయే ౫వ సూత్రం వల్ల ఛకారంగామారుతుంది ఆఛకారంముందు చెప్పబోయే 'అఘోషేప్రథమః' ౨-౩-౬౧ సూత్రం ప్రకారం అఘోషమైన ఛకారం పరమైనందువల్ల, వర్గప్రథమమైన చకారంగా మారుతుంది), తచ్శిరః (ఇక్కడ ముందు చెప్పబోయే ౫వ సూత్రం ప్రకారం తకారానికి బదులు చకారం వచ్చింది) అనుష్టుప్ + శ్రుతా- అనుష్టుప్ఛ్రితా అనుష్టుప్శ్రితా

౪ తేభ్య ఏవహకారః పూర్వచతుర్థం నవా.

వర్గ ప్రథమాలకు పరమందున్న హకారం దాని ముందున్న వర్గాక్షరానికి సంబంధించిన చతుర్థాక్షరంగా మారటమూ మారకపోవటమూ కద్దు వాక్ + హతః వాగ్ఘతః, వాగ్హతః (చూ సూ ౧) అచ్ + హలౌ- అజ్ఝలౌ అజ్హలౌ షట్ + హలాని- షడ్ఢలాని, షడ్హలాని శాస్త్రకృత్ + హసతి- శాస్త్రకృద్ధసతి, శాస్త్రకృద్హసతి కకుప్ + హాసః- కకుబ్భాసః, కకుబ్హాసః

౫. పరరూపం తకారో ల చ-ట వర్గేషు

లకారమూ చవర్గమూ టవర్గమూ పరమైనప్పుడు పదాన్తంలోవున్న తకారం పరరూపం పొందుతుంది పరమందున్న వర్ణమే ఇంకొకటి తకారానికి బదులు వస్తుందన్నమాట తత్ + లునాతి- తల్లునాతి తత్ + చరిత్రమ్- తచ్చరిత్రమ్ తత్ + ఛాదయతి- తచ్ఛాదయతి (ఇక్కడ తకారానికి బదులు పరరూపమైన ఛకారం వచ్చి అఘోషమైన ఛకారానికి ముందుండడం చేత ౨-౩-౬౭ సూత్రం ప్రకారం వర్గప్రథమమైన చకారంగా మారింది) భయవత్ + జీవితమ్- భయవజ్జీవితమ్ తత్ + ఝుడితి- తజ్ఝుడితి (ఇక్కడ పరరూపమైన ఝుకారం వచ్చి "ధుటాం తృతీయశ్చతుర్థేషు (౨- -౬౧) అనే సూత్రం ప్రకారం దాని తరువాత చతుర్థాక్షరమైన ఝుకారం వుండడంచేత తృతీయాక్షరమైన జకారంగా మారింది) తత్ + ఇ

కారేణ- తఞ్ఙకారేణ తత్ + టీకా- తట్టీకా. తత్ + ఠక్కురేణ- తట్ఠక్కురేణ సుకృత్ + డింభః- సుకృడ్డింభః తత్ + ఢౌకతే తడ్ఢౌకతే తత్ + ణకారేణ- తణ్ణకారేణ

౬. చం శే

శకారం పరమైనప్పుడు పదాన్తంలోవున్న తకారం చకారంగా మారుతుంది. 3వ సూత్రం ప్రకారం తకారం తరువాత శకారం ఛకారంగా మారటమూ మారకపోవటమూ కద్దుగదా! ఛకారంగా మారనప్పుడు ఈ సూత్రం ప్రకారం శకారం ముందున్న తకారం చకారంగా మారుతుంది తత్ + శిరః, తచ్ శిరః అనేరూపం సిద్ధిస్తుంది శకారం ఛకారంగా మారినప్పుడైతే తచ్ఛిరః అనేరూపం వస్తుందిగదా!

౭ ఙణనా హ్రస్వోపధాః స్వరే ద్విః

ఙ, ణ, నల్లో అకారం ఉచ్చారణసౌకర్యంకోసం ఉపధఅంటే అన్త్యమైన వర్ణానికి వెనుకనేవున్న వర్ణం రాజనే శబ్దంలో చివరి నకారానికి అకారం ఉపధ, మనస్ శబ్దంలో సకారానికి అకారం ఉపధ ఇలానే అంతటా గ్రహించాలి హ్రస్వస్వరం వెనువెంటనే పదాన్తంలో వుండే ఙకార ణకార నకారాలకు స్వరం పరమైనప్పుడు ద్విత్వం వస్తుంది అంటే ఙ్, ణ్, న్, ల తరువాత మళ్ళీ ఙ్, ణ్, న్ అనే వర్ణాలు కలుస్తాయి కుఙ్ + ఆస్తే- కుఙ్ఙాస్తే సుగణ్ + ఏహి- సుగణ్ణేహి రాజన్ + ఆస్యతామ్- రాజన్నాస్యతామ్. హ్రస్వోపధములైన ఙణనలకే అని చెప్పడం చేత ప్రాఙ్ + అత్ర-ప్రాఙత్ర భవానే + ఆయాతు- భవానాయాతు

౮. నోఽన్త ఛయోః శకార మను స్వార పూర్వమ్

చఛలలో అకారం ఉచ్చారణ సౌకర్యంకోసం చకార ఛకారాలు పరమైనప్పుడు పదాన్తంలోవున్న నకారానికి బదులు అనుస్వారపూర్వకమైన శకారం వస్తుంది పరన్ + చరతి- పరంశ్చరతి భవాన్ + ఛాదయతి- భవాంశ్ఛాదయతి

౯ టఠయోః షకారమ్

ట ఠ లలో అకారం ఉచ్చారణ సౌకర్యంకోసం టకార ఠకారాలు పరమైనప్పుడు పదాన్తంలోవున్న నకారానికి బదులు అనుస్వార పూర్వకమైన షకారం వస్తుంది భవాన్ + టీకతే- భవాంష్టీకతే భవాన్ + ఠక్కురః- భవాంష్ఠక్కురః

౧౦. తథయోః సకారమ్

త థలలో అకారం ఉచ్చారణ సౌకర్యంకోసం. తకార థకారాలు పరమైనప్పుడు పదాన్తంలోవున్న నకారానికి బదులు అనుస్వారపూర్వకమైన సకారం వస్తుంది తరన్ + తారయతి- తరంస్తారయితి. గచ్ఛన్ + థుడతి- గచ్ఛంస్థుడతి

౧౧. లేలమ్

లకారం పరమైనప్పుడు పదాన్తమైన నకారం లవర్ణంగా మారుతుంది లకార మనకపోవడం వల్ల ఇక్కడ అను నాసికమైన లవర్ణం గ్రహించాలి. రాజన్ + లిఖ- రాజల్లిఖ,

౧౨. జ,ఝ,ఞ శకారేషు ఞకారమ్

జ, ఝ, ఞ శలలో అకారం ఉచ్చారణ సౌకర్యాంకోసం జ ఝ, ఞ, శకారాలు పరమైనప్పుడు నకారం ఞ కారంగా మారుతుంది. శార్ఙిన్ + జయ- శార్ఙిఞ్జయ గచ్ఛన్ + ఝంకరోతి- గచ్ఛఞ్ఝంకరోతి, వదన్ + ఞకారమ్- వదఞ్ఞకారమ్ చరన్ + ఞూరః చరఞ్ఞూరః.

౧౩. శిన్చ్వా

శకారం పరమైనప్పుడు పదాన్తంలో నకారంతో పాటు చకారంకూడా వుండవచ్చు వుండకపోవచ్చు గూడా కుర్వన్ + శపతి- కుర్వఞ్చ్శపతి (ఇక్కడ శకారానికి ముందు పదాన్తమైన నకారం ఞ కారంగా మారి దానితోపాటు ఈ సూత్రం ప్రకారం చకారం చేరింది) కుర్వఞ్ఛపతి (చకారం తరువాత శకారం ఛకారంగా మారింది చూ పై ౬వ సూ) కుర్వఞ్శూరః (చూ పై సూ ౧౨)

౧౪ డఢణ పరస్తు ణకారం.

డ ఢ ణ లలో అకారం ఉచ్చారణ సౌకర్యం కోసం డ ఢ ణ లు పరమైనపుడు పదాన్తంలోని నకారం ణకారంగా మారుతుంది గుంజన్ + డయతే- గుంజణ్డయతే చక్రిన్ + ఢౌకసే- చక్రిణ్ఢౌకసే- ఉచ్చరన్ + ణకారమ్- ఉచ్చరణ్ణకారమ్

౧౫. మోఽనుస్వారం వ్యజనే.

వ్యంజనం పరమైనప్పుడు పదాన్తంలో వున్న మకారం అనుస్వారంగా మారుతుంది కిమ్ + కరోషి కింకరోషి- కథమ్ + యాతి- కథంయాతి మరి స్వరంపరమైనప్పుడైతే మార్చరాదు కిమ్ + అత్ర- కిమత్ర పదాన్తంలోవున్న మకార మనడంచేత పద మధ్యంలో ఈ మార్పురాదు గమ్ + యతే- గమ్యతే

౧౬. వర్గే తద్వర్గ ఞ్చమంవా.

వర్గాక్షరం పరమైనప్పుడు పదాన్తంలోని అనుస్వారం ఆయావర్గానికి చెందిన అనునాసికంగా మారవచ్చు: మారకపోనూవచ్చు. కిం+కరోషి-కిఙ్కరోషి; కింకరోషి కథం+చరసి-కథఞ్చరసి, కథంచరసి కథం+టలసి- కథణ్టలసి; కథంటలసి యూయం+తరత-యూయన్తరత; యూయంతరత పారం+పర- పారమ్పర- పారంపర.

ఇతి కాతన్త్రవ్యాకరణే ప్రథమస్యాధ్యాయస్యచతుర్థః పాదః

ఇది శ్రీ శ్రీనివాస సోదరకృత లఘువృత్తి సహితమైన కాతన్త్రి వ్యాకరణంలో ప్రథమాధ్యాయంలో చతుర్థ పాదము

ప్రథమాధ్యాయము - పంచమ పాదము

౧. విసర్జనీయ శ్చే ఛే వాశమ్.

చకారంగానిఛకారంగాని పరమైనప్పుడు విసర్జనీయం శకారమౌతుంది. కః + చరతి - కశ్చరతి అంతః+ఛిద్రమ్ - అంతశ్ఛిద్రమ్

౨ టే ఠే వా షమ్.

టకారంగాని ఠకారంగాని పరమైనప్పుడువిసర్జనీయం షకారంగా మారుతుంది బుధః + టీకతే-బుధష్టీకతే ఉక్తః + ఠకారః - ఉక్తష్ఠకారః

౩. తే థే వా సమ్.

తకారంగాని థకారంగాని పరమైనప్పుడు విసర్జనీయం సకారంగా మారుతుంది నక్రః+తరతి-నక్రస్తరతి కీటః + థుడతి - కీటస్థుడతి.

౪ క ఖయోర్జిహ్వామూలీయం నవా

క ఖలలో అకారం ఉచ్చారణ సౌకర్యంకోసం కకారంగాని ఖకారంగాని పరమైనప్పుడువిసర్జనీయం జిహ్వామూలీయంగా మారవచ్చును మారకపోవచ్చును కః+కరోతి - క ✕ కరోతి కః కరోతి కః + ఖనతి -క ✕ ఖనతి కః ఖనతి

౫. ప ఫయోరుపధ్మానీయం నవా

ప ఫ లలో అకారం ఉచ్చారణ సౌకర్యంకోసం పకారంగాని ఫకారంగాని పరమైనప్పుడు విసర్జనీయం ఉపధ్మానీయంగా మారవచ్చును, మారకపోవచ్చును కః + పరతి కలుపరతి, కః పరతి క + ఫలతి - కలుఫలతి, కఃఫలతి

౬. శే షే సేవా వా పరరూపమ్,

శకారంగాని షకారంగాని సకారంగాని పరమైనప్పుడు విసర్గనీయం పరరూపం పొందవచ్చు పొందకుండానూ ఉండవచ్చు రామః + శేతే - రామశ్శేతే, రామః శేతే కః+షష్ఠః - కష్షష కః షష్ఠః, కః + సాధుః - కస్సాధుః. కః సాధుః.

౭. ఉమకారయోర్మధ్యే.

అకారం పరమైనప్పుడు పదాన్తంలో అకారం వెనువెంటనే వున్న విసర్జనీయం ఉకారంగా మారుతుంది. రామః + అస్తి - రామ+ఉ + అస్తి - రామోఽస్తి (చూ సూ ౧ ౨ ౩) కృష్ణః + అత్ర - కృష్ణోఽత్ర

౮. అఘోషవతోశ్చ.

ఘోషవత్తులు పరమైనప్పుడుకూడా పదాన్తంలో అకారం వెనువెంటనే వున్న విసర్జనీయం ఉకారంగా మారుతుంది రామః+గచ్ఛతి - రామ+ఉ+గచ్ఛతి - రామోగచ్ఛతి కృష్ణః + దదాతి - కృష్ణో దదాతి గోవిన్దః+హసతి - గోవిందోహసతి

౯. అపరేలోప్యోఽన్యస్వరేయంవా

అకారేతరస్వరాలు పరమైనప్పుడు పదాన్తంలో అకారం వెనువెంటనేవున్న విసర్జనీయం లోపిస్తుంది. దానికి బదులు యకారమైనా రావచ్చు కః+ఆత్మా-క ఆత్మా, కయాత్మా రామః+ఏతి - రామఏతి రామయేతి ఈ యకారం మిక్కిలి తేల్చి పలకవలసినది.

౧౦ .ఆభోభ్యామేవ మేవస్వరే

స్వరం పరమైనప్పుడు పదాన్తంలో ఆకారానికి వెనువెంటనే ఉన్నవిసర్జనీయానికీ,భోశబ్దంచివరవున్న విసర్జనీయానికీగూడా పైవిధంగా లోపించనూవచ్చు లేదాయకారం రావచ్చు దేవాః + ఆహుః; దేవా ఆహుః, దేవా యాహుః భోః+అత్ర - భోఅత్ర, భోయత్ర భోశబ్దం భగోః,అఘోః అనే శబ్దాలకుగూడా గ్రాహకం కనుక భగోఅత్ర,భగోయత్ర ఇత్యాది రూపాలుకూడా వూహించుకోవచ్చును ఇక్కడకూడా యకారంమిక్కిలి తేల్చి పలకవలసింది

౧౧. ఘోషవతి లోపమ్

ఘోషవత్తులు పరమైనప్పుడు పదాన్తంలో ఆకారానికీ భో, భగో అఘోశబ్దాలకూ వెనువెంటనేవున్న విసర్గనీయం లోపిస్తుంది దేవాః + గచ్ఛన్తి - దేవా

గచ్ఛన్తి భోః+గచ్ఛ - భోగచ్ఛ భగోః+యచ్ఛ-భగోయచ్ఛ అఘోరః + యజ-అఘోరయజ.

౧౨ నామి పరో రమ్

అవర్ణేతర స్వరం వెనువెంటనే వున్న విసర్జనీయం రకారంగా మారుతుంది ముందు చెప్పబోయే "ఇరురోరీ రూరౌ" (౨-౩-౫౨) అనే సూత్రం ప్రకారం గిర్, ధూర్ ఇత్యాదిరూపాలు సిద్ధించి వాటి రేఫకు "రేఫసోర్విసర్జనీయః" (౨-౩-౬౩) అనే సూత్రంచేత విసర్జనీయం వచ్చి గీః ధూః ఇత్యాది రూపాలకు పదత్వం సిద్ధిస్తుంది వాటి విసర్జనీయానికి ఉత్తరపదప్రథమవర్ణం పరమైనప్పుడు రేఫంవస్తుంది. గీః+పతిః - గీర్పతిః, ధూః+పతిః - ధూర్పతిః

౧౩. ఘోషవత్స్వరపరః.

అవర్ణేతరస్వరం వెనువెంటనే వున్న విసర్జనీయం ఘోషవత్తులూ స్వరాలూ పరమైనప్పుడు రకారంగా మారుతుంది హరిః + అవతు - హరిరవతు హరిః + విదధ్యాత్-హరిర్విదధ్యాత్ పటుః + అస్తి-పటురస్తి వటుః + వదతి- టుర్వదతి హరేః+అవతః-హరేరవతః హరే + ధీమతః - హరేర్ధీమతః విష్ణోః +ఏషా - విష్ణోరేషా విష్ణోః + భార్యా- విష్ణోర్భార్యా

౧౪ రప్రకృతి రనామి పరోఽపి.

ప్రకృతి సిద్ధంగా కొన్ని పదాలచివర రేఫం వుంటుంది స్వర్, అన్తర్, ప్రాతర్, అహర్, పునర్, ఇత్యాదుల్లో ఇది గమనించవచ్చు ఈ రేఫకు పదాంతంలో రేఫ సోర్విసర్జనీయః(౨-౩-౬౩)అనే సూత్రం వల్ల విసర్జనీయమౌతుంది ఇలా రేఫానికి బదులు వచ్చిన విసర్జనీయం (అవర్ణేతరస్వరాలకు పరమందున్నా, అవర్ణానికి పరమందున్నా) స్వరఘోషవత్తులు పరమైనప్పుడు రేఫంగా మారుతుంది ప్రాతః + అత్ర -ప్రాతరత్ర పునః+ఏహి- పునరేహి స్వః + లోకే-స్వర్లోకే గీః+ఏధతే- గీ రేధతే పూః + అస్తి-పూరస్తి. పూః + దృశ్యతే పూర్దృశ్యతే

౧౫. ఏషస పరో వ్యంజనే లోప్యః

వ్యంజనం పరమైనప్పుడు ఏ ష స శబ్దాల పదాంత విసర్జనీయం లోపిస్తుంది ఏషః + గచ్ఛతి- ఏష గచ్ఛతి సః + వదతి- సవదతి స్వరం పరమైనప్పుడైతే- సః+ అవదత్- సోఽవదత్ (చూ సూ ౧-౫-౭) ఏషః+ఆనందమయః ఏష ఆనందమయః (చూ ౧-౫-౯) అయితే సమాసాన్తమందున్నవాటికి విధి వర్తించదు. అనేషః+గచ్ఛతి- అనేషోగచ్ఛతి. అసః +వదతి- అసోవదతి.

౧౬. నవిసర్జనీయలోపేపునఃసంధిః.

విసర్జనీయం లోపించిన తరువాత పూర్వ పరస్వరాలకు మళ్ళీ సంధి జరుగదు కః + ఇహ-క ఇహ ఇక్కడ 'క లో అకారాని కీ 'ఇ'కారానికీ (౧-౨-౨ సూ ప్రకారం) సంధి జరిగి 'కేహ' అనే రూపం రాదు అలాగే దేవాః + అహుః- దేవా అహుః అన్నచోట (౧-౨-౧ సూ ప్రకారం) దేవా హుః అనే రూపంరాదు

౧౭. రో రేలోపంస్వరశ్చపూర్వోదీర్ఘః

రేఫం పరమైనప్పుడు పదాన్తరేఫం లోపిస్తుంది దానికి వెనుకవున్న స్వరం దీర్ఘమౌతుంది పునర్ + రాత్రిః- పునారాత్రిః స్వర్ + రాజ్యమ్- స్వారాజ్యమ్.

౧౮. ద్విర్భావం స్వరశ్ఛకార.

స్వరానికి పరమందుండే ఛకారం రెండు ఛకారాలౌతుంది వృక్ష + ఛాయా-వృక్షచ్ఛాయా (ఇక్కడ "అఘోషే ప్రథమః" (౨-౩-౬౧) అనే సూత్రం ప్రకారం మొదటి ఛకారానికి అఘోషమైన రెండో ఛకారం పరమైనందున మొదటి ఛకారం వర్గప్రథమమైన చకారమైంది) కుటీ+ఛాయా - కుటీచ్ఛాయా స్వరపరమన్నందువల్ల ప్రసరత్ + ఛాయా- అన్నచోట వ్యంజనంకంటే పరమందున్న ఛకారానికి ద్విత్వంరాదు అంటే ప్రసరత్ ఛ్ఛాయా అనేరూపం రాదు ప్రసరత్‌లో తకారానికి ౧-౪-౫ సూత్రం ప్రకారం పరరూపమూ, ౨-౩-౬౧ సూత్రంచేత వర్గ ప్రథమత్వమూ వచ్చి ప్రసరచ్ఛాయా అని మాత్రమే రూపం వస్తుంది

ఇతి కాతన్త్రవ్యాకరణే ప్రథమస్యాధ్యాయస్య పంచమః పాదః, అధ్యాయశ్చ సమాప్తః

ఇది శ్రీ శ్రీనివాస సోదర కృత లఘువృత్తి సహితమైన కాతన్త్రవ్యాకరణంలో ప్రథమాధ్యాయంలో పంచమ పాదము

ప్రథమాధ్యాయము సమాప్తము

శ్రీ హయగ్రీవ కృపయా
నిర్వర్తితాంధ్రవ్యామియం కృతిః.
లఘువృత్తిః సమస్తాంధ్ర జనమోదాయ
కల్ప్యతామ్.

సంఘము - సంస్కారము

శ్రీ "కౌటిల్యుడు"

మనము సంఘమును సంస్కరించ వలయునని ప్రయత్నించు చున్నాము. సంఘమునకు కొన్ని నియమములనేర్పరచి తద్వారా మనలను మనము సంస్కరించుకొని సంఘము సంస్కరించ బడినదని రుజువు చేయుటకు కృషి చేయుచున్నాము మనముగాని సంఘముగాని, మనము సంఘము కలిసిగాని, ఎంత వరకు సంస్కరించ బడినామో యనునది చర్చనీయాంశముగా మాత్రము మన ముందుంచుకొని అందుకు తగిన సమాధానము చెప్పుకొన జాలని స్థితిలో మనమున్నాము

మనము సంస్కర్తలము సంఘము సంస్కరించ బడునది. మనమూవ్యక్తులమే. సంఘమూవ్యక్తులే. సంస్కర్తలు వ్యక్తులై, సంఘమూ వ్యక్తులై ఉండుటవలన ఎవరు యెవరిని సంస్కరించ వలయునో, ఎవరు యెవరికి నియమ నిబంధనలను యేర్పరచవలయునో, ఎవరు యెవరికి మార్గదర్శకులు కావలయునో యోచనచేసి నిర్ణయము చెప్పలేక పోవుచున్నాము.

మన మనుకొను సంస్కర్త లందరూ సంఘము చెడినదనుచున్నారు సంఘములోని పెద్దలందరూ మన మనుకొను సంస్కర్తలు సంఘము చెడిపోవుటకు కారకులైనారనుచున్నారు. సంస్కర్తలు చెడిపోయినారా? సంఘములోని పెద్దలు చెడిపోయినారా? సంఘమే చెడిపోయినదా? యీ మొదలైన ప్రశ్నలు యీ నాడు మనముందు ప్రత్యక్షముగా కనిపించు చున్నవి.

మన మనుకొను సంస్కర్తలు వారి పరిమితులకు లోబడిన భావ ప్రచారములను చేయుచున్నారని, అవి మన సంఘమున కుపకరించుటలేదని, మరియొక సంస్కర్తలసంఘము బయలు దేరుచున్నది అనుశ్రుతముగా నడవడిక గలిగిన సాంఘికరీతి యొకటి, అధునాతనమైన భావప్రచారములు చేయు సంస్కార సంఘమొకటి, అతి అధునాతనమైన విప్లవ భావములను ప్రచారము చేయు సంఘము మరి యొకటి, ఇలా బహుముఖముల యెవరికి తోచిన రీతిని వారి అభీష్టములను ప్రచారముచేయు సంఘములను నెలకొలిపి, తమతమ నడవడికలతో నిమిత్తములేని సంఘ సంస్కారమును ప్రపంచవ్యాప్తము చేయుటకుగాను ప్రబోధము చేయుచున్నారు

సంఘమునకు వ్యక్తిప్రధానమా? వ్యక్తికి సంఘము ప్రధానమా? వ్యక్తి, సంఘము పరస్పరాశ్రయములో నున్నారా? వ్యక్తి నుంచి సంఘమునుగాని సంఘము నుంచి వ్యక్తినిగాని యెడబాటు చేయు వాదప్రతివాదములను చేయుట సమంజసమేనా? వ్యక్తి చెడి పోయినటుల సంఘము, సంఘము చెడిపోయినటుల వ్యక్తి భావించుటవలన ప్రయోజనమున్నదా? ఈవిధమైన ప్రశ్నాపరంపరల భావనా ప్రాబల్యమే మన సమస్యలన్నిటికీ మూలకారణ మనిపించు చున్నది,

వ్యక్తికి శరీర మనునదియున్నది మనస్సు యనునది యున్నది శరీర పుష్టికి ఉత్తమాహారము కావలయునని కోరుకొనుచున్నాము. శరీరాలంకారమునకు ఉత్తమాలంకారములను సమకూర్చుకొనవలయునని ఆశించుచున్నాము. ఉత్తమశయ్యా సౌకర్యములను యేర్పరచుకొనవలయునని సంకల్పించుకొనుచున్నాము. అత్యుత్తమమైన యోగ్యమైన నివాసమును కల్పించుకొనవలయునని భావించుచున్నాము ఈ మొదలైనవి యీ

శరీరమునకు సుఖము నిచ్చునని నమ్ముచున్నాము. ఇవి సమకూడి మనకు సౌకర్యములను కల్గించవలెననినచో మన శరీరావయవములే మనకు యీ వీటిని ప్రసాదించగలవా? లేక యీ శరీరములో భాగముగా గుర్తించబడిన మనస్సే యీ వీనినన్నింటిని సమకూర్చుకొనుటకు వివేచన చేయగలిగిన నేర్పరితనమును సంపాదించిపెట్టి తద్వారా మన మనుకొను భౌతిక సౌకర్యములనన్నింటిలో యోగ్యమైనవానినే ప్రసాదించి పెట్టగలిగినశక్తిగలిగి యున్నదా? మనస్సు, శరీరముల శక్తిసామర్థ్యములలో దేనికి ఆధిక్యత యున్నది? మనస్సు గొప్పదా? శరీరము గొప్పదా? ఈవిధమైన తర్కవితర్కములను చేసి పూర్వీకులు శరీరములోని ఉన్నతమైన భావనాస్ఫూర్తికి మనస్సే కారణమని, యీ మనస్సును నిగ్రహించి శరీరావయవములు మనస్సు చెప్పిన దానికి తలవొంచి మెలగినచో సత్ఫలితములు ఒనకూడి జీవితమునకు సౌకర్యము, శరీరమునకు సౌఖ్యము మనస్సునకు ఆహ్లాదము, హృదయమునకు ఆనందముకలిగి మన మారోగ్యవంతులమై బ్రతికి బాగుపడుటకు మార్గమేర్పడునని వివరించియున్నారు

శరీరములోని భాగమైన మనస్సు శరీరముపై అధికారము కలిగి శరీరములో తానొక భాగమైయుండికూడ తన ఆధిక్యతను నిలుపుకొనుటకు యెలా నిరంతరము పని చేయుచుండునో, యే విధమైన జాగరూకత కలిగి ప్రవర్తించుచుండునో, యీ విధమైన నడవడికకు యేది కారణభూతమై కాలగమనమును గ్రహించితినని వివరించుచుండునో, అదియే యీ సమస్య లన్నింటికీ కారణమని మనమే తెలిసికొనిననాడు మనస్సును శరీరము సంస్కరించునా? శరీరమును మనస్సు సంస్కరించునా? యనునది పరిష్కరించబడును.

శరీరమునకు మనస్సు ఎంత ప్రధానమో, మనస్సుకు శరీరము అంతే ప్రధానమని మనము గ్రహించవలయును. మనస్సు శరీరమును సంస్కరించును. శరీర సంస్కారము మానసిక సంస్కారమును తెలియజేయును. శరీరము, మనస్సు ఒకే పదార్థమును ఆశ్రయించి యున్నవి శరీరమునకు కలిగిన అనుభవములు మనస్సునకు తెలియును. మనస్సే యీ శరీరానుభవముల నన్నింటినీ వివరించగలుగును, మనస్సును శరీరమునుంచిగాని, శరీరమును మనస్సునుంచి గాని వేరుచేసిన యెడల ఏ అనుభవము స్వీకరించబడకనే యుండును. ఏ అనుభవము వివరించబడకనే యుండును శరీరము, మనస్సు ఒక్కటిగా యుండు తన తన తనమును గ్రహించి, తన తన విద్యుక్త ధర్మమును నిర్వర్తించిన యెడల సమస్యలు పరిష్కరించబడి, సంస్కారము వ్యక్తీకరించబడి సద్గుణములే వ్యాప్తి చెందును.

వ్యక్తి సంస్కారము, సంఘ సంస్కారము ఒకేరీతిని వర్థిల్లిననాడు శాంతి సామరస్యములు సమకూరును.

సంఘముల నేర్పరచి సంస్కారవ్యాప్తికి కృషి చేయువారు సంఘనిబంధనలను శరీరముగాను, సాంఘిక ఆశయములను మనస్సుగాను భావించుకొని తమ తమ నడవడికలను తీర్చిదిద్దుకొనినచో, వ్యక్తి, సంఘము ఒకేఒక రూపములోని భావములు మాత్రమే నని గ్రహించి, మనస్సూ శరీరములవలె పరస్పర సహకారముతో ప్రవర్తనను రూపొందించుకొనిన, ప్రశాంతతయేర్పడి భ్రమరకీటన్యాయమువలె పరివర్తనచెంది, ప్రజామోదమును పొందుటకు పరిస్థితులన్నియూ సానుకూలములగును

వ్యక్తికి సంస్కారము కావలయునా? సంఘమునకు సంస్కారము కావలయునా? వ్యక్తికి, సంఘమునకు సంస్కారము కావలయునా? వ్యక్తిలేని సంఘముగాని సంఘము లేని వ్యక్తిగాని, వ్యక్తి, సంఘములేని వ్యవస్థగాని ప్రపంచమునందుండునని భావించుట అపహాస్యము కాదా? శరీరములేని మనస్సు, మనస్సులేని శరీరము లోకమునం

దుండునని చెప్పినచో మనము అవహేళన చేయమా? వ్యక్తికి శరీరమునకు, మనస్సుకు ఏ విధి విహితమైన సంబంధమున్నదో, వ్యక్తికీ సంఘమునకు అదే విధి విహితమైన సంబంధమున్నదని తెలియవలయును ఇది తెలియనందువలననే వ్యక్తి నడవడికలోని లోపములను విడిచి వ్యక్తి వివేకమును మెచ్చుకొనువారు, సంఘనియమములలోని లోపములను వదలి సాంఘికాశయములను మెచ్చుకొనువారు నేటి కాలమున అధిక సంఖ్యాకులున్నారు. సాంఘికాశయములు, సాంఘిక ఆచరణీయములు, వ్యక్తివివేకము, వ్యక్తిప్రవర్తన యివి యోగ్యమైనవి కావలెనని, అవి కలిగి యున్నవారినే మెచ్చుకొనవలయునని, యీ మెచ్చుకోలుతనమే వ్యక్తి జీవితమునకు సంఘ జీవితమునకు ఆదర్శమార్గమై వర్థిల్లునని, అదియే మానవ జీవితమునకు అత్యుత్తమమైన మార్గమని, ఎవరెవరు నిర్ధేశించుకొని తమతమ వ్యక్తిగతమైన నడవడికను, తమ తమ సాంఘిక సంబంధమైన బాధ్యతా ప్రవర్తనను తీర్చిదిద్దుకొనెదరో అనాడే వ్యక్తి జీవితమునకు ఆదర్శము, వ్యక్తి కార్యాచరణమునకు ప్రాముఖ్యము, సాంఘిక జీవితమునకు ఆదర్శము, సాంఘిక కార్యాచరణమునకు ప్రాబల్యము యేర్పడును.

మ హా క వి శ్రీ బా ణ భ ట్ట ప్ర ణీ త

పార్వతీ పరిణయము

ఆంధ్రీకరణ: శ్రీ జూలూరి హనుమంతరావు

౨

ద్వి తీ యాం క ము

(వనదేవతయగు వాసంతిక ప్రవేశించును)

వాసంతిక.-నందీశ్వరునిచే నాజ్ఞాపితురాలనైతిని. "వాసంతికా! నియమస్థితుఁడగు నీలలోహితునకు నందనవనము నుండి పూజా పుష్పములు తీసికొనిరా" యని నందీశ్వరు నాదిష్టము ప్రకారము ఆకాశమార్గమునఁబోయి నందనవనము నుండి దిశాముఖము లకు వ్యాపించిన సౌరభములు గల కల్పక ప్రసూనముల నపచయించుటకుఁ బోవుచున్నాను. (అని యటులే యొనర్చును.)

(తదుపరి రంభ ప్రవేశించును.)

రంభ:- తారకాసురునిచే బందిగ్రహణలై భయ పరిశంకితలగు నప్సరఃకాంతలు మహామేరుగుహాంతరములో నున్నారు. కుబేరనందనుఁడగు నలకూబరుని క్షణము వదలి జీవిత ధారణము సేయుట నాశక్యముకాదు. అందుచే నాతనియొద్దకే పోవుచున్నాను. (అని క్రిందకు దిగుచున్నది)

వాసంతిక:- (రంభనుజూచి) అరే! ప్రియసఖి రంభ వచ్చుచున్నది. ఆమెను గలసికొందును. (అటులే యొనర్చును)

రంభ:- అరే! హిమగిరి కటకనివాసిని యగు వనదేవత వాసంతికయా! ప్రియసఖికి శుభమగుగాక!

వాసంతిక:- ప్రియసఖి! ఎక్కడ నుండి రాక?

రంభ:- తారకాసురునిచే బందిగ్రహణలై భయపరిశంకితలగు నప్సరః కాంతలు మహామేరు గుహాంతరములో నున్నారు.

వాసంతిక:- నిజమే. అతఁడట్టి దుష్టశీలుఁడే.

రంభ - కుబేరనందనుని క్షణము చూడకుండ ప్రాణధారణము సేయలేనని ప్రియసఖిబాగుగ నెఱిఁగినవిషయమే.

వాసంతిక:- మీ యిర్వుర యన్యోన్యానురాగము ప్రసిద్ధమైనదని మొదలనే యెఱుగుదును.

రంభ:- మన్మథ కోదండ నిరంతర ప్రసరచ్ఛర పరంపరలచే జర్జరితహృదయనై వంచించి సఖీజనమునుండి నలకూబరు నభిసరించుచు నిచ్చటకు వచ్చితిని.

వాసంతిక.- అట్టి యనురాగమున కిట్టి వ్యాపారము తగినదియే.

రంభ:- మఱి, నీ వెచటకుఁ బోవుచున్నావు?

వాసంతిక - నిత్యానంద నిజస్వరూపుఁడు, లోచనమాత్ర బాడబుఁడు, భగవంతుఁడగు నీలలోహితునకు నందన వనము నుండి పూజా పుష్పములఁ

దెచ్చుటకు నందీశ్వరునిచే నాజ్ఞాపిత నై తిని.

రంభ:- ప్రియసఖి! అచట నూతనవృత్తాంతమేమయిన నున్నదా?

వాసంతిక:- క్రొత్తదేమియు లేదు. పితృ నిర్దేశానుసారము సపరిజనయై యుదయమున కుదయమేవచ్చి పార్వతి మహాదేవు నారాధించుచున్నది.

రంభ.- ఆరాధనా ఫలమేమిటి?

వాసంతిక.- పరమేశ్వర ప్రసాదము.

రంభ.- సరే! నీ ప్రస్తుత కార్యమొనర్చుటకు నీవు పో. నేనుగూడ నాసంకల్పిత కార్యముఁ జేయుటకుఁ బోవుచున్నాను.

(అని యిద్దరు నిష్క్రమింతురు)
(విష్కంభకము)

(ఉచితస్థానము నందధివసించి యింద్రుడు ప్రవేశించును)

మహేంద్రుఁడు:- (మండప ద్వారముఁ జూచి) ఎవరక్కడ?

దేవనంది.- (ప్రవేశించి) స్వామీ! అనుజ్ఞ.

మహే:- మహత్కార్యము విచారణీయమై యున్నది వెంటనే బృహస్పతినిఁ బిలచుకొనిరా. మఱెవ్వరును ప్రవేశింపఁబడకూడదు.

దేవ:- అటులనే. (నిష్క్రమించును.)

(బృహస్పతి ప్రవేశించును.)

బృహ - (ముందునకుఁ జూచి) మహేంద్రుఁడు వివిక్తస్థాన మండపమునందున్నాఁడు, అతఁడు-

దనుజచ్ఛేదము గాంచుఁ గొన్నిటను
నేత్రాలంబవిన్ గొన్నిటన్
గను స్నేహానన చారుదృక్పురుల
వీక్షల్ సేయుఁ గొన్నింటిచే
తను సేవాజనపాళి ప్రాంజలులఁ జిత్తం
బందుఁ జింతాపరుం
డన గా దర్శితుఁడయ్యె వాసవుఁడదే
యాలోచనా మగ్నుఁడై.

ఆతని సమీపించుదును. (అటులే యొనర్చును)

మహేం - ఇచటఁ గూర్చొనుఁడు.

బృహ - అటులనే (భద్రాసనాంతికమునఁ గూర్చొనును)

దేవ:- (ప్రవేశించి) స్వామీ! దేవదూత యగు దేవలుఁడు తాను విన్నవించుకొను విషయమున్నదని విన్నవించుకొనుచున్నాఁడు.

మహేం - అయినచో నాతని నొక్కనినే ప్రవేశింపఁజేయుము.

(దేవదూత ప్రవేశించును)

దేవదూత - ఈ దేవర బృహస్పతితో నేదియోమంతనము సేయుచున్నాడు. వారిని సమీపింతును (సమీపించి) దేవరకు జయమగుఁ గాత.

మహేం — దేవల! ఉద్విగ్నుఁడవై కనఁబడుచున్నావేల?

దేవదూత.- చాల దూరము వఱకుఁ బోయిన యసురులబాధను దేవర వారికి నేమని విన్నవింతును?

మహేం - భయపడవలదు. వారియుద్యమమంతయు జెప్పుము.

దేవదూత - చెప్పుదును వినుడు.

సురగంగా జలమందు స్వర్ణజలజస్తో
మమ్ములంద్రుంచి దు

ష్కరులా నందన పాదపమ్ములను నిచ్ఛా
రీతి నున్మ్రాలనా
కరులై వాంఛితవస్తుదాన చతురంగా
జేసి యా యర్జునిన్-
(అని అర్థోక్తిలో విరమించును)

మహేం - మిగిలినదికూడ చెప్పు.

దేవదూత-సురభామాకచముల్ గ్రహిం
చుటకునై సొత్తెంత్రు నిశ్శంకులై.

మహేం - దేవల! కులిశసహాయమునందు నాబాహువులు నిర్జిద్రములే ఎందులకీ విధముగా నతి శంకింతువు? ఎట్లన-

బలుని నముచి వృత్రుఁ బరిమార్చి ఛేదించి
శైలపక్షములను లీలగాఁ - ద్రి
లోకరక్షణ పటునాకుఁ దారకునందు
బ్రహ్మవరమె యంతరాయమాయెనె?

కొన్ని దినములలోనే యాతనికిఁ బ్రతిక్రియ జరుగనున్నది పొమ్ము. నీ నియోగిత కార్యాచరణుడవు కమ్ము.

దేవదూత - చిత్తము.(నిష్క్రమించును)

మహేం - గురువరా! అంతకన్నను జేయ వలసినదేమి? ఏ విధముగా ననిన నిన్ననే తారకాసురాక్రమణము సహింపని మాదృశుల యమరపరిష త్తుతోఁగూడి యుపస్థితుడై భగవానుఁ డగు పద్మయోని నిర్దేశించినాడు. "సేనానినిగాక యితరులెవరి చేతను దారకుఁడు నిహంతవ్యుఁడు కాడు. ఆ యుత్పాదనమం దీ యుపాయము,

చేరి హిమభూమి భృత్యాను సీమలోన
నాచరించెడు దపము శశాంకమౌళి
యే ప్రయత్నముచే నైననేని ప్రణయి
యగ నగాపుత పార్వతియందు నతఁడు

అటుపిమ్మట వారి యాత్మసంభూతుఁడు సేనానియగు కుమారునిచే మన మనోరథ సిద్ధి సంభవించున"ని. అట్లగుట గిరిజ, శంభునిచేఁ బరిగ్రహింపఁబడు నెట్లు? పరిగ్రహింపఁబడుచోఁ దనుత్పన్నుఁడగు కుమారుఁడు మన మనోరథమును బూరించునెట్లు?

బృహ - దైవములకు వ్యాహృతములు వ్యభిచరింపవు.

మహేం.- (స్మరణతో హర్షముతోడను) విరించి నిర్దేశించిన మన కార్యము నంగీకరించిన దానివలె పితృనిర్దేశిత యై సపరిజనయై పార్వతి యుదయమున కుదయమే వచ్చి యిందు శేఖరునిఁ బరిచరించుచున్నదని రంభా ముఖమున వినవచ్చినది.

బృహ.- మనకేది సిద్ధింపవలయునో యది యే తలంపఁబడినది.

మహేం:- పర్యవసాన మేమన-

అమరీముగ్ధ విలాసమంజులవచో వ్యాపా
రముల్ కర్ణ కాం
తములంజారు నపాంగవృత్తముల
విన్యాసోల్ల సద్ర్భూలతాం
గములన్ ప్రస్తుకుచోత్తరీయఘట
నాక్రమక్వణ త్కంకణ
భ్రమణమ్ముల్ గనఁబోడు సంయమి
వికార ప్రాభవమ్మెందకే.

పునరచింతనీయుఁడు, నధికానంద సుందరుఁడు, ననాదినిధనుఁడు, ననంజనుఁడు, నగుణక్రియుడు, నంతశ్చక్షువుచేఁ దననుదానే సాక్షాత్కారము సేసికొనుచు సకల దైవకల్పనా వికల్పముల నుపసంహృతి కావించుచు, స్వతంత్ర

కర్తయై చరాచరములకు నధికుండగు
చంద్రమౌళికి గౌరీపరిచరణము వశీకరణ
మగు టెట్లు?

బృహ:- భగవన్! అన్య యువతులవలె
గౌరిని సామాన్యగాఁ దలఁపవలదు.
ఎందుకన.

దేహ సౌందర్యమునఁ జొక్కి తృప్తిలేని
మనసు గలవాని కేల సంవనన కర్మ?
రమ్యతరదేహ యా శైలరాజసుతయె
యలరు పుష్పేషు సమ్మోహనాస్త్ర
మగుచు.

మహేం:- (హర్షముతో) పుష్పేషుఁడను
టచే జ్ఞాపితుఁడనైతిని. అతఁడే గిరిజా
చంద్రమౌళుల సంఘటనమునకు సమ
ర్థుఁడని.

బృహ:- (హర్షముతో)
సలుపుదతుఁ త్రైలోక్యశాసనమ్ము
దీపితంబైన భవదీయ దివ్యబుద్ధి
శాంతికము పౌష్టికము సేయ శక్తికలిగి
పొలుపుమీఱని కేవలబుద్ధి మాది.

ఎందుకన, మదీయబుద్ధి యీ వితర్క
మునం దుత్తీర్ణతఁ బొందలేక పోయినది.
ఆలసింపకయే కాముని పిలువనంపుము.

మహేం:- (మండపద్వారముఁ జూచి)
ఎవరక్కడ?

దేవ:- (ప్రవేశించి) స్వామీ! అనుజ్ఞ!

మహేం:- దేవనందీ! వెను వెంటనే
కామునిఁ బిలచుకొనిరా.

దేవ:- చిత్తము. (అని నిష్క్రమించును)
(రతి వసంతులతోఁ గాముఁడు ప్రవేశించును.)

కాముఁడు:- సర్వరము వెళ్లుదుము (అని
సమీపించును.)

మహేం:- (హర్షముతోఁ జూచి)
లలితధ్యానము లీను నా మధుపమాలా
మౌర్వితోఁగూడి సొం
పలరన్ స్కంధమునం ద్రిలోక జయ
యోగ్యంబైన చాపంబుతో
నలువం బౌ ప్రియురాలి చారుముఖ
విన్యాసంబు వీక్షించుచు
జ్వలుఁడై కూడి వసంతు నెచ్చెలుని
నిచ్చన్వచ్చు కాముండదే.

(కాముఁడు రతివసంతులతో దగ్గఱకు
వచ్చును. చాపగర్భాంజలితో విలాస
ముగాఁ బ్రణమిల్లును.)

మహేం:- (ఆసనాంతికమును జేతితోఁ
జూపుచు) సఖుఁడా! కామా! ఇచ్చట
కూర్చొనుడు.

(కాముఁడు రతి వసంతులతో గలసి
కూర్చొనును.)

బృహ:- మాననీయమగు స్థానమునందు
ననే మిమ్ము మహేంద్రుఁడు సత్క
రించు చున్నాఁడు.

కాముఁడు:- (అంజలి ఘటించి)
ప్రథితశక్తుండ త్రైలోక్యపతివి యింద్ర!
వలయుకార్యంబు నీకు నావలన నేమి?
యా యశేష సందీప్త దిగంతరుండు
దీపమునుఁ గాంతుసేయునే దినకరుండు?

బృహ:- నీ వీ విధముగా ననవలదు.

లోకమున నసామాన్యమై ప్రాకటముగఁ
జాప విద్యావిశేష ప్రశస్తిగాంచి
పరిభవిల్లెడు భవదీయ బాహువిపుడు
సకలకార్యమ్ము సురులకు సలుపవలయు.

మహేం:- సఖుఁడా! కామా!

అతి జవోర్జిత విష్ణు చక్రాయుధమున
నతుల శక్తమదీయ వజ్రాయుధమున
వలనుఁగా నిది యద్భుత బాహువీర్య
తేజ! సుమమయాస్త్రమ్ము సాధింప
వలయు.

కాము.- (గర్వముతో) స్వామీ! మీతోఁ బోలగలుగు నేది!

దనుజుఁడైనను లేక యే మనుజుఁడైన
మౌనియైన ముగ్ధుఁడు చంద్రమౌళియైన
నతఁడు స్వర్లోకభామినీ హావభావ
భాసిత కటాక్షశృంఖలా బద్ధుఁడగును

(మహేంద్రుఁడు బృహస్పతి ముఖ మవలోకించును)

బృహ.- కామా! నీచే నేది చరమార్థము "చంద్రమౌళి" యైనను పరిగణింపఁబడినదో, ఆ శంకరు డిప్పుడు శైలరాజసానుసీమలో నిరతిశయ శీత లాంతః కరణుఁడై తపమొనరించుచున్నాఁడు

కాము.- తరువాత తరువాత!

బృహ - అతని నిప్పుడు జనక ప్రేరణమున సపరిజనయై సౌభాగ్యమయ సాల భంజికవోలెను, సౌందర్యదేవతవోలె సురుచిర విగ్రహిణి పార్వతి పరిచరించుచున్నది

కాము - తరువాత తరువాత!

బృహ - వారి సంయోగమునందు దేవతలకు మహాకార్యసిద్ధి యగును. ఆ సంయోగక్రియ నిన్ను గటాక్షించును.

కాము - (తనలో) తననుదాను తెలిసికొనకుండుటయే పురుషులకు నాత్మ మరణముఁ గలుగఁజేయును. ఆత్మ ప్రశంసాపరవశుఁడనై పరమేశ్వరునిఁ గూడ సామాన్యవృత్తిచేఁ బరిగణించుటయే నా యనాత్మజ్ఞత.

వసంతుడు:- (తనలో) ఒకటి చేయఁదలచిన మఱియొకటి దాపురించినది.

చిమ్మి లలాట లోచనముచే స్ఫురితానలవిస్ఫులింగ బృం
దమ్ములు రౌద్రుఁడై త్రిపురదాహము - గొన్న మహేశుముందుఁ జొ
క్కమ్ముగ స్త్రీవశీకరణ కార్యమునందున జాగరూకుఁడై
యమ్ములు పూలువిల్లు చెఱకైన స్మరుం డితఁడెంత వాఁడయో!

రతి - అయ్యో! ఖండపరశువు నిర్జితుఁడు కావలెనను నత్యాహిత మాపతితమైనది.

కాము - పరిజనపరమాణువులచే నుత్కటుఁడైనను మహేంద్రుఁ డేకార్యమిచ్చగించుచున్నాఁడో యదియాత్మవ్యయముచేనైనను జేయఁదగినది.

మహేం.—

వరమగు నీ సమ్మోహన
శర సంహితమాత్ర శైలజావిలసచ్ఛ్రీ
భర సౌందర్యోదితముఖ
మరయు మహేశుండు ముగ్ధుఁడై
మోదముతోన్.

ఈ స్వల్పకార్యమునందు నేమాత్రము శంకింపవలదు.

కాము -

ప్రియతమమ్ములైన పీడ ప్రాణమ్ములఁ
జనుదుఁ గార్యమునకు- స్వాగతింతు

రమలమౌచుఁ గ్రాలు నాయశఃకాయమ్ము
సకలవేళల ననుషంగిజనులు.

స్వామిచే నాదిష్టప్రకారము చేయుదును.

మహేం:- (చేతులనెత్తి)
బృహ;-

అగుతన్ స్వస్త్యయనమ్ము దేవతల సత్యాశీర్వచశ్శక్తి కా
ర్యగునిన్ రక్షణసేయుగాత విపులంబై నీదు సత్కీర్తి ము
జ్జగముల్ వెల్గుత కల్గుగాత నిజదోశ్శౌర్యమ్మువిచ్ఛిన్నమై
తగనిచ్ఛాకర ధాత మాదగు ప్రయత్నమ్మున్ సమర్థించుతన్.

(కాముఁడు రతి వసంతులతోఁ గూడి శంకమానుఁడై నిష్క్రమించును.)

మహేం - గురువరా! బ్రహ్మాదేశము వలనఁ దగురీతిమనచేఁ కార్య మాచరింపఁబడినది. కార్యసిద్ధి యందు నా దేవీ నియతియే కలుగఁగలదు.


బృహ- ప్రస్తుత కార్యసిద్ధికొఱకు నేను గుల దేవతలఁ బ్రార్థించుటకై వెడలుదును

(అని- అందరు నిష్క్రమింతురు.)

మనవి

రచయితలు, చిత్రకారులు, తమతమ రచనలను చిత్రములను ప్రతినెల 10 వ తేదీ లోపుగా కార్యాలయమునకు చేరునట్లు పంపవలెను.
ప్రచురించని రచనలు, చిత్రాలు త్రిప్పిపంపగోరువారు,
వారిరచనలతో, చిత్రాలతో కావలసిన తపాలా
బిళ్ళలు పంపవలెను.

సంపాదకులు . నవభారతి
విజయవాడ-2


ఇప్పుడు ఆంధ్ర దేశమంతటా
అన్ని ముఖ్య పట్టణాలలోనూ
ప్రదర్శించబడుతోంది!
జెమిని వారి మహత్తర సాంఘిక చిత్రం
పైగాం
(సందేశం)
దిలీప్ కుమార్ · వైజయంతీమాల · రాజ్ కుమార్
బి.సరోజాదేవి · పంఢరీ బాయ్ · మోతీలాల్ · జానీ వాకర్

శ్రీమదాంధ్ర వేదాంత పంచదశి

[చిత్రప్రదీప ప్రకరణము]

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

౧౧

స్థూలదేహము లేకుండ సూక్ష్మదేహ
ముండ, దట్లు చూచిన యాతఁడుండఁ డెందు,
అందుచే సర్వమస్తకాద్యవయవములఁ
బరగునట్టి విరాట్టె యీశ్వరుఁడనంగ

వేయి శిరములఁ బాదాల వేయి కనులఁ
బరగువాఁడె యీశ్వరుఁడంచుఁ బురుషసూక్త
మందులకుఁ బ్రమాణంబని యవ్విరాడు
పాసకులు వాదించెడువారు చూపె

కాలు చేతులు క్రిమికీటకాలకున్న
యంతమాత్రాన నవి యీశుఁడనఁగఁ దగునె?
ఆ చతుర్ముఖుఁడే యీశుఁడనఁగఁ దగును
అన్యుఁడేమి కాఁడని కొందఱనెడువారు.

బ్రహ్మయె సృజించునని చెప్పఁబడుటచేత
సంతతిని గోరుచుండెడు జనులు తచ్చ
తుర్ముఖోపాసనము సేయఁదొడరు వారు
బ్రహ్మయే యీశ్వరుండని పలుకుచుంద్రు.

గమలమందునఁ బుట్టిన కమలభవుఁడు
విష్ణునాభి పద్మాన నావిర్భవించె,
నిందుచే శ్రీ మహావిష్ణు వీశ్వరుం డ
టంచు భాగవతులును వాదించుచుంద్రు

మహిని శైవులు శైవాగమమును బట్టి
శివునిపాదములనె తెలిసికొనలేని
గరుడ వాహనుఁడెట్టు లీశ్వరుడటంచు
పరమశివుఁడె యీశ్వరుఁడంచు బలుకుచుంద్రు

మున్ను త్రిపురాసురులఁ గెల్వఁబోవు నపుడు
శివుఁడు విఘ్నేశ్వరునిఁ బూజసేసి యేగెఁ
గాన గణపతియే యీశుఁడౌ నటంచు
గాణపత్యులు వాదింపఁ గడగుచుంద్రు-

అట్లె కొందఱు నాత్మమతాభిమాన
మనుసరించియె వేద మంత్రార్థములను
నాత్మ మతమున కనుగుణమైన యట్లు
పలుకుచును జేతు రీశ్వరోపాసనంబు

అర్క మశ్వత్థమాదియౌ నవనిజముల
దైవములుగఁ బూజించుచు స్థావరమ్ము
లాదిగాగ నంతర్యామి యంతవరకు
నీశ్వరునిగ వాదించువారింకఁ గలరు.

న్యాయ వేదాంత పరిశీలనం బొనర్చు
వారలకుఁ దత్త్వమేకమై పరగుచుండు
నన్యములు వారి యధికార మనుసరించి
తెలుపఁబడినవె యని యిందుఁ దెలుపఁబడెడు.

మాయయే ప్రకృతిగ నెంచు మాయయే యు
పాధిగాఁ గలవాని నీశ్వరుగ నెంచు,
ఈశ్వరుని యవయవములౌ నెల్ల భూత
ముల వలన నీ జగము వ్యాప్తము నయి యుండె

ఈశ్వరునిగూర్చి శ్రుతి నిర్ణయించినట్టి
పైని నిర్ణయించను న్యాయమైనదె యగు
స్థావరము జంగమంబగు సర్వజగము
ఈశ్వరుని స్వరూపంబను టే నిజంబు

అనుభవమునె ప్రమాణంబుగను నొనర్చి
తాపనీయంబనెడు నట్టి దానియందు
తత్త్వమో గుణరూపంబుఁ దాల్చు నదియ
మాయ యనియుండె వేదప్రమాణ మరయ.

ఆ తమోగుణరూపమైనట్టి మాయ
జడమని యనంతమని నజ్ఞానమనియు
బాలుఁడాదిగ నెల్ల గోపాలువరకు
అనుభవమ్మునె యెరుఁగుదురనియె శ్రుతియు

ఏ దచేతన మనుబుద్ధి యేది గలదో
అదె జడస్వరూపముయొక్క యనుభవమగు
అది జడంబని యెఱుఁగని యట్టి బుద్ధి
మోహమనిలో విదులు చెప్పుకొనువారు

మోహమును జడంబును తమంబునగు ప్రకృతి
అరయ ననుభవజ్ఞులకును ననుభవమగు
అదియు సత్తు నసత్తుగాదనియె వేద
మది యనిర్వాచ్యమగు, నశక్యమగుఁ దెలియ

మాయ లేనిదందుమ భాసమానమగును,
ఉన్నదందుమ లేదనుచుండె శ్రుతులు:
జ్ఞానమున నివర్తించెడి దైన కతన
అనుభవంబున లేనిదె యనియె శ్రుతియు.

మాయ క్రమముగ శ్రౌత సంబంధమైన
దృష్టిచే లేనిదియు, లోకదృష్టి చేత
వాస్తవమ్మైనదియు, యుక్తివలనఁ జెప్ప
నలవికానిది యనియును దెలియవలయు.

పటము దీయ బొమ్మయుఁ గానఁబడుచుఁ, బటము
మాయ బొమ్మయుఁ గనరాక పోయినట్లు
జగముయొక్క సత్త్వమ్ము నసత్త్వమెల్ల
మాయ చూపించుచుండు నమేయముగను.

మాయ చిద్రూపుఁడైన యాత్మను వదలియుఁ
దనరఁ జాలమిచే నస్వతంత్ర యగును
సంగరహితుఁ గూటస్థుని సంగము కల
వానిఁగాఁ జేయఁగ స్వతంత్రయైన దగును.

సహజముగ నిర్వికారుఁ డసంగుఁడైన
ప్రత్యగాత్మను జగముగాఁ బరిణమింపఁ
జేసి జీవేశ్వరులఁ జిదాభాసుఁగా వి
భాగముగఁ జేయునది యనిర్వాచ్యముగను.

ప్రత్యగాత్మ కేమాత్ర మెప్పగిదినేని
హాని కలుగనీయక ప్రత్యగాత్మయందు
నీ జగంబును గల్పించె నివ్విధముగ
మాయ సామర్థ్యమును వచింపంగఁదరమె.

ఉదకమున ద్రవత్వము, పీతిహోత్రునందుఁ
గాకయును, జాతియందునఁ గఠినతయును,
మాయ యందసాధ్యమగు సమర్థతయును
అన్యమునఁ గల్గవవియు సహజములె యగు.

ప్రత్యగాత్మను జగమెంతవరకుఁ దెలియ
దంతవరకు మాయయుఁ జిత్ర మాచరించు
ఆత్మయొక్క సాక్షాత్కారమైన పిదప
మాయ తనయంతఁదా మటు మాయమగును.

తార్కికులు నీ జగంబు సత్యమని యంద్రు
వారినిట్టు లాక్షేపింప వచ్చుఁగాని
వింతయె ముఖ్యరూపమై వెలయు మాయ
విషయమై చేయఁదగినట్టి వింతలేదు

జగము మాయామయంబను జనులతోడ
నీవు పెడవాదమును జేయ నెంచితేని
అంతకంటె వాదమ్ము సేయఁగల మేము
గాన నీడు నాక్షేపణల్ కిట్టిపెట్టు

అద్భుతమె స్వస్వరూపమైనదియుఁ గాన
తెలివి గలవాఁడు మాయను దొలఁగఁజేయ
అత్యధికముగ యత్నమ్ము నాచరించి
తన్నివారణోపాయముం దలఁపవలయు.

ఏది మాయా స్వరూపమో యెఱుఁగఁ గోరి
తేని లోకప్రసిద్ధమై యెల్లవారి
మోహపున్ వార్ధిలోపల ముంచుదాని
సహజపున్ స్వరూపముఁ జెప్పఁజనెద వినుము.

ఇంద్రజాలముం గనునప్పుడిదియు సత్య
మా, అసత్యమా- యని నిర్ణయంబుఁ జేయ
రానిదయ్యు స్పష్టమ్ముగఁ గానిపించు
నదియె మాయా స్వరూపమటంచు నెంత్రు.

ఈ జగంబు స్పష్టమ్మయి యిట్లు గానఁ
బడుచు నుండినఁ దన్నిరూపణ మశక్య,
మందుచే వాస్తవము చెప్పనౌ నటన్న
నిదియు మాయా స్వరూప మంచెంచవలయు.

ఈ జగత్స్వరూపము నిర్ణయింపఁగోరి
ఎట్టి పండితులును నిర్ణయింపలేక
పోయి, రయ్యది యజ్ఞానమునగుఁగాన
దీని పుట్టువెఱుఁగ నేరికేనిఁ గాదు.

ఇంద్రియమ్ములు దేహమునెట్లు శుక్ల
శోణితంబులచేఁ గల్గె వానియందు
నెట్లు చైతన్యమేర్పడె నీవు చెప్పు
మనిన నేనేమి చెప్పెదననఘ చెపుమ.

అదియు శుక్లశోణిత నైజమందువేని
అదియు నీచేతనెటు తెలియంగఁ బడియె
అన్వయ వ్యతిరేకములనెడు నవియు
వంధ్య శుక్లరక్తములచే వ్యర్థములగు.

శుక్ల శోణితములు గల్గుచోట నింద్రి
యములు దేహము పుట్టుట యన్వయంబు
శుక్లశోణితాల్ గలుగని చోట నింద్రి
యాదు లొదవమి వ్యతిరేకమనఁగఁ బరగు
వీర్యసేకము గల్గిన విశ్వమందు
బాలకుఁడు పుట్టునొక్కొ గొడ్రాలియందు.

గట్టిగా నీ జగముకేమి కారణంబు
చెప్పుమని నిల్వఁదీసినఁ జెప్పలేవు
ఇదియు నెవ్వరికేనియు నెఱుగరాదు
అందుచే నింద్రజాల మటంద్రు దీని

ఇంద్రజాల మిఁకేముండు నింతకన్న?
తరుణి యోనియందునఁ జేరు పురుషవీర్య
మయ్యెడల హస్తమస్తకాంఘ్ర్యాది రూప
ముగఁ బరిణమించి చేతనముగ జనించి
బాల్యయౌవన వార్ధక్యభావ మొంది
కనెడు తినెడు వినెడు మొదల్ పనులు సేయు

తనువుఁ గనినట్టి వటబీజమును గనుఁగొను
మఱ్ఱిగింజ యెక్కడ? నట్టి మఱ్ఱిగింజ
యందుఁబుట్టు చెట్టెక్కడ? అందువలన
నఖిలజగము మాయామయమంచు నెంచు.

ఉదయనాది తార్కికులెన్నియో యఖండ
పూర్వ పక్షాలొనర్ప నా పూర్వ పక్ష
ములకు హర్షాదు లుత్తరములను జెప్పి
కిమ్మనకయుండ నోరునొక్కిరి కరంబు

ఏవి యోజింప నలవి కావించుకేని
వానిఁగూర్చి యోజనము సల్పంగరాదు
ఈ జగంబు నాలోచింప నేమికాని
కల్పనంబని బుధుల సంకల్పమగును

ఈ జగత్కల్పనము వచియింపలేము
ఆ రచనకుఁ గారణము మాయయని తెలియు,
ఏకమైన మాయాబీజమే సుషుప్తి
అందు ననుభవింపఁగఁ బడునదియు నగును.

బీజమందున లీనమౌ వృక్షమట్లు
ఆ సుషుప్తి జాగ్రత్స్వప్నమగు జగంబు
నణగియుండును, నందుచే నఖిలజగము
వాసనలు మాయయందున వరలుచుండుఁ
గాన నీ మాయయే జగత్కారణంబు.

అంబుదమునఁ బ్రతిఫలించు నాకసంబు
వలెను బుద్ధివాసనలందుఁ బ్రతిఫలించు
ప్రత్యగాత్మ మన కెరుఁగఁ బడఁగరాదు
అట్లు స్పష్టముగాఁ దెలియంగఁ బడని
యా చిదాభాసు నూహచే నరయవలయు.

ఆ చిదాభాసుతోఁ గూడినట్టి మాయ
యనెడు బీజము బుద్ధిగ నంకురించు

నందుచే బుద్ధిఁ బ్రతిబింబమందు, నాత్మ
నా చిదాభాసుఁడని తెలియంగ నగును.
ప్రకృతి యా చిదాభాస రూపంబుచేత
నీశ్వరుని జీవునిన్ సృజియించు నంచు

శ్రుతివచించు, మేఘంబునఁ బ్రతిఫలించు
నాకసముగ నీశ్వరుఁడుండు నట్టివాఁడు
అంబువులఁ బ్రతిబింబించు నాకసముగ
జీవుఁడుండు వాడంచును జెప్పఁబడెడు.

శ్రీ మద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి

అ వ తా ర ఖ ం డ ము

౧

తనకొప్పు దనుజ కామినుల దాపటి చెంప
　　కును రాచుకొను నుంత కొప్పులందు;
దనత్రాడు దితిజకాంతల దిస్సఱొమ్ములం
　　దనుకొప్పు పుస్తెల త్రాడులందు
దనదైన నడుము దైత్యకులాంగనా స్పష్ట
　　నాభి పల్వలములౌ నడుములందు
దనలక్ష్య మసురనందన వధూనిస్త్రపా
　　సంధాన నర్మ లక్ష్యంబులందు

మూర్తి మన్మత్సరత్వముల్ మొనపియుండు
నే మహా కార్ముకంబున స్వామిచేతం
దెరల నింద్రావరజుం డరుదెంచె స్వభువు
పవిక్రతు హావిస్సులోం దనవంతుకొఱకు.

దశావతారములలో రామావతారము యొక్క యౌత్కృష్ట్యము సర్వజనులకు విదితమైనదే. కృష్ణావతారము నిజముగా నవతారమే కాదు. భగవంతుడు తాను తానుగా జన్మించెను కృష్ణావతారము యొక్క వైలక్షణ్యము వేరు ఆయన శిశుపాల దంతవక్త్రులను సంహారించుటకు జన్మించినాడందురు. ఈ కృష్ణుడవతరించి తానుచేసిన మహాకార్యములలో శిశుపాల దంతవక్త్రులను సంహారించుటకు భగవంతు డవతరించెనని చెప్పినచో తెలియవలసిన కార్యము తక్కిన యవతారము లట్టివికావు ఒక ప్రత్యేక కార్యముచేయుటకవతరించెను భగవంతుడది చేసెను అవతార సమాప్తియయ్యెను. కృష్ణావతారముకంటె దక్కిన తొమ్మిది యవతారములయందు స్వవిశిష్ట కార్యకరణమున్నది. శ్రీ రామావతారము దానిచేత స్వవిశిష్ట కార్యకరణత్వమందు విశిష్టత కలది ఆప్రభువు చేసిన కార్యమునందు విశిష్టత కలదు. తదవతారమునందు విశిష్టత కలదు, ఆయన చేతబూనిన యాయుధమునందుకూడ విశిష్టతకలదు అది ధనుస్సు. నాటినుండి నేటిపరకు తదాయుధ వహనమునందు శ్రీ రామచంద్రుడే మేలిబంతియైనవాడు ఈ ధనుస్సు మహావిష్ణువు యొక్కనైదాయుధములలో నొకటి. ఆయనకు శంఖచక్రగదాసిధనువులు పంచాయుధములు. శంఖమాయుధము కాదు. చక్రము కృష్ణుడై వాడెను. తక్కిన యే యవతారములందును దానిని వాడలేదు గదాయుధమునసలే వాడలేదు కత్తి యున్నది. దానిని కల్కియై పుట్టినప్పుడు వాడునట! ధనుస్సును రామావతారములో వాడెను. ప్రధానముగా శ్రీ మహావిష్ణువు చక్రాయుధమునే వాడును కాని రామావతారములో ధనుస్సునకు చక్రాయుధము యొక్క యాధిక్యమును తెచ్చెను భగవంతుని యాయుధముల దృష్ట్యా రామావతారమునందు శార్ఙ్గధనుస్సునకు విశిష్టత వచ్చినది. ఈ యవతార ఖండాదియందు

నా ధనుస్సుయొక్క యాధిక్యమును వర్ణించుటలోని వైశిష్ట్యమది! దశరథమహారాజు యజ్ఞము చేయుచుండగా సర్వదేవతలును వచ్చిరి. భగవంతుడు తన ధనుస్సును బుజమున వేసుకొని వచ్చెను. ఈ రీతిగా ధనుస్సుయొక్క ప్రాధాన్యము వర్ణింపబడినది. ఆ ధనుస్సు యొక్క కొప్పు రాక్షసస్త్రీల దాపట చెంపలందుగల ముంతకొప్పులందు మత్సరత్వము వహించినదట! ఆ కొప్పులు ముంత కొప్పులనుటచేత దాపటి చెంపలందు నున్నవనుట చేతనూ.

ఆ ధనుస్సుయొక్క యల్లెత్రాడు ధనుజ స్త్రీలయొక్క దిస్సబొమ్మలందు గల పుస్తెల త్రాడులందు మత్సరత్వము వహించినదనుట చేతనూ,

దాని ఆస్తకము దైత్యస్త్రీల స్పష్టనాభులైన నడుములందు మత్సరత్వము వహించిన దనుట చేతనూ,

దాని లక్ష్యము సిగ్గులేని దనుజకాంతా శృంగారపద్ధతులయందు మత్సరత్వము వహించినదనుట చేతనూ,

సర్వదానవ స్త్రీ భావము పరమేశ్వరుని యొక్క ధనుర్భావమును పొందిన దన్నట్లున్నది. దైత్యస్త్రీలయొక్క స్త్రీ లక్షణమునందు ధనుస్త్వమారోపితమైనది ఇది రూపకాలంకారము. ఈ రూపకాలంకారమిచట వ్యంగ్యము, మరియు, దాపటి కొప్పులు, దిస్సబొమ్మలు, స్పష్టనాభులు, నిస్త్రపాశృంగార భావములనుటచేత- రాక్షసస్త్రీలయొక్క విచిత్రమైన, విలక్షణమైన, యొక దైత్యత్వము వ్యంగ్యమగుచున్నది. వారి యాకారము, వారి శృంగారము ననాగరకమైనదని సూచింపబడుచున్నది. వారి యనాగరకత దీనియందు వ్యక్తమగుచున్నది. కనుక శ్రీరామచంద్రుడు మహానాగరకుడన్న విషయము వ్యంగ్యమగుచున్నది. అధిక్యము, ధనుస్సునందు వివక్షితమగుటచేత రామావతారమునకు ప్రాధాన్యము వచ్చుచున్నది. విష్ణువునకంటె శ్రీరామచంద్రుడే యధికుడా- యన్న సందేహాలంకారము ధ్వనించుచున్నది. ఆయన ఇంద్రావరజుడనుట చేత- త్రైలోక్యరక్ష చెప్పబడుచున్నది. స్వభువనుటచేత నతని పరమేశ్వరత్వము వివక్షితమై, క్రతుహావిర్భావమునకు వచ్చినాడనుట చేత యతడు లోకాతీతుడై లోకాంతర్గతుడగుట, నిరంజనుడై జగత్కార్య లగ్నబుద్ధియగుట,- నిట్టి విపరీత లక్షణములు భాసించుచున్నవి. తన వంతుకొఱకు ననుటచేత సర్వదానవ సంహారము తాను దేవతల సాహాయ్యముతో జేయునన్న భావము వ్యక్తమగుచున్నది. తక్కిన యవతారములలో భగవంతుడు తనకు తన్నుతాను- నిర్దేశించుకొన్న కార్యము తానొక్కడే చేసెను. ఇతరుల సాహాయ్యమును కోరలేదు ఒక్క రామావతారమునందే ఇతర దేవతల సాహాయ్యమును భగవంతు డభ్యర్థించెను. అందుచేత- తనవంతు కొఱకు- అన్నమాట రామావతారమునందలి ఈ ప్రత్యేకతను చెప్పుచున్నది.

కౌమోదకీ నందక సుదర్శనాయుధ
ములు పనిదీర్చును ముందె పోయి
చీటికి మాటికి శ్రీ వరారోహాని
విష్టచిత్తుఁడు తన్నుఁ బిల్వఁబోఁడు

అల్పదానవులు మున్నర్థించినట్టి వ
రంబులు తనదాఁక బ్రాఁకలేదు
తానన్న నితరాయుధములు చాలని యవ
సరముల కగు మహాసత్త్వశాలి

మించిపోయిన రొష్టు కల్పించె నెవఁడు
స్వామి కని యల్లె త్రాట వంచనిదికూడ
ఖంగు ఖంగున మ్రోఁగుచుఁ గదలివచ్చె
స్వామి భుజలంబమానమై శార్ఙ్గధనువు.

ఈ శార్ఙ్గ ధనుస్సునందు రావణవధ కార్యమునందలి యొక తీవ్రతను కవి యుత్ప్రేక్షించుచున్నాడు. భగవంతుడెప్పుడునూ తక్కిన యాయుధములనే యుపయోగించును. ప్రతిపనికి నవియే ముందుపోవును. భగవంతుడు తన్ను స్మరించనూ స్మరించడు. తక్కిన పనులన్నియు సామాన్యమైనవి. పదియైన గడ్డైనపని పుట్టినప్పుడుకదా, నెవడైనను తనకున్న సాధనములలో నధికమైనదానిని స్వీకరించును! ఈ శార్ఙ్గధనుస్సు, కౌమోదకీనందక సుదర్శనములకంటె- మహోన్నతమైన యాయుధమని యుత్ప్రేక్షించబడినది. భగవంతుని యొక్క యా యితరములైన యాయుధములు రావణవధ వంటి మహాకార్యమునకు బనికిరావు. సర్వావతారములలో రామావతారము సర్వోత్కృష్టమైనదో సర్వాయుధములలో ధనుస్సు సర్వోత్కృష్టమైనది. సృష్ట్యాదినుండి శత్రుసంహనన దక్షములైన యాయుధములలో ధనుస్సునకున్న మర్యాదదేనికిని లేదు. నేడు తుపాకి మొదలైనవి వచ్చెను. వాని నుపయోగించుటలోని నేర్పుకొద్ది. కత్తిని, ధనుస్సును నుపయోగించుటకు గావలసిన బాహుబలమును, కండరముల యందలి యొక విలక్షణమైన యభ్యాసజన్యమైన విశిష్టతయును వాని కక్కరలేదు. ఇవి కావలసిన యాయుధములు పూర్వము మానవజాతి వాడిన యాయుధములు. అవి వాడుటకు నొక యభ్యాసము, నొక నేర్పు, నొక పరాక్రమము గావలసియుండెను. యే యాయుధము వాడుటకైనను నివి కావలయును. కాని యాధునికాయుధములు వాడుటకు బరాక్రమ మక్కరలేదు. యభ్యాసమును, నేర్పునుసర్వత్ర కావలయును. పరాక్రమము వ్యక్తికి సంబంధించిన యొక జీవశక్తి. దానియొక్క సర్వోత్కృష్టమ్ము ధనుస్సును వాడుటలో నున్నది. అందులో శ్రీరామచంద్రుని మించినవాడు సృష్టిలో పుట్టడు. ఈ పద్యములో- రొష్టు- అన్న శబ్దము- తెలుగుమాట వాడబడినది. స్వామికెవడో రొష్టు కలిపించెనని శార్ఙ్గమనుకొన్నది. ఇది జాతీయమైన మాట. ఆమాటను వాడుటచేత శ్రీరామచంద్రుని యవతారము మానవజాతికి సన్నిహితమైన లక్షణములు కలది- యన్న భావము దూరాధ్వనితమగుచున్నది. మానవసృష్టిలోని సర్వమైన నాగరకతయు, సౌకుమార్యమును, ఆర్ద్రితయు, మనుధర్మనిష్ఠత్వము, జాతి సంరక్షణశీలత- శ్రీరామచంద్రుని పదలినచో మఱి యెచ్చటనున్నవి?

నాభి సంస్థములు ప్రాణము లింక నాడునే
యల్పదైత్యులకు దీర్ఘాయువులకు

గళసీమలకుఁ బైని గంరముల్ నిలుచునే
చండాసురులకుఁ బాషండులకును
ఒకఁడొక్కఁడూది బాహువు లింకఁ జెల్వగునే
విద్ధాశరులకు దోర్వీర్యులకును
స్వఃకామినుల చెఱపట్టుటల్ సాగునే
చెడిపె రక్కసుల కశృంఖలులకు

ప్రభు మహాయుధ మూలవిరాట్టు కదలి
కూడి విజయేందిరోగ్ర భ్రూకుటి యనంగ
విధృతమై లస్తకంబున వెడలివచ్చె
స్వామి భుజలంబమానమై శార్ఙ్గధనువు.

ఈ పద్యమునందు శార్ఙ్గధనుస్సు రావణాసురున కభిముఖముగా నడచుచున్నదనియే చెప్పబడినది. ఈ ధనుస్సు బయలుదేరి వచ్చినది ఇంక నల్పదైత్యులకు నాభిసంస్థములైన ప్రాణములాడునా?- అనగా నాడవని యర్థము. ఇందులో నున్న యర్థమేమనగా- మానవులకు ప్రాణ నిష్క్రమణవేళ- ప్రాణములు తొట్టతొలుత నాభియందు స్తంభించును ఈ విషయమిందున్నది కంఠములు నిలుచునా? చేతులు చెలగునా?- యనుటచేత రావణుని యొక్క దశకంఠత్వము- వింశతి బాహుత్వము- స్ఫూర్తమై రావణవధ భాసించుచున్నది. దేవతాస్త్రీలను చెఱబట్టుట లింకసాగవు- అన్న వాక్యముచేత సీతాపహరణము వ్యజ్యమానమగుచున్నది. సీతాపహరణము చెప్పకుండా— స్వఃకామినుల చెఱలు చెప్పుటచేత- సీతాపహరణమునకు ప్రాధాన్యము పోయినది. రావణవధకు సీతాపహరణము నిమిత్తమాత్రమైన కారణమని తెలియవలయును. సీత సాక్షాత్తు పరమేశ్వరి. ఆమెనొకడు ఎత్తుకొని పోవుటయేమి. ఆమె దుఃఖపడుట యేమి- యవి యన్నియు నేమియు లేవు. వట్టి మాయా కల్పనములు- అని ద్యోతమాన మగుచున్నది.

తన బహుకల్ప నిత్యమగు తాపసిరూపున వచ్చియున్న శా
ర్ఙ్గిని తొలివెల్గు బొడ్డు బదరీవనిలో ముదిచెట్టు క్రింద ప
చ్చని వెలుఁగొచు వచ్చుటను శార్ఙ్గ ధనుశ్చటులోగ్ర శృంగ గుం
ఫనములు లేనిచో గుఱుతుపట్టియ యుండరు సర్వదేవతల్.

ఈ పద్యమునందు భగవంతుడు తాను తన బహుకల్ప నిత్యమైన తాపసిరూపుతో నచటికివచ్చినాడు. ఆయన బుజమునందు శార్ఙ్గధనుస్సు కలదు అది లేనిచో తక్కిన దేవతలు శ్రీ మహావిష్ణువును శ్రీ మహావిష్ణువుగా గుర్తుపట్టియే యుండరు! ఈ భావముచేత గొన్ని ఇతర భావములు తాడితము లగుచున్నవి. మొదటిది- శ్రీరామచంద్రుడు పితృవాక్య పరి

పాలనార్థము తాపసిరూపము వహించిపోవునని- రెండవది- యద్వైతభావము. అద్వైత మతమునందలి వివర్తవాదము దీనియందు స్ఫురించుచున్నది నిత్యమైనది చైతన్యము- బ్రహ్మపదార్థము దాని లక్షణము తపస్సు. మూడవది- సర్వాబుుషులూ నేకాకారులే. చైతన్య మేకాకారమైనదే దానియందు భిన్నమైన లక్షణమునులేదు, గుర్తుపట్టుటయును లేదు శార్ఙ్గము తొలుత, నా హిరణ్యగర్భాకృతి సాక్షాన్నారాయణత్వము పొందినపుడు వాని నాయుధములలో శార్ఙ్గమొకటి- అందుచేత నా తాపసిని- విష్ణువుగా గుర్తుపట్టుటకు వీలయినది- అనుటచేత యీ పైన చెప్పబడిన సర్వ విషయములకు స్ఫూర్తిచేత ప్రాధాన్యము కలుగుచున్నది.

గ్రంథస్వీకారము

ఈ క్రింద పేర్కొనిన గ్రంథములు మా కార్యాలయమునకు అందినవి

మానవ యంత్రము
శ్రీ ముదిగంటి జగన్నశాస్త్రి
వెల, రు. 1-8-0
ప్రతులకు
ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ-2

ఉపనిషత్సుధ
(రెండవ యంజలి- కఠోపనిషత్తు)
వెల • రు 0-12-0

బుద్ధభగవానుఁడు
జీవిత సంఘటనలు
వెల రు 2-0-0

పై రెండు గ్రంథముల రచయిత •
శ్రీ చర్ల గణపతిశాస్త్రి
ప్రతులకు •
ఆర్ష గ్రంథమాల, సమిశ్రగూడెము
నిడదవోలు P. O. పశ్చిమ గోదావరిజిల్లా

కావ్యాలోకన
శ్రీ చిన్నకోట మాధవరావు
వెల రు 2 0-0
ప్రతులకు,
రసోదయా పబ్లిషర్సు, గుడివాడ

శ్రీ మద్భాగవతం
మాహాత్మ్యము
శ్రీ పురాణపండ రామమూర్తి
వెల రు 1-0-0

శ్రీరామ స్తోత్రావళి
అనువాదకులు
శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి
వెల 0-4-0
ప్రతులకు
ఆధ్యాత్మిక ప్రచారకసంఘం
విక్రమహాలు, రాజమండ్రి

కావ్యలక్ష్మి
(ఖండకావ్య సంపుటి)
కీ శే శ్రీ మంత్రవాది సుబ్రహ్మణ్యం
వెల 1-0-0
ప్రతులకు
తరుణ సాహితి
ఆలమూరు తూ గో జిల్లా.

Edited, Printed & Published by Sri J. Radhakrishna Reddy, Vijayawada-2
Printed at Nava Bharathi Press, Vijayawada-2